ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 5
జిల్లా వార్తలు
శనివారం 24, ఫిబ్రవరి 2024



సాక్షాత్తూ సీఎం చెప్పిన పచ్చి అబద్ధాలతో ఒంగోలులో శుక్రవారం జరిగిన పట్టాల పంపిణీ కార్యక్రమం అభాసుపాలైంది. జగన్ వ్యవహార శైలి, పార్టీపరంగా తీసుకున్న కొన్ని నిర్ణయాలు యావత్తు వైసీపీ నాయకత్వంతోపాటు శ్రేణుల్లోనూ కలవరాన్ని రేకెత్తించాయి. ఒకవైపు సభకు వచ్చిన జనం వచ్చినట్లే వెనుదిరిగి వెళ్లగా, మరోవైపు జగన్ తీరుతో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని అనుచరులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఇంకోవైపు జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మను మార్చాలన్న సీఎం జగన్ నిర్ణయంతో మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఆయన వర్గీయులు కంగుతిన్నారు. ఎంపీ మాగుంటతోపాటు దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, మాజీ మంత్రి శిద్దా, ఉమ్మడి జిల్లాకు చెందిన కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి, చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి తదితరులు కూడా రాకపోవడం వైసీపీ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది.



లబ్ధిదారుకు ఇంటి పట్టాను అందిస్తున్న సీఎం జగన్, పక్కన మంత్రి సురేష్, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే బాలినేని, మేయర్ సుజాత

అబద్ధాలతో అభాసుపాలు

- ఒంగోలు సభలో బాలినేని పేరును సీఎం ప్రస్తావించకపోవడంపై అనుమానాలు
- జడ్పీ చైర్‌పర్సన్‌ను మార్చాలన్న ప్రతిపాదనతో కలవరం
- మాగుంట, మద్దిశెట్టి, శిద్దా తదితరులు డుమ్మా
- చెవిరెడ్డికి సిగ్నల్.. మాగుంటకు గుడ్‌బై
- నాకోసం అమ్మను పక్కనపెట్టొద్దని కోరిన బూచేపల్లి
- జనం ఇలా వచ్చారు.. అలా వెళ్లారు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

భారీ ఆశలు, భయాలతో సమీకరించిన జనం ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. ముఖ్యమంత్రి మాట్లాడే సమయంలో సభలో చాలాభాగం ఖాళీ అయ్యింది. వివిధ ప్రాంతాల నుంచి బస్సుల్లో తీసుకొచ్చిన మహిళలు కూడా వాటిల్లోనే కూర్చుని వేదిక వద్దకు రాకపోవడం లాంటి ఘటనలతో శుక్రవారం ఒంగోలులో జరిగిన సీఎం సభ వైసీపీ నేతలకు నిరాశే మిగిల్చింది. సభావేదిక కింద సుమారు గంటన్నర ఉన్న సీఎం పోటీకి సిద్ధమైన అభ్యర్థుల ఈతిబాధలను పట్టించుకోకుండా పార్టీశ్రేణులతో ఫొటోలు దిగేందుకే ప్రాధాన్యమిచ్చారు. పైపెచ్చు ఈ సభలో జగన్ తడబడుతూ మాట్లాడటం, జిల్లాకు సంబంధించిన ఇతరత్రా ఏ అంశాలను ప్రస్తావించకపోవటం, అబద్ధాలతో కూడిన విషయాలను ఎక్కువగా చెప్పడంతో ఆయన ప్రసంగం సభికుల చెవికెక్కలేదంటే అతిశయోక్తి కాదు. పార్టీ నేతలకు మన ఒంగోలు లోక్‌సభ అభ్యర్థి చెవిరెడ్డేనని బహిరంగంగానే పరిచయం చేయడం ద్వారా జగన్ నోటి నుంచి అధికారిక సమాచారం కోసం ఎదురుచూస్తున్న ఎంపీ మాగుంటకు ఇక వైసీపీలో తనకు స్థానం లేదన్న స్పష్టమైన సంకేతం వచ్చేసింది. ఈ మొత్తం పరిణామాలతో పట్టాల పంపిణీ ద్వారా రాజకీయంగా లబ్ధిపొందాలనుకున్న వైసీపీ లక్ష్యం దెబ్బతినింది.

జన సమీకరణకు సర్వశక్తులు ఒడ్డారు. సీఎం కూడా సమయానికే సభకొచ్చారు. అయితే ఆతర్వాత చోటుచేసుకున్న వివిధరకాల పరిణామాలు వైసీపీ ఆశించిన ప్రతిష్ఠను తీసుకురాకపోగా కార్యక్రమం అభాసుపాలైంది. నిజానికి ఈ పట్టాల పంపిణీ కోసం బాలినేని ప్రత్యేక శ్రద్ధతో కృషి చేశారు. నిధులు రాబట్టుకునేందుకు రమారమి నెలరోజులు అలకపాన్పు కూడా ఎక్కారు. కానీ సీఎం తన ప్రసంగంలో బాలినేని పేరు కూడా ప్రస్తావించకపోగా తానే అంతా చేశానన్నట్లు మాట్లాడారు. మరోవైపు పట్టాల పంపిణీపై వైసీపీకి చెందిన నేత కోర్టులో పిల్ వేయగా.. జగన్ మాత్రం ఇది కూడా చంద్రబాబు పనేనని బహిరంగంగా అబద్ధం ఆడేశారు. దీంతో వేదికమీద ఉన్న నేతలే కాక సభకు వచ్చిన ప్రజలు కూడా నివ్వెరపోయారు.

బాలినేని పేరు ప్రస్తావించకపోవడంపై అనుమానాలు

తన ప్రసంగంలో ఏసందర్భంలోనూ బాలినేని పేరును సీఎం జగన్ ప్రస్తావించకపోవడం ఆయన అనుచరుల్లో తీవ్ర అసంతృప్తిని రగిలించింది. ఈవిషయమై బాలినేని కూడా అసంతృప్తితోనే ఉన్నారని అంటున్నారు. ఎన్నికల సమయం కావడంతో బాలినేని పేరును ప్రస్తావించి ఇన్ని పట్టాలు ఇప్పించిన అతనిని భారీ మెజారిటీతో గెలిపించాలని సీఎం కోరతారని అందరూ భావించారు. అది జరక్కపోవడంతో రాజకీయ విశ్లేషకుల్లో పలు అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. బాలినేని విషయంలో సీఎం సంతృప్తిగా లేరన్న విషయం తేటతెల్లమైందని కొందరు అంటుంటే, మాగుంటకు మద్దతుగా నిలిచిన బాలినేని పట్ల సీఎం అసంతృప్తిగా ఉన్నారని మరికొందరు అంటున్నారు. బాలినేని చివర్లోనైనా వైసీపీకి గుడ్‌బై చెబుతారేమోనన్న అనుమానం సీఎంలో ఉందని, అందుకే ఆయన గురించి ప్రస్తావించకుండా అంతా తానే చేశానని చెప్పుకున్నారని కూడా భావిస్తున్నారు.

మాగుంటకు అవకాశం లేదని తేల్చేసిన జగన్

ఒంగోలులో సభ పూర్తయి వెళ్లేటప్పుడు గంటన్నరపాటు తనను కలిసిన నాయకులు, కార్యకర్తలతో ఫొటోలు దిగిన జగన్.. మీ లోక్‌సభ అభ్యర్థి చెవిరెడ్డేనని అందరికీ పరిచయం చేశారు. గతంలోనే చెవిరెడ్డికి పార్టీ బాధ్యతలిచ్చి ఒంగోలుకు పంపిన విషయం తెలిసిందే. మాగుంట కూడా తన కుమారుడి కోసం ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే కాదు పొమ్మన్నామని అధికారికంగా వైసీపీ ప్రకటిస్తే బయటపడాలని మాగుంట, వెళ్లిపోతే ఆ నెపం ఆయనమీదే వేయాలని వైసీపీ అధిష్ఠానం డ్రామాలు ఆడుతున్నాయి. శుక్రవారం సభతో మాగుంట విషయంలో పూర్తిస్థాయి స్పష్టత వచ్చినట్లైంది. ఈ సభకు మాగుంటతోపాటు తనకు ఎక్కడా టికెట్ ఇవ్వకపోవడంతో అసంతృప్తితో ఉన్న దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కూడా గైర్హాజరయ్యారు. ఆయన కూడా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించుకుంటున్నట్లు సమాచారం. గత ఎన్నికల అనంతరం వైసీపీలో చేరి ఉమ్మడి జిల్లాలో సీఎం ఎక్కడికొచ్చినా వెళ్లి కలిసే మాజీ మంత్రి శిద్దా కూడా ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. టీటీడీ సభ్యుడిగా ఉన్న ఆయన కుమారుడు సుధీర్ వచ్చినా రాఘవరావు గైర్హాజరుకావడంపై పలు అనుమానాలను విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉండి ఈ ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వడం లేదని జగన్ తేల్చిచెప్పిన కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి, చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచిలు కూడా మర్యాదపూర్వకంగానైనా రాకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గ స్థాయిలో పలువురు నాయకులైతే ఈ సభకు డుమ్మాకొట్టారు.



సర్వ శక్తులు ఒడ్డినా..

ఒంగోలులో 20,800మందికి నివేశన స్థల పట్టాల పంపిణీ కోసం శుక్రవారం నిర్వహించిన సభకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో అధికారులతో కలిసి భారీ ఏర్పాట్లు చేశారు.

జడ్పీ చైర్‌పర్సన్‌గా ఇందిరను ఎన్నుకోండి



జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న వెంకాయమ్మను మార్చేసి ఆమె స్థానంలో తర్లుపాడు జడ్పీటీసీ సభ్యురాలిగా ఉన్న వెన్నా ఇందిరను ఎంపిక చేయాలని జగన్ సూచించారు. సభావేదిక కింద నాయకులతో మాట్లాడేటప్పుడు జగన్ ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ వెంటనే ఆపని పూర్తి చేయాలని బాలినేనిని ఆదేశించారు. ప్రస్తుత చైర్‌పర్సన్ వెంకాయమ్మ కుమారుడు శివప్రసాదరెడ్డికి దర్శి టికెట్‌ను ఖరారు చేసిన విషయం తెలిసిందే. అలాగే తర్లుపాడు జడ్పీటీసీ భర్త, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి బాలినేని ద్వారా మార్కాపురం టికెట్ కోసం ప్రయత్నించగా ఆయనకు అవకాశం ఇవ్వలేదు. అయితే ఇందిరను జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎంపికచేయాలని జగన్ సూచించడం విశేషం. ఇది పార్టీశ్రేణుల్లో కలకలాన్ని సృష్టించింది. ఆ తర్వాత శివప్రసాద్‌రెడ్డి జగన్ వెనుక పరుగు తీశారు. హెలిప్యాడ్ వద్ద ఆయన సీఎంతో తన తల్లికి చైర్మన్ పదవి ఉంచాల్సిందేనని కోరినట్లు తెలిసింది. ఒకే ఇంట్లో రెండు పదవులు అవసరమా? అని జగన్ ప్రశ్నించడంతో శివప్రసాదరెడ్డి ఇప్పటికే దర్శిలో ప్రచార కార్యక్రమం ప్రారంభించానని పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరినట్లు సమాచారం. ఈ తాజా నిర్ణయం యావత్తు వైసీపీ శ్రేణుల్లోనూ కలకలాన్ని సృష్టించింది. అనుకున్న ప్రకారం జగన్ ముందుకెళ్తారా? వెనక్కు తగ్గుతారా? అన్నది చూడాల్సి ఉంది.

వద్దు బాబోయ్!

- జనం చెవికెక్కని జగన్ ప్రసంగం
- సీఎం మాట్లాడుతుండగానే వెనుదిరిగిన మహిళలు
- బస్సులన్నీ సభకు తరలించడంతో ప్రయాణికులకు పాట్లు
- ప్రీ ఫైనల్ పరీక్షలు రాసే విద్యార్థుల అవస్థలు
- పట్టాల పంపిణీ కార్యక్రమంపై ప్రజల పెదవి విరుపు



ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 23 : ఒంగోలులో పేదలకు పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రజలకు విసుగు పుట్టించింది. సీఎం జగన్మోహన్‌రెడ్డి పదేపదే టీడీపీ అధినేత చంద్రబాబును విమర్శించడానికే ఒంగోలు వచ్చినట్లుందని పలువురు పెదవి విరిచారు. జగన్ ప్రసంగం జనం చెవికి ఎక్కకపోవడం స్పష్టంగా కనిపించింది. ఒంగోలులోని పేదలకు పట్టాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నగర పరిధిలోని ఎన్.అగ్రహారంలో నిర్వహించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. వారంరోజులుగా, అధికారులు, వైసీపీ నేతలు నానా హడావుడి చేశారు. అయితే వారు అనుకున్నట్లు జన సమీకణలో సక్సెస్ అయినా, ప్రజల మనసు గెలుచుకోవడంలో విఫలమయ్యారు. ఒంగోలు వచ్చిన సీఎం.. పేదలకు తాను పట్టాలు ఇచ్చానని, తాగునీటికి నిధులు కేటాయిస్తానని గంటసేపు ఊకదంపుడు ఉపన్యాసం చేశారు. అధిక సమయం చంద్రబాబు, ఆంధ్రజ్యోతి, ఈనాడు, టీవీ-5పై విరుచుకుపడ్డారు. అయితే ప్రజలు, ఆయన ప్రసంగాన్ని చెవికి ఎక్కించుకోలేదు. సీఎం మాట్లాడుతుండగానే ప్రాంగణం వదిలి బస్సులెక్కారు. కొందరైతే నడుచుకుంటూనే రోడ్డుపైకి చేరారు.

ప్రయాణికుల అవస్థలు

సీఎం సభకు 506 ఆర్టీసీ బస్సులు కేటాయించడంతో రోజువారీ ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. సభకు ఒక రోజు ముందే బస్సులన్నీ ఆయా ప్రాంతాలకు తరలించడంతో గురువారం నుంచే ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. తెలియక వచ్చిన వారు గంటలకొద్దీ బస్టాండ్లలో పడిగాపులు కాశారు. అంతేకాకుండా గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి కూడా బస్సులు కేటాయించడంతో అన్ని డిపోలలోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

విద్యార్థులకు తప్పని కష్టాలు

జిల్లావ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల బస్సులన్నీ సీఎం సభకు కేటాయించడంతో విద్యార్థులకు అవస్థలు తప్పలేదు. ఒకవైపు శుక్రవారం నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్స్ ఎగ్జామ్స్ ప్రారంభం కాగా, ఆరు నుంచి 9వ తరగతి వారికి ఎఫ్ఏ-4 పరీక్షలు మొదలయ్యాయి. దీంతో విద్యార్థులు పరీక్షలకు వెళ్లేందుకు నానా అగచాట్లు పడ్డారు.

చీరలు ఇస్తారని ఆశపడి నిరాశగా ఇంటికి..

ఇళ్ల పట్టాలు పంపిణీ సమయంలో ప్రతి మహిళకు చీర, పురుషులకు ప్యాంట్, షర్ట్ ఇస్తామని ఆపార్టీ నాయకులు తెలపడంతో ప్రజలు ఆశతో అధికసంఖ్యలో హాజరయ్యారు. అయితే అక్కడ చీరల పంపిణీ లేకపోవడం, కొత్తగా ఇళ్లపట్టాలు ఇవ్వకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఒకవైపు మండుటెండలో ఉక్కపోతల మధ్య అల్లాడిన జనం సభ సగంలోనే ఇంటిబాట పట్టారు.

సీఎం, బాలినేని ప్రసంగిస్తుండగానే వెనుదిరిగిన జనం

జన సమీకరణకు ప్రైవేటు, ఆర్టీసీ బస్సులు వెయ్యికిపైగా కేటాయించారు. సీఎం సభకు రాకుంటే పథకాలు తొలగిస్తామని బెదిరించారు. దీంతో తప్పదని భావించిన జనం ఒక పూటే కదా పోయి వద్దామని భావించి రాగా, నేతల ప్రసంగం పెద్దగా రుచించలేదు. ఉదయం 11 గంటలకు సీఎం రాగా, అప్పటికే జనం ఇంటిబాట పట్టారు. సభ ముగిసేందుకు చాలాసమయం పడుతుందని కాలినడకన బయల్దేరారు. అయితే ఉన్నవారిలో అధిక శాతం మంది తొలుత కలెక్టర్ పరిచయ ప్రసంగంలో కొద్దిసేపు ఉన్నప్పటికీ ఆ తర్వాత బాలినేని, జగన్ మాట్లాడే సమయంలో పోలోమని వెళ్లిపోయారు. దీంతో సీఎంతోపాటు నేతల ముఖాల్లో అసంతృప్తి స్పష్టంగా కనిపించింది.

తాగునీరు తప్ప తిండి లేదు..

సీఎం సభ విజయవంతం కోసం వైసీపీ నేతలు పరుగులు పెట్టారు. ఉదయం 8గంటల నుంచే డివిజన్ల నుంచి మహిళలను తరలించే కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. వారికి టిఫిన్ అందించి బస్సులెక్కించిన నేతలు ఆ తర్వాత సభ ముగిసే వరకు వారి బాగోగులు పట్టించుకోలేదు. కేవలం తాగునీటి బాటిల్స్ ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. అరకొరకగా ఆహారం అందించగా అది సరిపోక ప్రజలు ఆకలితో అల్లాడిపోయారు. సుమారు 40వేల మంది వరకు జనసమీకరణ చేసినప్పటికీ అందుకు అనుగుణంగా మరుగుదొడ్లు నిర్మించలేదు. కేవలం ఓ ఇరవై మరుగుదొడ్లు నిర్మించి వదిలేయడంతో మహిళలు తీవ్ర అవస్థలు పడ్డారు.

మంచినీటి పథకానికి సీఎం శంకుస్థాపన

ఒంగోలు నగరానికి రోజూ మంచినీరు ఇచ్చేందుకు రూ.339 కోట్లతో నిర్మించనున్న పథకానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మి సీఎంకు మ్యాప్ ద్వారా పథకం తీరును వివరించారు. కాగా బహిరంగసభ వేదిక వద్ద ఏర్పాటుచేసిన స్టాల్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను సీఎం పరిశీలించారు. సభ అనంతరం ఐదుగురు లబ్ధిదారులకు ఇంటి పట్టాతోపాటు రిజిస్ట్రేషన్, గృహ మంజూరు పత్రాలను సీఎం అందజేశారు. నగరానికి చెందిన మర్రి వెంకటరాజేశ్వరి, కొక్కిలగడ్డ రోజ, మల్లవరపు నాగజ్యోతి, కొంగర జ్యోతి, చెర్లోపల్లి దివ్యలకు ఈ పత్రాలను అందజేశారు.

ఇద్దరికే అవకాశం

మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రేక్షక పాత్ర

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 23: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్న బహిరంగసభలో ఇద్దరికే మాట్లాడే అవకాశం కల్పించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ అధ్యక్షోపన్యాసం చేయగా, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కొద్దిసేపు ప్రసంగించారు. పట్టాలు పొందిన ఇరువురు లబ్ధిదారులతో మాట్లాడించారు. సభలో ముగ్గురు మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ హోదాల్లోని కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నా ఎవ్వరికీ ప్రసంగించే అవకాశం కల్పించలేదు. కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు ధర్మాన ప్రసాదరావు, ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, ఎమ్మెల్యేలు కరణం బలరామకృష్ణమూర్తి, అన్నా రాంబాబు, కె.నాగార్జునరెడ్డి, సుధాకర్‌బాబు, మధుసూదన్‌యాదవ్, ఎమ్మెల్సీలు పోతుల సునీత, తూమాటి మాధవరావు, చంద్రశేఖర్‌రెడ్డి, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మేయర్ గంగాడ సుజాత, పార్టీ జిల్లా ఇన్‌చార్జీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం.ప్రసాద్‌రెడ్డి, పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శ్రీలక్ష్మి, సీసీఎల్‌ఏ ఇన్‌చార్జి సెక్రటరీ ఇంతియాజ్ పాల్గొన్నారు.




ఎఫ్ఏ-4, ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 23 : పాఠశాలల్లో 1 నుంచి 9 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ)4, పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం పరీక్షలు నిర్వహించారు. హైస్కూళ్లు, ప్రాథమిక పాఠశాలల్లో 6, 7, 8 తరగతులు చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్నం 1.10 నుంచి 2.40 వరకు తెలుగు, 2.45 నుంచి 3.45 వరకు గణితం పరీక్ష నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.45 నుంచి 10.45 వరకు తెలుగు, 11 నుంచి 12 గంటల వరకు గణితం పరీక్ష జరిగింది. పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 నుంచి 4.30 గంటల వరకు తెలుగు పరీక్ష నిర్వహించారు. వీరికి ప్రశ్నపత్రాలను డీసీఈబీ ద్వారా ఎమ్మార్సీలకు పంపారు. అక్కడి నుంచి ఎంఈవోలు గంట ముందుగా హెచ్‌ఎంలు లేదా టీచర్ల ద్వారా ఆయా పాఠశాలలకు పంపారు. 1నుంచి 9 తరగతుల వరకు ప్రశ్నపత్రాలను వాట్సాప్ ద్వారా సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలకు పంపుతారు. వాటిని జెరాక్స్ తీయించి విద్యార్థులకు అందజేసి పరీక్ష నిర్వహించారు.

3 రోజులు.. 8 నియోజకవర్గాలు

- వచ్చేనెల మొదటి వారంలో ఉమ్మడి జిల్లాకు లోకేష్
- తొలి సభ ఎర్రగొండపాలెంలో.. ఏర్పాట్లను పరిశీలించిన ఇన్‌చార్జి



ఒంగోలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మరోసారి ఉమ్మడి జిల్లా పర్యటనకు రానున్నారు. యువగళం పాదయాత్ర విజయవంతం అనంతరం కొద్దిరోజులు ఆగి తిరిగి శంఖారావం పేరుతో రాష్ట్రవ్యాప్త పర్యటనలకు లోకేష్ శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఉత్తరాంధ్రలోని ఐదు జిల్లాల్లో ఆ కార్యక్రమాన్ని పూర్తిచేసిన లోకేష్ వచ్చేనెల తొలివారంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు రానున్నారు. మూడు రోజులపాటు ఎనిమిది నియోజకవర్గాల్లో శంఖారావ సభలు ఉండనున్నాయి. తొలిరోజు యర్రగొండపాలెం, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లో.. రెండో రోజు ఒంగోలు, కొండపి, కందుకూరులలో, మూడో రోజు కనిగిరి, గిద్దలూరుల్లో నిర్వహించిన సభల్లో లోకేష్ పాల్గొంటారు. మూడో రోజు సాయంత్రం కడప జిల్లా బద్వేల్ వెళ్లనున్నారు. ఆ మేరకు మూడురోజుల కార్యక్రమంపై ఇక్కడి టీడీపీ నేతలకు సమాచారం ఇచ్చారు. తొలుత ఈనెల 26 నుంచి 28 వరకు వరుసగా మూడు రోజులు కార్యక్రమం ఉంటుందని తదనుగుణంగా ఏర్పాట్లు చూసుకోవాలన్న ఆదేశాలు అందాయి. అయితే ఈనెల 28న టీడీపీ, జనసేనల ఉమ్మడి రాష్ట్రస్థాయి సభను తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేస్తుండటంతో జిల్లాలో లోకేష్ పర్యటన తేదీల్లో కొద్దిపాటి మార్పులు చోటుచేసుకున్నాయి. దాని వల్ల మార్చి మొదటి వారానికి లోకేష్ జిల్లా పర్యటనను మార్చినట్లు తెలిసింది. తొలిసభ వైపాలెం కావడంతో లోకేష్ పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించే బృందం సభ్యులు శుక్రవారం అక్కడికి వచ్చి ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుతో కలిసి సభాప్రాంగణం, స్థల పరిశీలన చేశారు. ఇతర ఏర్పాట్లపై చర్చించారు.



ఎర్రగొండపాలెంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎరిక్షన్‌బాబు, టీడీపీ నాయకులు

ఉమ్మడి జిల్లాలో సిద్ధం చివరి సభ

- పిచ్చుకలగుడిపాడు వద్ద నిర్వహణ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీ ఎన్నికల సన్నాహకంలో భాగంగా నిర్వహిస్తున్న సిద్ధం బహిరంగ సభను ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఆ పేరుతో ఇప్పటికి రాష్ట్రంలో మూడు సభలు నిర్వహించిన వైసీపీ నాల్గో సభను జాతీయ రహదారికి దగ్గరగా కొరిశపాడు మండలం పిచ్చుకలగుడిపాడు వద్ద వచ్చేనెల 3వ తేదీన నిర్వహించబోతోంది. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాలకు సంబంధించి ఈ సభను ఏర్పాటు చేయాలని భావించారు. ఆ మేరకు ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి శుక్రవారం తాడేపల్లిలో సన్నాహక సమావేశాన్ని కూడా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి మేరు నాగార్జున, పర్చూరు, అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిలు యడం బాలాజీ, పాణెం హనిమిరెడ్డిలు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వైవీ సుబ్బారెడ్డి సొంత నియోజకవర్గం అద్దంకి కావడం, పైగా ఆయన స్వగ్రామమైన మేదరమెట్లకు దగ్గరగా పి.గుడిపాడు ఉండటంతో అక్కడ సభను నిర్వహించాలని నిర్ణయించినట్లు భావిస్తున్నారు.

నేడే టీడీపీ, జనసేన తొలి జాబితా

- ఎన్ని స్థానాలకు అవకాశం అనేది సందిగ్ధం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వచ్చే ఎన్నికల్లో పోటీచేయనున్న తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమి అభ్యర్థుల తొలి జాబితాలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కొందరికి అవకాశం దక్కనున్నట్లు సమాచారం. శనివారం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలిసి జాబితాను విడుదల చేయనున్నారు. అంతకు ముందు కొందరు సీనియర్ టీడీపీ నాయకులతో ముందుగా చంద్రబాబు మాట్లాడనున్నారు. ఆ సమావేశానికి అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్‌కు కూడా ఆహ్వానం అందినట్లు తెలిసింది. కాగా ఉమ్మడి జిల్లాలో ఏడు స్థానాలకు టీడీపీ అభ్యర్థులను గతంలో ఖరారు చేసినప్పటికీ మూడు నుంచి ఐదు స్థానాలలో మాత్రమే అభ్యర్థులను తొలి జాబితాలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. దర్శిని జనసేనకు కేటాయించాలని నిర్ణయించినప్పటికీ తొలి జాబితాలో ఆ అభ్యర్థిని ప్రకటిస్తారా? లేదా? అన్నది అనుమానమే. ఉమ్మడి జిల్లాలో టీడీపీకి ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలు స్వామి, రవికుమార్, ఏలూరి సాంబశివరావులతోపాటు మరో ఇద్దరు అభ్యర్థుల పేర్లను తొలి జాబితాలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు.

ఒంగోలులో

సీఎం పర్యటన 4.40 గంటలు

ఘన స్వాగతం పలికిన వైసీపీ నాయకులు

రెండు గంటల పాటు ద్వితీయశ్రేణి నాయకులతో సమావేశం



శిలాఫలకం ఆవిష్కరించిన సీఎం జగన్, మంత్రి సురేష్, ఎమ్మెల్యేలు బాలినేని, చెవిరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి23: ఒంగోలులో పేద ప్రజలకు నివేశన స్థలాలు పంపిణీ కార్యక్రమానికి శుక్రవారం సీఎం జగన్ హాజరయ్యారు. ఆయన వెంట మంత్రి ధర్మన ప్రసాదరావు కూడా హెలికాప్టర్‌లో వచ్చారు. వారికి వైసీపీ జిల్లా ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్‌తోపాటు కలెక్టర్ దినేష్‌కుమార్, ఐజీ పాల్‌రాజు, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, వైసీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి పర్యటన 4.40 గంటలు సాగింది. దీనిలో సుమారు రెండు గంటలపాటు ద్వితీయశ్రేణి నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. 55 నిమిషాల పాటు లబ్ధిదారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడారు.

ముఖ్యమంత్రి పర్యటన సాగింది ఇలా..

- 10.50 గంటలకు ఒంగోలు శివారు ప్రాంతమైన ఎస్.అగ్రహారం జగనన్న లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద ప్రత్యేక హెలికాప్టర్‌లో సీఎం జగన్ దిగారు.
- అక్కడ నుంచి ముఖ్యమంత్రి కాన్వాయ్‌లో బయలుదేరి అదేప్రాంతంలో నిర్మించిన పైలాన్‌ను 11.05కు ఆవిష్కరించారు.
- పైలాన్ వద్ద నుంచి 11.25కు బయలు దేరి 11.30కి సభాస్థలికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ కౌంటర్‌ను పరిశీలించి వేదక మీదకు వెళ్లారు.
- 12.05 నుంచి 12.55 గంటలకు వరకు ప్రసంగించారు.
- 1.10 గంటలకు లబ్ధిదారులకు నివేశనస్థల పట్టాలు అందజేశారు.
- అక్కడే ఉన్న ఒంగోలు కార్పొరేషన్ కార్పొరేటర్లతో 1.20 గంటల వరకు పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు.
- 1.35 కు హెలిపాడ్ వద్దకు చేరుకుని అక్కడ వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులతో 3.20 గంటల వరకు సమావేశమయ్యారు.
- 3.30 గంటలకు హెలికాప్టర్‌లో తాడేపల్లి బయలుదేరారు.

కాగా హెలికాప్టర్‌లో కూర్చున్న తరువాత ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, దర్శి వైసీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డితో మాట్లాడారు.

- ముఖ్యమంత్రికి కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ పరమేశ్వరరెడ్డిలతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు వీడ్కోలు పలికారు.

సీఎం సభలో సైడ్‌లైట్స్..



సభాప్రాంగణం నుంచి బయటకు వస్తున్న మహిళలు

- సీఎం హెలిప్యాడ్ దిగక ముందే ఇంటిబాట పట్టిన కొందరు మహిళలు
- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో బయటకు బారులు తీరిన మహిళలు
- సీఎం జగన్ ప్రసంగం పెద్దగా పసలేదని ప్రజల గుసగుస
- గతంలో ఎన్నడూ లేని విధంగా స్వరం పెంచి మాట్లాడిన బాలినేని
- భారీగా జన సేకరణ చేసినా జగన్ నోట వినిపించని బాలినేని పేరు..
- సీఎం తీరుపై బాలినేని అనుచరుల నిరాశ
- చంద్రబాబుపై విమర్శలు, ఆంధ్రజ్యోతి, ఈనాడు, టీవీ5పై ఆవేశం వెళ్లగక్కిన జగన్
- సీఎం మాట్లాడుతుండగా ప్రాంగణం వదిలి బయటకు వచ్చిన జనం
- జగన్ ఏం మాట్లాడారో కూడా పట్టించుకోని లబ్ధిదారులు
- తాగునీరు తప్ప, తిండికి అవస్థలు పడిన జనం
- అరకొరగా మరుగుదొడ్ల ఏర్పాటుతో మహిళలకు తప్పని తిప్పలు
- గంటసేపు సాగిన సీఎం ప్రసంగంలో బాలినేని పేరు ప్రస్తావించకపోవడంపై వైసీపీ నేతల్లో నిరుత్సాహం
- మండుటెండలో బందోబస్తు నిర్వహించిన పోలీసులు
- పొలాల కాలువలు, గట్లపైనే ఆహారం తినిన పోలీసులు
- చీరలు, ప్యాంట్లు ఇస్తారని వచ్చిన జనం.. ఇవ్వకపోవడంతో నిరాశ
- హద్దురాళ్ళు వేసిన లే అవుట్‌లో తమ ప్లాటు ఎక్కడ ఉందో తెలియక వెతికేందుకు లబ్ధిదారుల అగచాట్లు
- సభ ముగిశాక, కార్పొరేటర్లు, ఇతర నాయకులను సీఎంకు పరిచయం చేసిన ఎమ్మెల్యే బాలినేని

20,840 మందికి

పట్టాలతో పాటు రిజిస్ట్రేషన్

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23 : ఒంగోలులోని పేదలకు 20,840 మందికి పట్టాలతో పాటు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఒంగోలు సమీపంలోని ఎన్.అగ్రహారంలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఒంగోలులో పేదలకు పట్టాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.210 కోట్లు మంజూరు చేయడంతో ఎన్.అగ్రహారం, వెంగముక్కలపాలెం, మల్లేశ్వరపురం, యరజర్లలో 540 ఎకరాల భూమిని సేకరించినట్లు చెప్పారు. పేదలకు పట్టాలు పంపిణీతో పాటు ప్రభుత్వం మౌలిక సదుపాయాలకు రూ.21.33 కోట్లు మంజూరు చేసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 96,604 మందికి పట్టాలు పంపిణీ చేయగా అందులో 74వేల గృహ నిర్మాణాలకు మంజూరు జరిగిందన్నారు. 49వేల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. అగ్రహారం వద్ద జగనన్న లేఅవుట్‌ను మోడల్ టౌన్‌షిప్‌గా రూపొందించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

ఘనంగా రోటరీ వ్యవస్థాపక దినోత్సవం



రోటరీ ప్రతినిధులతో యాత్రికులు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 23: రోటరీ క్లబ్ 119వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని త్రివేండ్రం నుంచి బయలుదేరిన మోటారుసైకిల్ యాత్ర శుక్రవారం ఒంగోలు చేరుకుంది. ఈ సందర్భంగా రోటరీయన్లు చేపట్టిన భారత మోటారుసైకిల్ యాత్రకు ఇక్కడి రోటరీ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక హెచ్‌సీఎం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలికల సాధికారత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ సభ్యులు లక్ష్మీనారాయణ, గోపాలకృష్ణ, సురేంద్రబాబు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాపోరు ఆందోళన : బీజేపీ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శనివారం ఒంగోలులో ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యయాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద, కొత్తకూరగాయల మార్కెట్, అద్దంకి బస్టాండు, పాత కూరగాయాల మార్కెట్, కొత్తపట్నం బస్టాండు వద్ద ఈ ప్రజాపోరు కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేదలపై కపట ప్రేమ మానుకో..!

బాలినేనిపై తెలుగుదేశం నాయకుల విమర్శలు ● నగర శివారుకాలనీల్లో నివాసాలన్నీ టీడీపీ హయాంలోనే ఏర్పాటు చేసినట్లు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), ఫ్రిబవరి 23 : తెలుగుదేశం హయాంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అబద్దాలు చెప్పి ప్రజలను మోసం చేయడం మానుకోవాలని టీడీపీ నాయకులు హితవు పలికారు. శుక్రవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఒంగోలులో జరిగిన పేదల పట్టాల పంపిణీలో బాలినేని అవగాహన లేని మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నగరంలోని ఎన్టీఆర్‌కాలనీ, ఇందిరమ్మ కాలనీ, జర్నలిస్టుకాలనీ, పొనుగోపాటి కాలనీ, ఇలా పలు కాలనీలన్నీ టీడీపీ పాలనలోనే ఏర్పాటు అయిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. టిడ్కో ఇళ్ళు నిర్మాణం ఎవరి హయాంలో జరిగాయో అందరికీ తెలుసన్నారు. తొంభై శాతం పూర్తయిన వాటిని పది శాతం పూర్తి చేసి పేదలకు ఇవ్వకుండా, కేవలం ఎకరా రూ.15లక్షలు ఉండే రెడ్డి సామాజిక వర్గానికి భూములను రూ.35 లక్షలకు అమ్మిపెట్టిన నేత ఎవరని వారు ప్రశ్నించారు. ప్రజలు నమ్ముతున్నారని ఇష్టమొచ్చినట్లు మాట్లాడవద్దని, అగ్రహారం, మల్లేశ్వరపురం, వెంగముక్కలపాలెంలో ఇస్తున్న పట్టాలు సగం వైసీపీకి చెందిన వారికే ఇచ్చారని వారు విమర్శించారు. ఐదుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రిగా ఉన్న బాలినేనికి పేదలు ఎన్నికల ముందే గుర్తుకొచ్చారా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే చేతగానితనం టీడీపీపై నెట్టడం మానుకోవాలని వారు హితవు పలికారు. సమావేశంలో నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, ఎద్దు శశికాంత్ భూషణ్, బొల్లినేని వాసుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇళ్ల పట్టాలు

రైతుల వద్ద డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే ఆస్తి మొత్తం రాసిస్తా..

ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23 : ఒంగోలులోని పేదలకు ఇచ్చి మాట ప్రకారం ఇళ్ల స్థల పట్టాలను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు సమీపంలోని ఎన్.అగ్రహారం వద్ద జగనన్న కాలనీ లే అవుట్‌లో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో బాలినేని మాట్లాడారు. గతంలో యరజర్ల వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో పట్టాలు ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేయగా కోర్టు కేసుల వల్ల కుదరలేదన్నారు. పేదలకు పట్టాలు ఇవ్వకపోతే తాను ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పానని, తనకు సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన భరోసాతోనే ఈ విషయాన్ని ప్రకటించానని తెలిపారు. ఇళ్ళ పట్టాల పంపిణీతో పాటు ఇళ్ళ నిర్మాణాలకు ముఖ్యమంత్రి రూ.1100 కోట్లు మంజూరు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారన్నారు ఎన్.అగ్రహారం లే అవుట్‌కు నీటిని సరఫరా చేసేందుకు రూ.240 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించారని తెలిపారు. వివిధ కారణాలతో మూడు, నాలుగు వేల మందికి పట్టాలు రాలేదని, వారికీ ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరగా వెంటనే కలెక్టర్‌తో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారని బాలినేని తెలిపారు. త్వరలోనే వారందరికి కూడా పట్టాలు ఇస్తామని చెప్పారు. పేదలకు పట్టాలు ఇచ్చేందుకు సేకరించిన భూముల యజమానుల నుంచి ఎకరాకు రూ.8 లక్షలు తాను తీసుకున్నట్లు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను రైతుల వద్ద డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే తన ఆస్తి మొత్తాన్ని రాసి ఇస్తానని బాలినేని సవాల్ విసిరారు.

గ్రూపు-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: జిల్లాలో ఈనెల 25వ తేదీన జరగనున్న గ్రూపు-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో శుక్రవారం సాయంత్రం గ్రూపు-2 పరీక్షల ఏర్పాట్లపై రూట్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్ష నిర్వహణ, నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రూట్ అధికారులు పరీక్షకు ముందు రోజే వారి రూట్లను తనిఖీ చేసుకోవాలన్నారు. జిల్లాలో 49 కేంద్రాల్లో పరీక్షలు జరగనుండగా 15 రూట్లుగా విభజించినట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని చెప్పారు. లైజన్ అధికారులుగా తహసీల్దార్ల నియామకం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీకెమెరాలతో పాటు అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్ష ముగిసిన తర్వాతనే అభ్యర్థులను బయటకు పంపాలన్నారు. నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ రాజగోపాల్, పలు కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీదే విజయం

● నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఫిబ్రవరి 23: మరికొద్ది నెలల్లో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీదే ఘన విజయమని, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీ బూత్‌లో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం జరిపి టెలిగ్రామ్ బాట్‌లో రిజిస్ట్రేషన్‌లు పూర్తిచేయాలన్నారు. కుటుంబ సాధికారసారధులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కొద్దిరోజుల సమయం మాత్రమే ఉందని కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, మండల నాయకులు క్షేత్రస్థాయిలో కష్టపడాలని కోరారు. అస్తవ్యస్తంగా ఉన్న పాలనను ప్రజలకు అనుకూలంగా మార్చాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసరావు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, గొట్టిపాటి రాఘవరావు, నాయకులు గొల్లపూడి సుబ్బారావు, వేల్పుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బహిష్కృత నేత హల్‌చల్!



సీఎం జగన్‌ను శాలువతో సత్కరిస్తున్న సూర్యప్రకాష్‌రెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: వైసీపీ నుంచి బహిష్కరణకు గురైన ఆ పార్టీ నాయకుడు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి ముఖ్యమంత్రి సభా వేదికపై హల్‌చల్ చేయడం చర్చనీయాంశంగా మారింది. మార్కాపురం శాసనసభ్యుడు కందుల నాగార్జునరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై అనేక అవినీతి, ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో పెద్దిరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ ఘటన జరిగి ఐదారు నెలలు గడిచినా పెద్దిరెడ్డిపై పార్టీ విధించిన సస్పెన్షన్ ఎత్తివేయలేదు. అయితే శుక్రవారం ఒంగోలులో నిర్వహించిన బహిరంగ సభ వేదికపై సూర్యప్రకాష్‌రెడ్డి ప్రత్యక్షం కావడం ఆశ్చర్యానికి గురి చేసింది. అసలు ఆయనకు బహిరంగ సభ వేదికపైకి వెళ్ళేందుకు పాసులు ఎవరు ఇచ్చారనేదానిపై కూడా చర్చానీయాంశగా మారింది. కాగా సీఎం జగన్‌కు పెద్దిరెడ్డి ఏకంగా శాలువా కప్పి సత్కరించడం గమనార్హం.

రైతులపై కాల్పులు జరపడం దుర్మార్గం

● రైతు సంఘాల ఆగ్రహం



కలెక్టరేట్ ఎదుట బ్లాక్‌డే నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన చేస్తున్న రైతులపై హర్యానా పోలీసులు కాల్పులు జరపడం దుర్మార్గమని రైతు సంఘాల నాయకులు మండిపడ్డారు. ఈ కాల్పుల్లో శుభకిరణ్‌సింగ్ అనే రైతు మృతిచెందగా, అనేక మంది రైతులు తీవ్రంగా గాయపడ్డారన్నారు. మోదీ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట బ్లాక్‌డే కార్యక్రమాన్ని చుంచు శేషయ్య, పి.వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, ఎంఎస్‌పీని చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు పమిడి వెంకట్రావు మాట్లాడుతూ రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. వీరారెడ్డి మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, బి.పద్మ, కంకణాల ఆంజనేయులు, బాలకోటయ్య, జీవీ.కొండారెడ్డి, జీవీ.వెంకటేశ్వర్లు, పీవీఆర్.చౌదరి, ఎస్.లలితకుమారి, సాయి, వి.హనుమారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సుందరం, జార్జీ, సీహెచ్.సుధాకర్, ఆర్.మోహన్, కె.నాంచార్లు, నాగరాజు, సాగర్, మాబు, పెంట్యాల హనుమంతరావు, కొంగర నరసింహం తదితరులు పాలొన్నారు.

పోలీసులకు ఎస్పీ అభినందన

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 23: సీఎం జగన్మోహనరెడ్డి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టిన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి అభినందించారు. శుక్రవారం ఒంగోలు శివారు ప్రాంతం ఎస్.అగ్రహారం జగనన్న లేఅవుట్లలో పేదలకు నివేశన స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈక్రమంలో ముఖ్యమంత్రి కాన్వాయ్ ఏర్పాటు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారని, అదే క్రమంలో సభకు విచ్చేసిన వారు క్షేమంగా ఇళ్లకు చేరేలా తగిన చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. భద్రతా ఏర్పాట్లలో 1700 మంది పోలీసులు పాల్గొనున్నట్లు చెప్పారు. కాగా ప్రత్యేక హెలికాప్టర్‌లో దిగిన సీఎం జగన్మోహనరెడ్డికి ఎస్పీ బొకే అందజేశా రు. భద్రతా ఏర్పాట్లలో ఏఎస్పీలు కె.నాగేశ్వరరావు, శ్రీధరరావు, ఏఆర్.అశోక్‌బాబుతో పాటుగా ఒంగోలు డీఎస్పీ కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శంఖారావం సభకు స్థల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 23 : టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన శంఖారావం యాత్ర సభకు ఎర్రగొండపాలెంలో శుక్రవారం రాబిన్ శర్మ బృందం సభ్యులు స్థలాన్ని పరిశీలించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. యువగళం పాదయాత్ర జరగని నియోజకవర్గంలో ఎర్రగొండపాలెం ఉన్నందున విజయశంఖారావం సభ నిర్వహించేందుకు ఆ పార్టీ నిర్ణయించింది. దీంతో శుక్రవారం రాబిన్ శర్మ, రవియాదవ్‌లు ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుతో కలసి ఎర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో ఒక చోట, త్రిపురాంతకం మండలం జంక్షన్ వద్ద మరో ప్రైవేటు స్థలాన్ని పరిశీలించారు. ఈ నెల 26 తర్వాత సభ ఉంటుందని ఎరిక్షన్‌బాబు తెలిపారు.

అవీ..ఇవీ..

ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే జీతాలు చెల్లిస్తాం

● జిల్లా ఖజానాధికారి జగన్నాథరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 23: ప్రభుత్వ ఉత్తర్వులు అందిన వెంటనే జిల్లాలో జీతాలు నిలిచిపోయిన టీచర్లకు చెల్లింపులు చేస్తామని జిల్లా ఖజానాధికారి జగన్నాథరావు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన మహిళా టీచర్ల ఆకలి కేకలు- ఆరు నెలలుగా జీతాలు లేని వెతలు శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఆయన వివరణ ఇచ్చారు. గత ఏడాది మే 22న జారీచేసిన ఉత్తర్వుల్లో నాలుగు వారాలలోపు టీచర్ల బదిలీల ప్రక్రియను ముగించమన్నారు. అయితే ఇక్కడి డీఈవో ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో కూడా ఎటువంటి ప్రత్యేక ఉత్తర్వులు లేకుండానే బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి బదిలీ ఉత్తర్వులు ప్రభుత్వ ఆదేశాలకు భిన్నంగా ఉన్నందున వారి జీతాల బిల్లులు ట్రెజరీల్లో వెనక్కు పంపారని, ఈ బదిలీలకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు సమర్పించమని డీఈవోను కోరినా ఆయన సమర్పించలేదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారమే జీతాలు చెల్లించాలని కలెక్టర్, జీడీఏ ఆదేశించిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ బదిలీలకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చిన వెంటనే జీతాలు చెల్లిస్తామని జగన్నాథరావు పేర్కొన్నారు.

కౌంటింగ్ కేంద్రాలను వెంటనే ఎంపిక చేయాలి

● రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలను వెంటనే ఎంపిక చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రాలను ఫైనల్ చేసి జాబితాలను పంపాలన్నారు. జిల్లాలో 15,691 క్లైయిమ్స్ ఉన్నాయని కలెక్టర్ దినేష్‌కుమార్ ఎన్నికల ప్రధానాధికారి దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై సీఈవో స్పందిస్తూ మొత్తం ఓట్లలో తొలగించాల్సిన ఓట్లు 0.1శాతం కంటే ఎక్కువగా ఉంటే తన అనుమతి తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో తప్పనిసరిగా ఉండాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఆర్.శ్రీలత, ఎన్నికలవిభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

27న జాబ్ మేళా

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 23: ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 27న కళాశాల విద్యాకమిషనర్ ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ డి.కళ్యాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కందుకూరు, ఉలవపాడు, కనిగిరి, కంభం, దర్శి, యర్రగొండపాలెం, దోర్నాల, అద్దంకి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులందరూ ఈ జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. ఆ మేళాలో 16 కంపెనీలు పాల్గొంటాయన్నారు. విద్యార్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు మూడు సెట్లు జెరాక్స్ తీసుకురావాలని జేకేసీ కో ఆర్డినేటర్ ఏబీ.రాజ్యలక్ష్మి సూచించారు.

కార్పొరేటర్లతో సీఎం ముఖాముఖి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: సీఎం జగన్మోహన్‌రెడ్డి ఒంగోలు నగర పాలక సంస్థ కార్పొరేటర్లతో ముఖాముఖి మాట్లాడారు. బహిరంగ సభ అనంతరం సీఎం వేదిక దిగే సమయంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నగర కార్పొరేటర్లను కలవాలని కోరారు. దీంతో ఆయన వేదిక ముందు వీఐపీగ్యాలరీలో ఉన్న కార్పొరేటర్లను జగన్మోహన్‌రెడ్డి కరచలం చేసి సెల్ఫీలు దిగారు. కొంత మంది కార్పొరేటర్లు బొకేలను అందజేశారు. అలాగే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే బాలినేని, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డిలు జ్ఞాపికను అందజేశారు.

విద్యార్థి సంఘ నాయకుడి అరెస్టు దారుణం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23 : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఒంగోలు పర్యటన నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్‌ను ముందస్తు అరెస్టు చేయడాన్ని సీఐటీయూ నాయకుడు ఎం.రమేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి, డైఫీ జిల్లా కార్యదర్శి కేఎఫ్.బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.విజయ్‌లు ఖండించారు. ఒంగోలు వచ్చిన ముఖ్యమంత్రిని కలిసి విద్యారంగ సమస్యతో పాటు పెండింగ్‌లో ఉన్న రూ.1650 కోట్ల రీఎంబర్స్‌మెంట్ చెల్లించాలని, విద్యాదీవెన, వసతి దీవెన ఫీజులు చెల్లించాలని, హాస్టళ్ళకు కాస్మోటిక్, మెస్ చార్జీలు పెంచాలని తదితర డిమాండ్లతో సీఎంను కలుస్తారని తెలుసుకొని ముందస్తుగా అరెస్టు చేయడాన్ని వారు విమర్శించారు.

లక్ష్యసాధనకు పోస్టల్ ఉద్యోగులు కృషి చేయాలి



మాట్లాడుతున్న హరిప్రసాద్‌శర్మ

చీమకుర్తి, ఫిబ్రవరి 23 : ప్రస్తు ఆర్థికసంవత్సరంలో సాధించాల్సిన లక్ష్యాల సాధనకు పోస్టల్ ఉద్యోగులు కృషి చేయాలని తపాలాశాఖ ప్రకాశం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ మల్లాది హరిప్రసాద్‌శర్మ కోరారు. చీమకుర్తి ఉపతపాలా కార్యాలయంలో చీమకుర్తి, సంతనూతలపాడు సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ ఇంటింటా పొదుపు పంట 3.0క్యాంపులో భాగంగా తపాలాశాఖలోని పొదుపు ఖాతాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఒంగోలు వెస్ట్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, సబ్‌పోస్టుమాస్టర్ రామారావు, వాసుబాబు, సతీష్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

502 మందికి వైద్యపరీక్షలు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 23: జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వైద్యసేవలు అందిస్తున్నట్లు సంతనూతలపాడు ప్రాథమిక వైద్యశాల డాక్టర్ పమిడి హరిణి తెలిపారు. పీగుడిపాడు గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రత్యేక వైద్యనిపుణులు సాయిప్రకాష్, రాజీలు 502 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

చెత్త పన్ను వేసిన ప్రభుత్వాన్ని సాగనంపాలి

● జనసేన పార్టీ నాయకుల ధ్వజం



డ్రైనేజీని పరిశీలిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: సామాన్య ప్రజానీకంపై చెత్తపన్ను వేస్తున్న చెత్త ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఇంటింటికి సాగనంపాలని జనసేన పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. జనచైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం ఒంగోలు నగరం 10వ డివిజన్‌లోని అంబేడ్కర్ కాలనీలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రజల సమస్యలను తెలుసుకొని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సామాన్య ప్రజానీకంపై చెత్త పన్ను వేసిన ప్రభుత్వం ఎక్కడా లేదన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలపై పన్నుల భారం మోపిందని ధ్వజమెత్తారు. నగరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో పాటు కాలువల్లో మురుగునీరు నిలిచి దోమలు స్వైరవిహారం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ మద్దతుదారులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. తేళ్ల హరీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముత్యాల కళ్యాణ్, పల్ల ప్రమీల, మాదా సాయినాయుడు, ఉంగరాల వాసు, కోట సుధీర్, నరసింహారావు, ఆలా నారాయణ, మర్రిపూడి ఉదయ్, నరేష్, అనూష, మర్రిపూడి మాధవి, అరవింద్‌బాబు, అవినాష్ నాయుడు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనతో ప్రయాణికులకు ఇక్కట్లు



నిర్మానుషంగా ఉన్న బస్‌స్టేషన్

సింగరాయకొండ, ఫిబ్రవరి 23: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనల సందర్భంగా ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. శుక్రవారం ఒంగోలులో నిర్వహించిన ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. ఈసందర్భంగా వైసీపీ నేతలు జిల్లాలోని అన్ని మండలాల నుంచి పొదుపు సంఘాల మహిళలను, పార్టీ కార్యకర్తలను సమీకరించి ఆర్టీసీ బస్సుల ద్వారా ఒంగోలు తరలించారు. దీంతో సింగరాయకొండ బస్టాండ్‌కు బస్సులు రాకపోవడంతో వెలవెలబోయింది. కావలి, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు బస్టాండ్‌లో పడిగాపులు కాచారు. సకాలంలో బస్సులురాక ఇబ్బందులు పడ్డారు. కొందరు ప్రయాణాన్ని విరమించుకొని వెనుదిరిగారు.


జగన్ సభకు ససేమిరా..

నలుగురైదుగురితో సభాస్థలికి బస్సులు ● పొదుపు సంఘాల మహిళలను తరలించేందుకు నానా అవస్థలు

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 23: "ఎప్పుడూ ముఖ్యమంత్రి వచ్చినా మమ్మల్నే పిలుస్తారు.. ఇంటి పనులు మానుకుని రావాలంటే ప్రతిసారీ ఇబ్బందిగా ఉంటోంది. నగరంలో ఉండే పేదలకు పంపిణీ చేసే సభకు మేమెందుకు రావాలి" అంటూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పొదుపు సంఘాల మహిళలు ప్రశ్నించారు. శుక్రవారం ఒంగోలు సమీపంలోని ఎన్.అగ్రహారంలో జరిగే ముఖ్యమంత్రి జగన్ సభకు జన సమీకరణలో భాగంగా వైఎస్సార్‌కేపీ ఆధ్వర్యంలో ఒంగోలు రూరల్ మండలం, కొత్తపట్నం మండలం, కొండపి నియోజక వర్గం, సంతనూతలపాడు నియోజక వర్గాల నుంచి పొదుపు సంఘాల మహిళల్ని పెద్ద ఎత్తున తరలించేందుకు ఆశాఖ ఉద్యోగులు ఏర్పాట్లు చేశారు. గురువారం రాత్రికే పలు గ్రామాలకు బస్సులను పంపించారు. సీఎం సభకు జనాన్ని తరలించేందుకు వెయ్యికి పైగా బస్సులను ఏర్పాటు చేసిన అధికార యంత్రాంగం ఇతర జిల్లాల నుంచి కూడా ఆర్టీసీ బస్సులను ఇక్కడకు రప్పించారు. నెల్లూరు, తెనాలి, గుంటూరు డిపోలకు చెందిన బస్సులు కూడా జనాన్ని సభకు తరలించేందుకు ఏర్పాటు చేశారు. అయితే ఈ బస్సుల్లో శుక్రవారం


జనం లేక ఖాళీగా ఉన్న ఆర్టీసీ బస్సు

ఉదయం పొదుపు సంఘాల మహిళలను ఎక్కించేందుకు వైఎస్సార్‌కేపీ ఉద్యోగులు నానా ఇబ్బందులు పడ్డారు. కొన్ని గ్రామాల్లో మేమెందుకు రావాలి అంటూ బస్సులు ఎక్కేందుకు మహిళలు ససేమిరా అన్నారు. ఉదయం 8 గంటలకే బస్సులు ఎక్కాలని ఉద్యోగులు మహిళలను కోరారు. గ్రామాలకు పంపించిన బస్సుల్లో పొదుపు మహిళలను ఎక్కించే బాధ్యత జిల్లా ఉన్నతాధికారులు సంబందిత మండలాల ఏపీఎంలు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు, వీఓఏలకు అప్పగించారు. దీంతో వారు మహిళలను ఉదయాన్నే బస్సులు ఎక్కించేందుకు పడరాని పాట్లు పడ్డారు. పొదుపు సంఘాల మహిళలు ఎదురు ప్రశ్నలతో సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అయ్యారు. నగరంలో జరిగే పట్టాల పంపిణీ కార్యక్రమానికి మేమెందుకు రావాలంటూ ఎదురు ప్రశ్న వేశారు. అయితే గురువారం రాత్రి నుంచే పొదుపు సంఘాల మహిళలు అందరూ ఈ సభకు రావాలని, లేని పక్షంలో భవిష్యత్తులో పథకాలు అందటం కష్టమని ఒక విధంగా బెదిరించే ధోరణిలో మహిళలుకు సమాచారం అందించారు. శుక్రవారం ఉదయానికల్లా సిద్ధంగా ఉండాలంటూ హుకుం జారీ చేశారు. అయినా అధికారులు అనుకున్న స్థాయిలో మహిళలు సభకు వెళ్ళలేదు. సభకు వెళ్ళేందుకు మహిళలు విముఖత వ్యక్తం చేయటంతో కొన్ని గ్రామాల నుంచి బస్సులు ఖాళీగానే సభా స్థలానికి చేరాయి. కొన్ని బస్సుల్లో నలుగురైదుగురు మాత్రమే మహిళలు కనిపించారు. దాదాపు 50 మందికి పైగా కూర్చుని ప్రయాణించే ఆర్టీసీ బస్సుల్లో 10 మందిలోపే కనిపించారు. దాదాపు 1000 బస్సులను ఏర్పాటు చేయగా


ఒక్కరితో వెళుతున్న బస్సు

మహిళలు అధికారులు ఊహించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. గ్రామాల్లో మహిళలు సభకు వెళ్ళేందుకు ససేమిరా అనటంతో బస్సులు రావటం కూడా ఆలస్యమైంది. మద్రిపాడు వంటి దూరపు ప్రాంతాల నుంచి కూడా వచ్చిన బస్సులో మహిళలు నామమాత్రంగానే కనిపించారు. ఒంగోలు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి బస్సుల్లో కూడా అంతంత మాత్రంగానే ఉన్నారు. ఉన్న కొద్ది మంది కూడా అధికారులు బలవంతంమీద ఎక్కినట్లుగానే కనిపించింది. ఇష్టం ఉన్నా లేక పోయినా సీఎం సభ విజయవంతం కావాలంటే రావాల్సిందే..లేదంటే ఇబ్బందులు పడతారు అంటూ తరలించిన సందర్భాలు కూడా కనిపించాయి.

ఆగి ఉన్న ఆటోను ఈడ్చుకెళ్లిన లారీ

● పలువురు కూలీలకు గాయాలు

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 23: మిరప కోతలకు కూలీలను తీసుకెళ్తూ, ఆగి ఉన్న ఆటోను ఓ లారీ వెనుక నుంచి వచ్చి ఈడ్చు కెళ్లిన ఘటనలో ఆటో బోల్తా పడింది. దీంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని చట్టుతాండా సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషను వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చింతల గ్రామానికి చెందిన చెంచు గిరిజనులు భూమని వెంకటేశం, జల్లా నాగలక్ష్మి, కుడుముల సాయిరాం, కుడుముల మల్లిక, భూమని నాగమ్మ, భూమని అంకమ్మలకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. చింతలకు చెందిన గిరిజనులు పెద్ద బొమ్మలాపురంలో మిరపకోతలకు ఆటోలో వెళ్తున్నారు. మార్గమధ్యంలో ఆటోడ్రైవరుకు తెలిసిన మోటారుసైకిలిస్టు ఎదురు పడ్డాడు. రోడ్డుకు అవతలి వైపున మోటారు సైకిలిస్టు, మరోవైపు ఆటో నిలబెట్టి మాట్లాడుతున్నారు. ఇదే సమయంలో శ్రీశైలం వైపు నుండి ప్రయాణిస్తున్న లారీ రెండు వాహనాల మధ్యగా వెళ్లింది. అయితే వారిని దాటే సమయంలో లారీ వెనుక వైపున ఉన్న డోరు చైను ఆటోను తగిలి ఈడ్చుకు పోయింది. అప్రమత్తమైన డ్రైవరు వెంటనే లారీని నిలిపివేశాడు. అప్పటికే ఆటోను కొద్ది దూరం ఈడ్చుకొని వచ్చి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్ వాహనానికి సమాచారమిచ్చారు. దీంతో క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, ప్రథమచికిత్సలు నిర్వహించారు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై అంకమరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు.

28న ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

త్రిపురాంతకం, ఫిబ్రవరి 23: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ ధ్వజస్థంభ పునఃప్రతిష్ఠా మహోత్సవాన్ని ఈనెల 28న నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, పాలకమండలి చైర్మన్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు తెలిపారు. దీనిలో భాగంగా 24 నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. 24న గోపూజ, గణపతిపూజ, పంచగవ్యప్రాసన, దీక్షాధారణ, 25న లక్ష్మీ గణపతిహోమం, మహారుద్ర హోమం, 26న పంచాక్షరీ మూలమంత్ర హోమం, యాగమండప దేవతా హోమాలు, జలాధివాసం నిర్వహిస్తారు. 27న ధాన్యాధివాసం, పుష్పాధివాసం, దర్పణాధివాసం, శయ్యాధివాసం, 28న ఉదయం 10.05 గంటలకు ఆదిత్యాది నవగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాలు జరుగుతా యన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని తెలిపారు.

ముండ్లపాడుకు కళాశాల మంజూరు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 23: గిద్దలూరు మండలం ముండ్లపాడుకు ఇంటర్మీడియట్ కాలేజ్ మంజూరైనట్లు జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభంకానున్నట్లు ఆదేశాలు జారీ చేశారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 23 : దిగువమెట్ట అటవీశాఖ తనిఖీ కేంద్రం వద్ద అధికారులు మెటల్ డిటెక్టర్లు ఉపయోగించి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి డి.వంశీక్రిష్ణ ఆధ్వర్యంలో వాహనా లను తనిఖీ చేశారు. నిషేధిత వస్తువులు అక్రమ రవాణా చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

అద్దంకి, ఫిబ్రవరి 23: మండలంలోని ధర్మవరం సమీపంలో ఉన్న భీమలింగేశ్వరాలయం వద్ద తవ్వకాలు జరిగాయి. గతంలో కూడా పలుమార్లు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేశారు. గురువారం రాత్రి తవ్వకాలు చేసి పెద్దపెద్ద బండరాళ్లను బయట పడవేసి తవ్వకాల ఆనవాళ్ళు కనిపించకుండా నాపరాళ్ళను కప్పి సిమెంట్ పూత కూడా పూయటం అనుమానాలు కలిగిస్తుంది. అతి పురాతన ఆలయం కావటం, రాజుల కాలంలో ధర్మవరం కేంద్రంగా కొంతకాలం పాలన సాగించి ఉండటంతో గుప్త నిధులు ఉండి ఉంటాయన్న అనుమానాలతో తరచూ తవ్వకాలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి తవ్వకాలు చేసి సుమారు 30 బండరాళ్ళను పక్కనే పడవేశారు. అయితే, అంత ఖాళీలో ఏమి ఉపయోగించి పూడ్చారు అన్న విషయంపై అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి. శుక్రవారం ఉదయం దేవాలయం వద్దకు వెళ్ళి న పాలక మండలి కమిటీ చైర్మన్ పచ్చవ విజయభాస్కర్ తవ్వకాలు జరిగిన విషయాన్ని గుర్తించి దేవదాయ అధికారులకు సమాచారం అందించారు. శనివారం దేవదాయశాఖ అ ధికారులు పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పంగులూరు, ఫిబ్రవరి 23: మిర్చి లోడుతో గుంటూరు వైపు వెళుతున్న మినీ వ్యాన్‌ను వెనుకనుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని జాగర్లమూడివారిపాలెం గ్రామం వద్ద 16వ నెంబరు జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై గురువారం తెల్లవారు జామున జరిగిన ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తులు సీటు బెల్ట్ ధరించి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. వీరిలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. మినీ వ్యాన్‌ను అతి వేగంగా వెనుకనుంచి కారు ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న గస్తీ పోలీసులు నైట్ డ్యూటీలో ఉన్న ఎస్ఐ చంద్రశేఖర్‌కు సమాచారం అందివ్వడంతో క్రేన్ సాయంతో రోడ్డుకు అడ్డంగా నిలిచిన కారును తొల గించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. గాయాలపాలయిన వ్యక్తిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రేణంగివరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం అక్రమ రవాణాలో అధికారపార్టీ పత్రిక విలేకరి..!

130 మద్యం సీసాలు, నలుగురు నిందితులను పట్టుకున్న వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు, ఎస్సై వేమన

వారిలో ఒకరు బాపట్ల విలేకరి

విషయం బయటకు పొక్కడంతో అతడిని సంస్థ నుంచి తొలగించినట్లు సమాచారం



పట్టుబడ్డ మద్యం సీసాలతో సీఐ శేషగిరిరావు, ఎస్సై వేమన

చీరాల,ఫిబ్రవరి 23 : అక్రమంగా తరలిస్తున్న 130 ఫుల్ బాటిల్స్ గోవా మద్యంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల జిల్లా చీరాల రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు, ఎస్సై వేమనలు సిబ్బందితో కలసి మద్యంను పట్టుకున్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులలో ఒకరు బాపట్లలో అధికారపార్టీకి చెందిన పత్రికలో పనిచేస్తున్న విలేకరి ఉన్నట్లు సమాచారం. చాలాకాలం నుంచి వీరు ఇదే తరహాలో అక్రమ మద్యం రవాణా, విక్రయాలు సాగిస్తున్నట్లు తెలిసింది. పక్కా సమాచారం మేరకు పోలీసులు నిర్వహించిన దాడులలో వారు పట్టుబడ్డట్లు తెలిసింది. వారు తీర ప్రాంతలోని రిసార్టులకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. మద్యం కేసులో పట్టుబడ్డ విలేకరిని సదరు పత్రికయాజమాన్యం తమ సంస్థ నుంచి తొలగించినట్లు తెలిసింది. అయితే పట్టుబడ్డ నిందితులు, కేసు పూర్వాపరాలను పోలీసులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

వ్యవసాయ మోటార్లు చోరీ

బల్లికురవ, ఫిబ్రవరి 23: మండలంలోని గంగపాలెంలో గురువారం అర్ధ రాత్రి పంట పొలాల్లో ఉన్న ఐదు వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయి. గ్రామానికి సమీపంలో నల్లవాగు వద్ద ఉన్న పంట పొలాల్లో రాయుడు శివ రామయ్య, ఆంజనేయులు, పోఫూరి సుబ్బారావు, రమేష్, బి.డేవిడ్ అనే రైతులు పంట పొలాలకు నీరు పెట్టుకునేందుకు మోటార్లు పెట్టారు. గుర్తు తెలియని దొంగలు అర్ధరాత్రి సమయంలో ఐదుగురు రైతులకు చెందిన మోటార్లను తస్కరించారు. శుక్రవారం పంటలకు నీరు పెట్టుకునేందుకు వెళ్లిన రైతులు మోటార్లు లేకపోవటంతో బల్లికురవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీ అయిన మోటార్ల విలువ రూ.లక్ష పైచిలుకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

6న పోలురాధా ఎడ్ల పోటీలు

చినగంజాం, ఫిబ్రవరి 23: మండలంలోని సోపిరాల గ్రామంలోని లలితాపరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని మార్చి 6న ఒంగోలు జాతి జూనియర్ ఎడ్ల విభాగంలో రాష్ట్ర స్థాయి నాటుబండి పోలురాధా ఎడ్ల పందాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సోపిరాల గ్రామ భైరుబండ్ల అసో సియేషన్, గ్రామస్థుల సహకారంతో రాష్ట్రస్థాయి నాటుబండి పోలురాధ ఎడ్ల పందాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించాలని తెలిపారు. వివరాలకు 9133377719, 8919494992 సెల్ నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేదరమెట్ల, ఫిబ్రవరి 23: మేదరమెట్ల-తిమ్మనపాలెం మధ్య శుక్రవారం మోటార్‌సైకిళ్ళు ఢీకొన్న సంఘ టనలో ఒకరు దుర్మరణం చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. విజయవాడకు చెందిన కోరంపల్లి ఆంజనేయులు, గుంటూరుకు చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు ఒంగోలు వైపు నుంచి గుంటూరుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఈక్రమంలో మేదరమెట్లకు చెందిన క్రాంతికుమార్ స్కూటీపై వెళ్తూ ఎదురుగా వస్తున్న మోటర్‌సైకిల్‌ను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో కోరంపల్లి ఆంజనేయులు(43) అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున ఏడుకొండలు, ఎదురుగా వస్తున్న క్రాంతి కుమార్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలుకు తరలించారు. ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు.

మత్స్యసంపదను దోచుకెళ్తున్నారు!

తీరంలోకి అక్రమంగా చొరబడి తమిళనాడు జాలర్ల వేట ● దయనీయంగా స్థానిక మత్స్యకారుల పరిస్థితి

ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆవేదన


పాకలతీరంలో నిలిచిన ఉన్న బోట్లు


తీరంలో అక్రమంగా వేటసాగిస్తున్న సోనాబోటు

సింగరాయకొండ, ఫిబ్రవరి 23 : మండలంలో మత్స్యకారుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కడలిలో రాత్రింబవళ్లు వేటసాగించినా చేపలు సక్రమంగా పడకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సముద్రతీరంలోకి కలుషిత నీరు చేరడం వలన నానాటికీ చేపల ఉత్పత్తి తగ్గుముఖం పడుతోంది. మరోవైపు చెన్నైకు చెందిన కడలూరు మత్స్యకారులు తరచూ నిబంధనలు ఉల్లంఘిస్తూ తీరంలోకి చొరబడి మత్స్యసంపదను దోచుకెళ్తున్నారు. అదేసమయంలో తీరంవెంబడి నాటుకున్న రూ.లక్షల విలువ చేసే వలలు సోనాబోట్ల దాటికి దెబ్బతింటున్నాయి. దీంతో స్థానిక మత్స్యకారుల పరిస్థితి అగమ్యగోచనంగా మారింది. వేట సక్రమంగా సాగకపోవడంతో కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘించి వేట

నిబంధనల ప్రకారం సముద్రతీరం నుంచి 8 కిలోమీటర్ల దూరం వరకూ సంప్రదాయ, చిన్నతరహా బోట్లతో స్థానిక మత్స్యకారులు వేటసాగించవచ్చు. తీరం నుంచి 8 కిలో మీటర్ల అవతల సోనా బోట్లు వేటచేయాలి. అయితే అందుకు విరుద్ధంగా చెన్నై రాష్ట్రంలోని కడలూరుకి చెందిన మత్స్యకారులు సోనాబోట్లలో యథేచ్ఛగా చొచ్చుకొని వచ్చి వేట సాగిస్తున్నారు. జలాల సరిహద్దులు దాటి మత్స్యసంపదను కొల్లగొట్టుకుపోతున్నారు.

స్థానిక మత్స్యకారులకు చిక్కని చేపలు

సముద్రతీరంలో చేపల ఉత్పత్తి అంతంతమాత్రంగా ఉండటం, కడలూరుకు చెందిన మత్స్యకారులు అక్రమంగా సంపదను దోచుకెళ్తుండటంతో స్థానిక మత్స్యకారులకు తీరంలో చేపలవేట ఆశాజనకంగా ఉండటం లేదు. రూ.లక్షల విలువచేసే బోట్లలో నలుగురి నుంచి ఆరుగురు మత్స్యకారులు వెళ్లి వేట సాగించినా చేపలు సక్రమంగా పడటం లేదు. దీంతో కొన్నిసార్లు డీజిల్ ఖర్చులు కూడా రావడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో చాలా వరకూ బోట్లను తీరంలోనే నిలిపివేస్తున్నారు. కొంతమంది అందుబాటులో ఉన్న కూలి పనులకు వెళ్తుంటే, ఇంకొందరు ఉపాధి కోసం పక్క రాష్ట్రాలు, జిల్లాలకు వలస వెళ్తున్నారు.

చేతులెత్తేసిన మెరైన్ పోలీసులు

చెన్నైకి చెందిన సోనాబోట్లను వెంబడించడానికి అవసరమైన మెకనైజ్డ్, ఎఫ్ఐబీ బోట్లు మెరైన్ అధికారులకు అందుబాటులో లేవు. దీంతో అధికారులు, సిబ్బంది వారిని వెంబడించడానికి సంప్రదాయ బోట్లలోనే వెళ్తున్నారు. ఇవి ఏమాత్రం సోనా బోట్ల వేగాన్ని అందుకోలేవు. సోనాబోట్లలో వేటసాగిస్తున్న మత్స్యకారులు ఎదురుదాడి చేసినా పెనుప్రమాదం జరుగుతుంది. దీంతో వారిని కట్టడి చేయలేమని మెరైన్ పోలీసులు చేతులెత్తేశారు.

పట్టించుకోని ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి సోనా బోట్లు అక్రమంగా వేట సాగించడం అధికమైంది. మత్స్యకారులు పదేపదే వైసీపీ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దిక్కులేరు. గతంలో వరికూటి అశోక్‌బాబు, ఇటీవల కొండపి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన మంత్రి సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. కడలూరుబోట్లు అక్రమంగా వేట కొనసాగిస్తూనే ఉన్నాయి.

టీడీపీతోనే యువత భవిష్యత్తు

● ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఫిబ్రవరి 23: రాబోయే కాలంలో రాష్ట్ర యువత భవిష్యత్తు తెలుగుదేశం పార్టీతోనే ముడిపడి ఉందని ఆ పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం ద్వారానే యువత భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. మం డలంలోని ఇసుకదర్శిలో గల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మార్టూరులోని పోలేరమ్మ గుడి బజారులోని యువకులు టీడీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాను మెడలో వేసి ఏలూరి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మార్టూరు వీరాంజనేయులు, మార్టూరు సతీష్, తాతా అఖిల్, ఉప్పుటూరి పవన్, మణితేజ, ఎస్‌కే చాందా, నాగూర్, మౌలాలి, గుంటుపల్లి శ్రీను, మార్టూరు శ్రీను, మార్టూరు వెంకటేష్, సాయి పవన్, రాకేష్, తదితరులు ఉన్నారు. అలాగే, విజయ్‌నగర్ కాలనీకి చెందిన


ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన మార్టూరు యువకులు

కొ మర వీరబ్రహ్మం, కొమర శివ, తన్నీరు శ్రీను తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో కామినేని జనార్దన్, బండి చంద్రరావు, బూదయ్య, తొగటి వెంకటసుబ్బయ్య, తుమ్మల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధానికి సిద్ధం కావాలి

మార్టూరు: రాజధాని లేని రాష్ట్రం చేసిన జగన్ ప్రభుత్వం పై యుద్ధానికి సిద్ధం కావాలని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి మండలంలోని ఇసుకదర్శిలోగల క్యాంపు కార్యాలయంలో బొబ్బేపల్లి, జొన్నతాళి, రాజుగారిపాలెం, చిమ్మిరిబండ, ద్రోణాదుల, ఇసుకదర్శి గ్రామాల ముఖ్య నేతలు, మండల కమిటీ సభ్యులు బూత్ కన్వీనర్లు, పేజీ నేస్తం సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయిలో పార్టీని పటిష్ట పరచడానికి సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో ఐదేళ్ల నుంచి జరుగుతున్న విధ్వంస, అరాచక పాలనను అంతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచే యాలన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారన్నారు. ప్రజల ఆలోచనలను, ఆకాంక్షలను నెరవేర్చడానికి కార్యకర్తలు కంకణబద్ధులై ముందుకు నడవాలన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ఇవే చివరి ఎన్నికలుగా ప్రజాతీర్పు ఉండే విధంగా కార్యకర్తలు పనిచేయాలని ఏలూరి పేర్కొన్నారు.

'అక్రమ తవ్వకాలు ఆపకపోతే ఎన్నికలను బహిష్కరిస్తాం'

మార్టూరు, ఫిబ్రవరి 23: తమ గ్రామానికి చెందిన గ్రావెల్ కొండపై గత పదేళ్లుగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు, పట్టించుకోవడం లేదని మండలంలోని బొబ్బేపల్లి గ్రామస్థులు పేర్కొన్నారు. అక్రమ తవ్వకాలు ఆపకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని శుక్రవారం మార్టూరులో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. పదేళ్లలో రూ.వంద కోట్ల విలువైన గ్రావెల్‌ను అక్రమార్కులు తరలించుకుపోయారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సర్పంచ్ భర్త తాళ్లూరి కోటేశ్వరరావుతో పాటు పలువురు గ్రామస్థులు ఉన్నారు.

పెద్దచెరువుపై చిన్నచూపు

పొదిలికి సాగర్ నీరు తెచ్చే కీలక ప్రాజెక్టు పనుల్లో జాప్యం ● బిల్లులపై కాంట్రాక్టర్‌కు సడలుతున్న విశ్వాసమే కారణం


చిల్లచెట్లతో నిండిన పెద్దచెరువు

పొదిలి, ఫిబ్రవరి 23 : ఎంతో ఆర్భాటంగా ఆగమేఘాలమీద పనులు ప్రారంభించిన పొదిలి పెద్ద చెరువపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఈ చెరువులో నీటినిల్వ ప్రాజెక్ట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ముఖ్యమంత్రే ఈ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేసినా, పనుల్లో మాత్రం పురోగతి కనిపించడం లేదు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో కాంట్రాక్టర్ కూడా మొక్కుబడిగా మాత్రమే పనులు చేస్తున్నారు.

గతేడాది ఏప్రిల్‌లో వచ్చిన ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి ప్రాజెక్ట్ పనులను వర్చ్‌వల్‌గా ప్రారంభించారు. సాగర్ కాలువల నుంచి నీటిని తీసుకొని పొదిలి మండలంలో వివిధ గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాలన్నది ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం. దర్శి మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామం వద్ద ఉన్న సాగర్ కాలవ నుంచి పైపుల ద్వారా నీటిని పెద్ద చెరువుకు సరఫరా చేస్తారు. అక్కడ నీటిని ఫిల్టర్ చేసి పట్టణంలో నీటి సరఫరా చేస్తారు. ఈ మేరకు పనులు ఆరు నెలల క్రితం ప్రారంభమయ్యాయి. నాడు పనులు ప్రారంభ సమయంలో ఆరుమాసాల్లోనే ఈ పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి హామీ ఇచ్చారు. అయితే నేటికీ పనుల్లో వేగం పుం జుకోలేదు. సాగర్ కాలువకు పెద్ద చెరువుకు ఇంచుమించు 20 కిలోమీటర్ల దూరం ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం ఐదు కిలోమీటర్ల వరకే పనులు జరిగాయి. మరో 15 కిలోమీటర్ల దూరం పనులు జరగాల్సి ఉంది. అందులో మల్లవరం గ్రామంలో పనులు చేయకుండా గ్రామం దాటిన తరువాత పనులు చేశారు. నత్తకు నడకలు నేర్పుతున్న ఈ పనులు చూసి ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇంత నెమ్మదిగా పనులు జరిగితే నీళ్లు ఎప్పుడు వస్తాయని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతోనే పనులు నెమ్మదిగా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టెండర్ల సమయంలోనూ ఆలస్యం

వైసీపీ ప్రభుత్వంలో పనులు చేస్తే బిల్లులు వస్తాయో రావోనని టెండర్ వేయడానికి ఎవరూ రాకపోవడంతో కొంతకాలం జీవో కాపీని చూపిస్తూ నెట్టుకొచ్చారు. ఆ తరువాత ఎమ్మెల్యే చొరవతో హైదరాబాద్‌లో రఘురాం పైప్స్ కంపెనీ కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. కానీ కాంట్రాక్టర్ ఆరునెలల్లో పూర్తి చేయలేనని 9 నెలల్లో పూర్తి చేసే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇప్పుడు పనులు చేసినా బిల్లులు వస్తాయో రావోనన్న సంశయంలో కాంట్రాక్టరు ఉన్నట్లు తెలిసింది.

నేటికీ అందని బిల్లులు




తరచూ మొరాయిస్తున్న ఎక్స్‌కవేటర్, నత్తనడకన సాగుతున్న పైపులైన్ పనులు

ఇప్పటికే రూ.10కోట్లు ఖర్చు చేసినట్లు కాంట్రాక్టర్ పేర్కొంటున్నారు. అయితే ఇంత వరకు రూపాయి కూడా ప్రభుత్వం నుంచి రాలేదని పేర్కొంటున్నాడు. ఈ క్రమంలోనే ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏమిటి అనే సందిగ్ధంలో కాంట్రాక్టర్ ఉన్నట్లు తెలుస్తోంది. పనులు ప్రారంభించిన నాటి నుంచి ఒకేఒక్క ఎక్స్‌కవేటర్‌తోనే చేద్దామా..వద్దా..? అన్నట్లుగా పనులు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఇక ఆ ఎక్స్‌కవేటర్‌కు కూడా తరచూ మరమ్మతుల పేరుతో పనులు నిలిపేస్తున్నారు. మొత్తం రూ.50 కోట్ల ఈ కాంట్రాక్ట్‌లో మరో రూ.40 కోట్లు ఖర్చు చేస్తేనే పనులు పూర్తయ్యేది. అయితే బిల్లులపై ప్రభుత్వ పెద్దల హామీలేకుండా పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఈ వేసవికి ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదు. ఈ క్రమంలోనే ప్రజలకు నీటి కష్టాలు తప్పేలా కనిపించడం లేదు.

పనులు వేగంగా చేయాలని కోరుతున్నాం

పొదిలి చెరువు పైపులైన్ పనులు 4.కి.మీ పైగా పనులు పూర్తయ్యాయి. 6 కి.మీ వరకు పైపులు తోలారు. వేగంగా పూర్తి చేసి ప్రజలకు అనుకున్న సమయానికి పూర్తి చేసే విధంగా ప్రయత్నాలు చేస్తు న్నాం. ఈవారంలో రాజంపల్లి ప్రాంతం నుంచి కూడా మరో మూడు ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేసే పునులు పూర్తి చేయిస్తాం.

\- రవికుమార్, ఏఈ

పెద్దచెరువుపై చిన్నచూపు

● పొదిలికి సాగర్ నీరు తెచ్చే కీలక ప్రాజెక్టు పనుల్లో జాప్యం ● బిల్లులపై కాంట్రాక్టర్‌కు సడలుతున్న విశ్వాసమే కారణం


చిల్లచెట్లతో నిండిన పెద్దచెరువు

పొదిలి, ఫిబ్రవరి 23 : ఎంతో ఆర్భాటంగా ఆగమేఘాలమీద పనులు ప్రారంభించిన పొదిలి పెద్ద చెరువపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఈ చెరువులో నీటినిల్వ ప్రాజెక్ట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ముఖ్యమంత్రే ఈ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేసినా, పనుల్లో మాత్రం పురోగతి కనిపించడం లేదు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో కాంట్రాక్టర్ కూడా మొక్కుబడిగా మాత్రమే పనులు చేస్తున్నాడు.

గతేడాది ఏప్రిల్‌లో వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రాజెక్ట్ పనులను వర్చ్‌వల్‌గా ప్రారంభించారు. సాగర్ కాలువల నుంచి నీటిని తీసుకొని పొదిలి మండలంలో వివిధ గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాలన్నది ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం. దర్శి మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామం వద్ద ఉన్న సాగర్ కాలవ నుంచి పైపుల ద్వారా నీటిని పెద్ద చెరువుకు సరఫరా చేస్తారు. అక్కడ నీటిని ఫిల్టర్ చేసి పట్టణంలో నీటి సరఫరా చేస్తారు. ఈ మేరకు పనులు ఆరు నెలల క్రితం ప్రారంభమయ్యాయి. నాడు పనులు ప్రారంభ సమయంలో ఆరుమాసాల్లోనే ఈ పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి హామీ ఇచ్చారు. అయితే నేటికీ పనుల్లో వేగం పుంజుకోలేదు. సాగర్ కాలువకు పెద్దచెరువుకు ఇంచుమించు 20 కిలోమీటర్ల దూరం ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం ఐదు కిలోమీటర్ల దూరం వరకే పనులు జరిగాయి. మరో 15 కిలోమీటర్ల దూరం పనులు జరగాల్సి ఉంది. అందులో మల్లవరం గ్రామంలో పనులు చేయకుండా గ్రామం దాటిన తరువాత పనులు చేశారు. నత్తకు నడకలు నేర్పుతున్న ఈ పనులు చూసి ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇంత నెమ్మదిగా పనులు జరిగితే నీళ్లు ఎప్పుడు వస్తాయని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతోనే పనులు నెమ్మదిగా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టెండర్ల సమయంలోనూ ఆలస్యం

వైసీపీ ప్రభుత్వంలో పనులు చేస్తే బిల్లులు వస్తాయో రావోనని టెండర్ వేయడానికి ఎవరూ రాకపోవడంతో కొంతకాలం జీవో కాపీని చూపిస్తూ నెట్టుకొచ్చారు. ఆ తరువాత ఎమ్మెల్యే చొరవతో హైదరాబాద్‌లో రఘురాం పైప్స్ కంపెనీ కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. కానీ కాంట్రాక్టర్ ఆరునెలల్లో పూర్తి చేయలేనని 9 నెలల్లో పూర్తి చేసే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇప్పుడు పనులు చేసినా బిల్లులు వస్తాయో రావోనన్న సంశయంలో కాంట్రాక్టరు ఉన్నట్లు తెలిసింది.




తరచూ మొరాయిస్తున్న ఎక్సకవేటర్, నత్తనడకన సాగుతున్న పైపులైన్ పనులు

నేటికీ అందని బిల్లులు

ఇప్పటికే రూ.10కోట్లు ఖర్చు చేసినట్లు కాంట్రాక్టర్ పేర్కొంటున్నారు. అయితే ఇంత వరకు రూపాయి కూడా ప్రభుత్వం నుంచి రాలేదని పేర్కొంటున్నాడు. ఈ క్రమంలోనే ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏమిటి అనే సందిగ్ధంలో కాంట్రాక్టర్ ఉన్నట్లు తెలుస్తోంది. పనులు ప్రారంభించిన నాటి నుండి ఒకేఒక్క ఎక్స్‌కవేటర్‌తోనే చేద్దామా...? వద్దా..? అన్నట్లుగా పనులు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఇక ఆ ఎక్సకవేటర్‌కు కూడా తరచూ మరమ్మతుల పేరుతో పనులు నిలిపేస్తున్నారు. మొత్తం రూ.50 కోట్ల ఈ కాంట్రాక్ట్‌లో మరో రూ.40 కోట్లు ఖర్చు చేస్తేనే పనులు పూర్తయ్యేది. అయితే బిల్లులపై ప్రభుత్వ పెద్దల హామీలేకుండా పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఈ వేసవికి ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదు. ఈ క్రమంలోనే ప్రజలకు నీటి కష్టాలు తప్పేలా కనిపించడం లేదు.

వేగంగా చేయాలని కోరుతున్నాం

పొదిలి చెరువు పైపులైన్ పనులు నాలుగు కిలోమీటర్లకు పైగా పనులు పూర్తయ్యాయి. ఆరు కిలోమీటర్ల వరకు పైపులు తోలారు. వేగంగా పూర్తి చేసి ప్రజలకు అనుకున్న సమయానికి పూర్తి చేసే విధంగా ప్రయత్నాలు చేస్తు న్నాం. ఈవారంలో రాజంపల్లి ప్రాంతం నుండి కూడా మరో మూడు ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేసే పనులు పూర్తి చేయిస్తాం.

రవికుమార్, ఏఈ

ఆగి ఉన్న ఆటోను ఈడ్చుకెళ్లిన లారీ

● పలువురు కూలీలకు గాయాలు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 23: మిరప కోతలకు కూలీలను తీసుకెళ్తూ, ఆగి ఉన్న ఆటోను ఓ లారీ వెనుక నుంచి వచ్చి ఈడ్చుకెళ్లిన ఘటనలో ఆటో బోల్తా పడింది. దీంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని చట్టుతాండా సమీపంలో విద్యుత్తు సబ్‌స్టేషను వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చింతల గ్రామానికి చెందిన చెంచు గిరిజనులు భూమని వెంకటేశం, జల్లా నాగలక్ష్మి, కుడుముల సాయిరాం, కుడుముల మల్లిక, భూమని నాగమ్మ, భూమని అంకమ్మలకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం..., చింతలకు చెందిన గిరిజనులు పెద్ద బొమ్మలాపురంలో మిరప కోతలకు ఆటోలో వెళ్తున్నారు. మార్గమధ్యంలో ఆటోడ్రైవరుకు తెలిసిన మోటారుసైకిలిస్టు ఎదురు పడ్డాడు. రోడ్డుకు అవతలి వైపున మోటారు సైకిలిస్టు, మరోవైపు ఆటో నిలబెట్టి మాట్లాడుతున్నారు. ఇదే సమయంలో శ్రీశైలం వైపు నుండి ప్రయాణిస్తున్న లారీ రెండు వాహనాల మధ్యగా వెళ్లింది. అయితే వారిని దాటే సమయంలో లారీ వెనుక వైపున ఉన్న డోరు చైను ఆటోను తగిలి ఈడ్చుకు పోయింది. అప్రమత్తమైన డ్రైవరు వెంటనే లారీని నిలిపివేశాడు. అప్పటికే ఆటోను కొద్ది దూరం ఈడ్చుకొని వచ్చి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి గాయా లయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్ వాహనానికి సమాచారమిచ్చారు. దీంతో క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, ప్రథమచికిత్సలు నిర్వహించారు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై అంకమరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు.


గాయపడిన చిన్నారి సాయిరాం


తీవ్రంగా గాయపడిన అంకమ్మ

29 లోపు లైఫ్ సర్టిఫికెట్స్ అప్‌లోడ్ చేయాలి

కొమరోలు, ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ పెన్షన్ పొందుతున్నవారు ఈ నెల 29వ తేదీ లోపు లైఫ్ సర్టిఫికెట్స్‌ను మీసేవల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆ సంఘం మండల అధ్యక్షులు యాసం అమరేశ్వరరావు అన్నారు. పెన్షన్ పొందే వారు తమ లైఫ్ సర్టిఫికెట్లను జమచేయకపోతే వచ్చేనెల పెన్షన్ ఆడుతుందన్నారు. మీసేవా కేంద్రాలకు వెళ్లనప్పుడు ఆధార్‌కార్డు, పీపీవో కాపీ, బ్యాంకు పుస్తకం, సెల్‌ఫోన్ తీసుకెళ్లాలన్నారు.

మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 23: మీటర్ రీడర్స్‌కు ఉద్యోగభద్రత కల్పించాలని మీటర్స్ రీడర్స్ అసోసియేషన్ కార్యదర్శి బాలకాశయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకాశయ్య మాట్లాడుతూ మీటర్ రీడర్లకు వేతనాలు నేరుగా వారి ఖాతాల్లో జమచేయాలన్నారు. ఐటీఐ అర్హత ఉన్నవారిని సబ్‌స్టేషన్‌లలో షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించాలన్నారు. లేనివాళ్లకు వాచ్‌మెన్, అటెండర్‌లుగా నియమించాలన్నారు. సచివాలయాలలో పనిచేసే గ్రేడ్-2 జేఏఎల్‌ఎంలను ట్రాన్స్‌కో ఉద్యోగులుగా పరిగణించాలన్నారు. ఎనర్జీ అసిస్టెంట్, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సచివాలయ ఉద్యోగులకు విద్యుత్ సంస్థలోని ఉద్యోగులకు అమలు చేస్తున్న పాత సర్వీస్ రూల్స్‌నే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు మంజునాథ్, జిల్లా కార్యదర్శి సతీష్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ కాశీం, రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలకాశయ్య

గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల ధర్నా

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 23: స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఎదురు శుక్రవారం ఆ బ్యాంకు అధికారుల సం ఘం, ఉద్యోగుల సంఘం సంయుక్తంగా సమ్మె చేసి ధర్నా నిర్వహించారు. అధికారుల సంఘం ప్రాంతీయ కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలోని అన్ని గ్రామీణ బ్యాంకులను స్టేట్‌వైడ్ గ్రామీణ బ్యాంకుగా చేస్తు జాతీయ గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘాల నాయకులు సందీప్, సుమంత్, వేణుగోపాల్, కృష్ణా, సమీరా, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి డీకేఎం రఫి తదితరులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ముండ్లపాడుకు కళాశాల మంజూరు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 23 : గిద్దలూరు మండలం ముండ్లపాడుకు ఇంటర్మీడియట్ కాలేజ్ మంజూరైనట్లు జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు, ఆమేరకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 23 : దిగువమెట్ట అటవీశాఖ తనిఖీ కేంద్రం వద్ద అధికారులు మెటల్ డిటెక్టర్లు ఉపయోగించి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి డి.వంశీక్రిష్ణ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. నిషేధిత వస్తువులు అక్రమ రవాణా చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


తనిఖీ చేస్తున్న అధికారులు

మాట తప్పడం, మడమ తిప్పడం జగన్‌రెడ్డి నైజం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 23 : అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డికి మాట తప్పడం, మడమ తిప్పడం సహజనైజం అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 57 నెలల పాలన కాలంలో 14 లక్షల అసైన్‌మెంట్ భూములను కబ్జా చేసిన జగన్‌రెడ్డి ముఠా ప్రజాద్రోహులు కాదా అని ఆయన ప్రశ్నించారు. పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల కోరికైన అయిన వెలుగొండ ప్రాజెక్టును టీడీపీ హయాంలో 80 శాతం పూర్తి చేశామన్నారు. అయితే నేటికీ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పూర్తి చేయలేదన్నారు. గత టీడీపీ హయాంలో రూ.2.50 లక్షల పక్కా గృహాలను చంద్రబాబు మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం కేంద్రం ఇచ్చే రూ.1.80 లక్షలతోనే చేతులు దులుపు కొందన్నారు. పేదలపై కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. కార్పొరేషన్ల ద్వారా సబ్సిడి రుణాలు అందించలేదన్నారు. ఆర్భాటాలతో మొదలైన ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఒక్క రూపాయి లబ్ది చేకూర లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడం తథ్యమన్నారు.

గిద్దలూరు టౌన్ : పేదల సంక్షేమాన్ని విస్మరించి పరిపాలిస్తున్న వ్యక్తి జగన్‌రెడ్డి అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. పట్టణంలోని 20వ వార్డులో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డుకు చెందిన సుమారు 50 ఎస్టీ కుటుంబాలు కావడి గురువయ్య ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. గిద్దలూరు ప్రాంతంలో నాటి టీడీపీ హయాంలో నిర్మించిన 1450 టిడ్కో గృహాలను ఐదేళ్లు పూర్తి కావస్తున్నా పంపిణీ చేయకపోవడం శోచనీయమన్నారు. పట్టణంలోని రాచర్లగేటు వలన ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న దృష్ట్యా టీడీపీ అధికారంలోనికి రాగానే గేటు సమస్యను పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసకుంటామన్నారు. టీడీపీలో చేరిన వారిలో పోలా శ్రీనివాసులు, ఓబురాయి రమేష్, రాగిరి శ్రీనివాసులు, రాగిరి సుధాకర్, రాగిరి కళ్యాణి, పోలా నాగరాజు, పందిళ్ల మల్లికార్జున, పందిళ్ల శేఖర్, పందిళ్ల బ్రహ్మయ్య, ఈర్ల కుమార్, కావడి గురువయ్య, పెరవడి వెంకట సుబ్బయ్య, పంకా రాజశేఖర్ యాదవ్, పందర బోయిన పుల్లయ్యతోపాటు పట్టణ పార్టీ అధ్యక్షు లు షహన్షావలి, మాజీ సర్పంచ్ దప్పిలి విజయ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు బిల్లా రమేష్‌యాదవ్, పాలుగుళ్ల చిన్నశ్రీనివాస రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, షేక్ పెద్దమస్తాన్ వలి, దుత్తా బాలీశ్వరయ్య పాల్గొన్నారు.


కార్యకర్తలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి

కందుల నారాయణరెడ్డి తనయుడు రోహిత్‌రెడ్డి

తర్లుపాడు, ఫిబ్రవరి 23: రానున్న ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు పట్టుదలతో సమష్టిగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల రోహిత్ రెడ్డి అన్నారు. మండలంలోని తాడివారిపల్లెలో 'బాబు షూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి తిరిగి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో కందుల నారాయణరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు కంచెర్ల కాశయ్య, టీడీపీ నాయకులు రొడ్డ గురవయ్య, నంబుల లక్ష్మయ్య, నరసింహా, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


తాడివారిపల్లెలో పర్యటిస్తున్న రోహిత్‌రెడ్డి


మార్కాపురంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

టీడీపీలో చేరికలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 23: పట్టణంలోని 32వ వార్డులో వైసీపీకి చెందిన 40 కుటుంబాలు శుక్రవారం రాత్రి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ కల్లబొల్లి మాటలు నమ్మి దగా పడిన కుటుంబాలన్ని టీడీపీలో చేరుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారిలో బలపాల హుస్సేన్, పెదదీనా, చినదీనా, జిలానీ, హుస్సేన్‌షా, ఇమ్రాన్, షానూర్, కార్పెంటర్ మున్నా, టైరల్ ఖాసీం, కోటయ్య, షేక్ మస్తాన్ తదితరులు ఉన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన

గిద్దలూరు, ఫిబ్రవరి 23 : మండలంలోని దంతెరపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు, గ్రామస్థులకు ఫ్లోరోసిస్ వ్యాధిపై వైద్యాధికారులు అవగాహన కల్పించారు. జిల్లా ఫ్లోరోసిస్ అధికారి డాక్టర్ అనీల్‌కుమార్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సుమయ మాట్లాడుతూ తాగునీరు, తీసుకునే ఆహార పదార్థాలలో ఫ్లోరైడ్ 1.5% అధికంగా ఉన్నందున వ్యాధి భారిన పడుతున్నామని పేర్కొన్నారు. వ్యాధిసోకిన వారికి ఎముకలకు, దంతాలకు ఇబ్బందికరంగా ఉంటాయన్నారు. కాల్షియం అధికం గా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది బాదరయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కొమరోలు : విద్యార్థులు ఫ్లోరోసిస్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ కో-ఆర్డినేటర్ అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు.దీని నివారణకు విటమిన్ డీ ఉన్న ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొమరోలు వైద్యాధికారి చైతన్య దీపక్, ప్రధానోపాధ్యయులు అశ్వనీకుమార్ పాల్గొన్నారు.

రాచర్ల : మండలంలోని రాచర్ల ప్రాథమిక ఉన్నత పాఠశాల, ఆకవీడు ప్రాథమికోన్నత పాఠశాలలను అనిల్‌కుమార్ సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రజాపతి, వైద్యాధికారిణి సరళ, హెచ్‌ఈవో విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ అంజనిదేవి, పాఠశాల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అనిల్‌కుమార్

శంఖారావం సభకు స్థల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 23 : టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన శంఖారావం యాత్ర సభకు ఎర్రగొండపాలెంలో శుక్రవారం రాబిన్ శర్మ బృందం సభ్యులు స్థలాన్ని పరిశీలించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. యువగళం పాదయాత్ర జరగని నియోజకవర్గంలో ఎర్రగొండపాలెం ఉన్నందున విజయశంఖారావం సభ నిర్వహించేందుకు ఆ పార్టీ నిర్ణయించింది. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు, శుక్రవారం ఎర్రగొండపాలెంలో రాబిన్ శర్మ, రవియాదవ్‌లు ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుతో కలసి రెండుచోట్ల స్థలాలను పరిశీలించారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో ఒక చోట, త్రిపురాంతకం మండలం జంక్షన్ వద్ద మరో ప్రైవేటు స్థలాన్ని పరిశీలించారు. ఈ నెల 26 తర్వాత సభ ఉంటుందని ఎరిక్షన్‌బాబు తెలిపారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తర్లుపాడు, ఫిబ్రవరి 23: తర్లుపాడులో వెలిసిన శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుషికేషరణ, అంకురార్పణం, భేరీ పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు అర్చకులు కారంపూడి వెంకటరమణాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామివారికి ఉభయదాతలు జవాజి విజయభాస్కర్, సతీమణి శేషకుమారి, సాయికృష్ణ, హేమ సాయి లక్ష్మిలు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవులరెడ్డి, జవాజి సత్యనారాయణ, కె.రామకృష్ణారెడ్డి, కాశీరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, దోగిపర్తి మల్లికార్జున రావు, వివిధ వాహనాల ఉభయదాతలు పాల్గొన్నారు.


ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

నేడు కళ్యాణం

శ్రీ రుక్మిణి సత్యభామ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఉదయం 10గంటలకు స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవులరెడ్డి తెలిపారు. స్వామివారి కళ్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అవీ..ఇవీ..

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 23 : సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని గణేష్‌నగర్, ఏబీఎం పాలెంలలోని సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. హాజరు పట్టిక పరిశీలించి ఉద్యోగుల మూమెంట్ రిజిస్టర్ల ను తనిఖీ చేశారు. కేటాయించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజెప్పి అర్హులకు అందేలా చూడాలన్నారు. జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. ఇంటి, నీటి, ఖాళీ స్థలాల పన్నులు వసూలు వేగవంతం చేయాలని కోరారు.


సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

హెచ్‌ఐవీపై అవగాహన కోసం కళాజాత

గిద్దలూరు, ఫిబ్రవరి 23 : హెచ్‌ఐవీ, సుఖవ్యాధులకు గురికాకుండా హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సంస్థ ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎస్‌టీఐ ఎలా వస్తుంది, ఎలా రాదు అనే విషయంపై, కండోమ్స్ వాడకంపై నాటక రూపంలో ప్రదర్శన నిర్వహించారు. సురక్షితం కాని లైంగిక సంబంధాల వలన, కలుషితమైన సూదుల వలన హెచ్‌ఐవీ సోకితే గర్భిణుల నుంచి పుట్టబోయే బిడ్డకు కూడా హెచ్‌ఐవీ వస్తుందని నాటక ప్రదర్శనలో వివరించారు. తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవాలని పేర్కొన్నారు. విఘ్నేశ్వర కళాజాత ఇన్‌చార్జి శివప్రసాద్ ఆధ్వర్యంలో కళాకారులు కళజాత నిర్వహించగా వైద్యసిబ్బంది రిబ్కారాణి, భవాని, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు

పెద్ద దోర్నాల, పొదలి, ఫిబ్రవరి 23: మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని పెదదోర్నాల, ఎంఈవోలు మస్తాన్ నాయక్, ఎం కొండలరావు పొదిలి ఎంఈవోలు ఎం.శ్రీనివాసరెడ్డిలు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ప్రైవేటు పాఠశాలలు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, అనాథలు, హెచ్‌ఐవీ బాధిత పిల్లలు, విభిన్న ప్రతిభావంతులకు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 23 నుండి మార్చి 14వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్, కులం, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, రేషన్‌కార్డు, ఫోటోలతో సమీప సచివాలయాలు, నెట్‌కేంద్రాల్లో, విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు. మరింత సమాచారం కోసం టోల్‌ఫ్రీ నెంబరు 18004258599,లేదా 9490174988 సంప్రదించాలన్నారు.

28న ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

త్రిపురాంతకం, ఫిబ్రవరి 23: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠా మహోత్సవాన్ని ఈనెల 28న నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, పాలకమండలి చైర్మన్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు తెలిపారు. దీనిలో భాగంగా 24 నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. 24న గోపూజ, గణపతిపూజ, పంచగవ్యప్రాసన, దీక్షాధారణ, 25న లక్ష్మీ గణపతిహోమం, మహారుద్రహోమం, 26న పంచాక్షరీ మూలమంత్ర హోమం, యాగమండప దేవతా హోమాలు, జలాధివాసం నిర్వహిస్తారు. 27న ధాన్యాధివాసం, పుష్పాధివాసం, దర్పణాధివాసం, శయ్యాధివాసం, 28న ఉదయం 10.05 గంటలకు ఆదిత్యాది నవగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని తెలిపారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ పంపిణీ


ట్రైసైకిల్ పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు

కొమరోలు, ఫిబ్రవరి 23: దివ్యాంగులకు చే యూతనిచ్చేందుకు అమ్మా ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో మండలంలోని ఇడమకల్లు గ్రామంలో ట్రై సైకిళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మానవసేవే మాధవసేవగా భావిస్తూ నిరంతరం అమ్మా ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. మండలంలోని ఇడమకల్లు గ్రామానికి చెందిన బద్దీటి ఏసేబు అనే నిరుపేద వికలాంగునికి మనోధైర్యాన్ని ఇచ్చి తన పనులు చేసుకునే విధంగా ట్రై సైకిల్స్ పంపిణీచేశామన్నారు. ఏసేబు మాట్లాడుతూ అమ్మా ఫౌండేషన్ తనకు ట్రై సైకిల్ తనకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బత్తుల కేశవగౌడ్, ఓబుల్‌రెడ్డి, గురుస్వామిరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, వెంకటయ్య, కిట్టయ్య, కాశీరావు పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థి ప్రతిభ

● కేఎంపీ స్టేట్ ఫస్ట్ ర్యాంకు

తర్లుపాడు, ఫిబ్రవరి 23: కేఎంపీ పరీక్షా ఫలితాలలో కలుజువ్వలపాడు నవోదయ విద్యాలయం విద్యార్థి గోడపర్తి హిర్షత్ విశ్వేశ్వర్ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. విశ్వేశ్వర్ ప్రస్తుతం పదోతరగతి చదువుతున్నాడు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన కేఎంపీ పరీక్షల్లో ప్రథమ ర్యాంకు సాధించాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ అభినందించారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం విద్యార్థుల మేధస్సుల మేలుకలయికతో ఈ గౌరవం దక్కిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు అధికారులు ప్రథమస్థానం సాధించిన విద్యార్థిని అభినందించారు.


గోడపర్తి హిర్షత్

నేడు సంగీత విభావరి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 23: స్థానిక రీడింగ్ రూమ్‌లో శనివారం సాయంత్రం 6గంటలకు సంగీత విభావరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు త్రివిక్రమ అభ్యుదయ కళాసేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పురాణం సుబ్రహ్మణ్యం, చిత్తారి రంగనాయకులు శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... ఆర్మీ జవాను మృతి

● మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

బేస్తవారపేట, ఫిబ్రవరి 23: కడప జిల్లా పోరుమామిళమండలంలోని రామిరెడ్డికుంట సమీపంలో గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకోనడంతో బేస్తవారపేట మండలంలోని గంజరపల్లెకు చెందిన మనోజ్ అనే ఆర్మీ జవాను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో తిరుపతి, అంజి అనే ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పోరుమామిళ్ల ఎస్‌ఐ మల్లిఖార్జునరెడ్డి కథనం మేరకు.. గంజరపల్లెకు చెందిన వీరు శుక్రవారం సంతకు వచ్చి కొమరోలు వైపు తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మనోజ్ 8 ఏళ్ల నుంచి ఆర్మీలో ఉన్నాడు. రెండేళ్ల క్రితం వివాహం జరిగిందని, ఒక కుమారుడు ఉన్నాడు. విషయం తెలిసిన ఎస్‌ఐ సంఘటనాస్థలానికి వెళ్లి విచారణ చేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంజిని మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మనోజ్ కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బోరున విలపించారు.


మనోజ్ (ఫైల్)



సిద్ధమైన టీడీపీ ప్రభ

ముండ్లమూరు, ఫిబ్రవరి 23 : మండలంలోని వేములగ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం రవ్వారం కొండపై కొలువైన శ్రీ కొండగురునాథ స్వామి జాతరకు విద్యుత్ ప్రభను సిద్ధం చేశారు. శుక్రవారం గ్రామంలో ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. శనివారం జరిగే తిరునాళ్లకు ప్రభను ఏర్పాటు చేసి అందులో పాట కచేరీని ఏర్పాటు చేశారు. ఏడాదికి ఒక సారి జరిగే కొండ గురునాథ స్వామి తిరునాళ్ల సందర్భంగా బంధువులు గ్రామానికి చేరుకున్నారు. దీంతో పండుగ వాతావరణం సంతరించుకుంది.

నాసిరకంగా సీసీ రోడ్ల నిర్మాణం

- మూడేళ్లకే దెబ్బతిన్న వైనం
- పూత పూసి మాయ చేస్తున్న అధికారులు

దర్శి, ఫిబ్రవరి 23 : దర్శి పట్టణంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సీసీ రోడ్లు మూడు సంవత్సరాలకే దెబ్బతిన్నాయి. నాణ్యతా ప్రమాణాలు పట్టించుకోకుండా నాసిరకంగా పనులు నిర్వహించడంతో కంకర లేచి గుంతలు పడ్డాయి. కొన్నిచోట్ల పూర్తిగా సిమెంట్ కంకర లేచిపోయి గతుకులమయ్యింది. అధికారులు లోపాలను కప్పిపుచ్చుకునేందుకు కొన్నిచోట్ల సిమెంట్ పూతలు మరికొన్ని చోట్ల తారుపూతలు వేశారు. అయినప్పటికీ సిమెంట్ పూత కూడా కొన్నిచోట్ల లేచి మళ్లీ కంకర బయటపడింది. దర్శి-కురిచేడు ప్రధాన రహదారిలో మూడేళ్ల క్రితం సుమారు రూ.3 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించారు. సంబంధిత కాంట్రాక్టరు అధికార పార్టీకి చెందిన నాయకుడు అయినందున పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. అధికారులు కూడా ఏమి చేయలేక కాంట్రాక్టరుకు అనుకూలంగా పనులు పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణం జరిగిన ఏడాదికే కంకర లేచిపోయింది. ఆ తర్వాత ఆర్అండ్‌బీ అధికారులు సిమెంట్ పూతలు వేశారు. ప్రస్తుతం ఆ సిమెంట్ పూతలు కూడా పోయి మళ్లీ కంకర బయటపడింది. అదేవిధంగా దర్శి పట్టణంలో వేసిన అంతర్గత రోడ్లు కూడా కంకర లేచి దెబ్బతిన్నాయి. గతంలో 20 సంవత్సరాల క్రితం నిర్మించిన రోడ్లు అనేక చోట్ల చెక్కుచెదరలేదు. వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్ల అధ్వానస్థితిని చూసి ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనాన్ని అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పుడైనా ఆ రోడ్లను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



దర్శి - కురిచేడు రోడ్డులో కంకర లేచి.. ఏర్పడిన గుంతలు



కంకర లేచిన చోట పూత పూసినా మళ్లీ దెబ్బతిన్న రోడ్డు

సీఎం సభకు బస్సుల తరలింపు

ప్రయాణికుల ఇక్కట్లు

తాళ్లూరు, ఫిబ్రవరి 23 : ఒంగోలులో శుక్రవారం జరిగిన సీఎం సభకు బస్సులు తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని పలు గ్రామాలకు తిరిగే రోజువారీ బస్సులను అధికారులు రద్దు చేశారు. దీంతో తాళ్లూరు నుంచి రాకపోకలు సాగించే ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. గతంలో సీఎం సమావేశాలకు ఒకటో రెండో బస్సులు రద్దు చేసేవారు. ప్రస్తుతం ఒంగోలు, అద్దంకి డిపోలకు చెందిన బస్సులను ఒంగోలుకు తరలించారు. కేవలం ప్రైవేటు సర్వీసు లక్కవరం బస్సు మాత్రమే నడిచింది. దీంతో ఇతరప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చే ఉపాధ్యాయులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బాధిత కుటుంబాలకు టీడీపీ నాయకుడి సాయం



మృతదేహానికి నివాళులర్పిస్తున్న వెంకన్నచౌదరి

దొనకొండ, ఫిబ్రవరి 23 : మండలంలోని ఇండ్లచెరువు గ్రామానికి చెందిన బొమ్మలాపురం వెంకటరమణ, రాగమక్కపల్లికి చెందిన పైడిపోగు దానియేలు ఇరువురు అనారోగ్యం కారణంగా గురువారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ మండల నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి శుక్రవారం ఇండ్లచెరువు, రాగమక్కపల్లి గ్రామాలకు వెళ్లి వెంకటరమణ, దానియేలు మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ యజమానులు కోల్పోయి రోదిస్తున్న వారిని పరామర్శించి అధైర్యపడొద్దు..అండగా ఉంటామంటూ ధైర్యం చెప్పారు. మట్టిఖర్చులకు ఒక్కో కుటుంబానికి రూ.10వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు దుగ్గెంపూడి కోటేశ్వరరావు, ఫణిదపు అనంతరాములు, బోయపాటి సుబ్బయ్య, సింగమనేని హనుమంతరావు పాల్గొన్నారు.

27న జాబ్ మేళా

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 23 : ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 27న కళాశాల విద్యా కమిషనర్ ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ డి.కల్యాణి శుక్రవారం తెలిపారు. జిల్లాలోని కందుకూరు, ఉలవపాడు, కనిగిరి, కంభం, దర్శి, ఎర్రగొండపాలెం, దోర్నాల, అద్దంకి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులందరూ ఈ జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు.



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ గురుబ్రహ్మం

ఉగ్ర గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

పామూరు, ఫిబ్రవరి 23 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ఉగ్ర నరసింహారెడ్డి గెలుపే ధ్యేయంగా పనిచేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని మాజీ సర్పంచ్ మల్లెబోయిన గురుబ్రహ్మం కోరారు. మండలంలోని తిరగళదిన్నె, మోపాడు, ప్రాంతాలకు చెందిన పలువురు టీడీపీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుబ్రహ్మం మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా ఓటు వేసినప్పటికీ యాదవ సామాజిక వర్గ అభివృద్ధిని జగన్‌రెడ్డి విస్మరించారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో విభేదాలు వీడి అందరూ కలిసికట్టుగా ఉగ్ర గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయ సమావేశంలో తిరగళదిన్నె బూత్ కమిటీ ఇన్‌చార్జి ఆవుల రమణమ్మ, రియాల్టర్ మల్లెబోయిన బాలబ్రహ్మయ్య, మోపాడుకు చెందిన టీడీపీ నాయకులు దేవరపు మాల్యాద్రి, తెలజాల ప్రసాద్, ఆవుల వెంకటేశ్వర్లు, దాసరి నారాయణ, బొట్ల చిన అబ్బయ్య మేకల బాలనాగయ్య, బాల గంగయ్య, మండ్ల మాలకొండయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పిచ్చయ్య

దర్శి, ఫిబ్రవరి 23 : దర్శి పట్టణంలోని మూడవ వార్డులో రూ.12 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, మురుగు కాల్వలకు నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శి నగర పంచాయతీలోని అన్ని వార్డుల్లో ప్రణాళికాబద్ధంగా సీసీ రోడ్లు, కాల్వలను నిర్మిస్తామన్నారు. దర్శి పట్టణంలో పూర్తి స్థాయిలో సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. అధికారులు పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్లు ఇత్తడి సునీత, దినకర్, రంగా, మాజీ ఉప సర్పంచ్ సందు వెలుగొండయ్య, దర్శి నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి సందు రామయ్య నాయకులు ఆదినారాయణ, అంజినాయుడు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

దొనకొండ, ఫిబ్రవరి 23 : గౌతమీ డిగ్రీ కళాశాలకు చెందిన 56 మంది విద్యార్థులకు దొనకొండ బ్రహ్మారావుపేట చెందిన దాత మంచా మీనాకుమారి పరీక్షలకు అవసరమైన ప్యాడ్, పెన్నులను శుక్రవారం పంపిణీ చేశారు. మార్చిలో నిర్వహించే డిగ్రీ పరీక్షల్లో విద్యార్థులు మంచి జ్ఞాపకశక్తితో పరీక్షలు రాసి గౌతమి కాలేజీకి ఉత్తమ ఫలితాలు అందించాలని మీనాకుమారి విద్యార్థుల కు సూచించారు. దాత మీనాకుమారిని పిన్సిపాల్ గోపి అభినందించారు. కా ర్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామయోగి, కాలేజీ అడ్మిన్ఎఫ్రాయిమ్(నాని), అధ్యాపకులు వెంకటేశ్వరరెడ్డి, దేవదానం, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్యాడ్‌ను అందజేస్తున్న మీనాకుమారి

నేరేడుపల్లి జడ్పీ స్కూల్‌లో..



పరీక్ష సామగ్రితో విద్యార్థులు

పీసీపల్లి : మండలంలోని నేరెడుపల్లి జడ్పీ ఉన్నతపాఠశాలలోని 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులకు కేసరి వెంకటరెడ్డి ధనలక్ష్మీ కుమారులు ప్రణీత్, ప్రతీక్ పరీక్షలకు ఉపయోగపడే సామగ్రిని శుక్రవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి మాట్లాడు తూ పరీక్ష సామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం దా తల ఇరువురిని ప్రధనోపాధ్యాయునితోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఫిల్టర్ బహూకరణ

నేరేడుపల్లి గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి సీమలదిన్నె మనోజ్ రూ.13వేల విలువైన నీటి శుద్ధి యంత్రాన్ని హెచ్‌ఎంకు బహూకరించారు. మనోజ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు వడ్డెర సంఘం యువగర్జన



పీసీపల్లి, ఫిబ్రవరి 23 : గుంటూరులో ఈనెల 25న రాష్ట్ర స్థాయి వడ్డెర సంఘం యువగర్జన నిర్వహిస్తున్నట్లు వడ్డెర పరిరక్షణ సమితి రాష్ట్ర సలహాదారు బండారు వెంకట్రావు తెలిపారు. మండల కేంద్రమైన పీసీపల్లిలో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎంతోకాలంగా వడియరాజులు పాలకులు నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. తమ హక్కులు, ఆత్మగౌరవం కోసం సంఘం తరుపున ఈనెల 25న గుంటూరులో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వడియరాజులను సమావేశపరిచి తమ సమస్యల పరిష్కారం కోసం చర్చిస్తామన్నారు. గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే యువగర్జనకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వడియ రాజులు తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జగన్ పాలనంతా అబద్ధాలమయం

- హామీలపై మడమతిప్పి మోసం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ధ్వజం

కనిగిరి, ఫిబ్రవరి 23: జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనంతా అబద్ధాలతోనే సాగిందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. అమరావతి గ్రౌండ్స్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఉగ్ర మాట్లాడారు. హామీలపై మాటిచ్చి మడమ తిప్పి ప్రజలను మోసగించారని ఉగ్ర ధ్వజమెత్తారు. చంద్రబాబు పాలనలో నాణ్యతతో టిడ్కో ఇళ్లను నిర్మిస్తే అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి వాటిని పేదలకు ఇవ్వకుండా గాలికొదిలేశార న్నారు. చంద్రబాబు పాలనలో పేదలకు 2 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు ఎన్టీఆర్ హౌసింగ్ కింద కట్టించి ఇచ్చారని గుర్తు చేశారు. జగన్‌రెడ్డి కాలనీల పేరుతో లక్షలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియో గం చేశారని ఆరోపించారు. కేవలం సెంటు భూమిని అది కూడా ఊళ్లకు దూరంగా ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏ ఎమ్మెల్యే, మంత్రి ప్రజలకు ఒరగబెట్టిందేదీలేదన్నారు. ఐదేళ్ల ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఎన్నికల వస్తుండడంతో ఒంగోలులో ఇళ్ల పట్టాల పేరుతో సెంటు భూమిని ఇచ్చి రూ.కోట్లు మింగేందుకు ఎత్తులు వేస్తున్నారని ఆరోపించారు. కనిగిరిలో నిర్మించిన టిడ్కో ఇళ్లతో పాటు రాష్ట్రంలోని టిడ్కో ఇళ్ల ను టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చం ద్రబాబు పేదలకు ఇస్తారని ఉగ్ర హామీ ఇచ్చా రు. తల్లిని గెంటేసిన జగన్ చెల్లిపై కూడా కక్ష గట్టారన్నారు. షర్మిలను నడిరోడ్డుపై పోలీసులతో ఈడ్చి తీసుకెళ్లడం దుర్మార్గ చర్యగా పేర్కొన్నారు. జగన్ అరాచకపాలనపై వాస్తవాలు ప్రజలకు తెలియజేస్తున్న పత్రికా కార్యాలయాలు, మీడియా ప్రతినిధులపై దాడులు చేయించడం, పత్రికా కార్యాలయాలపై దాడులు చేయించిన చరిత్రహీనుడు జగన్‌రెడ్డి అన్నారు. యువతకు ఉపాధిపై ఐటీ, వెలిగొండపై ఎలాంటి ఊసే లేదన్నారు. ఇక జగన్‌కు 50 రోజులే గడువు ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీపై గెలిచేది ఖాయమని, టీడీపీ సైన్యం అత్యధిక మెజార్టీ కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వీవీఆర్ మనోహరరావు, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు యాదవ్, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, యడవల్లి శ్రీనివాసులురెడ్డి, జంషీర్, గండికోట రమేష్, మూలె బ్రహ్మారెడ్డి, సైకం మాలకొండారెడ్డి, సిద్దాటపు వెంకటరెడ్డి, బాలు ఓబులురెడ్డి, బుల్లా బాలబాబు, గుడిపాటి ఖాదర్, అహ్మద్, యువ కిషోరం ఓబులురెడ్డి పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన ఏరువారిపల్లి గ్రామ వైసీపీ కుటుంబాలతో డాక్టర్ ఉగ్ర

వైసీపీని వీడి టీడీపీలో చేరిన 60 కుటుంబాలు

భారీ మెజారిటీతో గెలిపించండి : ఉగ్ర

మండలంలోని ఏరువారిపల్లి గ్రామంలోని వైసీపీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీకి చెందిన 60 కుటుంబాలు బిజ్జం వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీలో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేసే అభివృద్ధి, సూపర్ సిక్స్ పథకాలతోపాటు తాను సంకల్పించిన అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసు కెళ్లాలని ఉగ్ర సూచించారు. కొత్తగా చేరిన వారిని కలుపుకొని కలిసికట్టుగా పనిచేయాలని ఉగ్ర కోరారు. పార్టీలో చేరిన వారిలో పరుచూరి లక్ష్మయ్య, మేడం వెంకటరెడ్డి, చిన్నపరెడ్డి, బిజ్జం తిరుపతిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, పఠాన్ నాయబ్ రసూల్, రఫూరి పెద బ్రహ్మయ్య, పాలెయ్య, వెంకట రమణయ్య, ప్రభాకరరెడ్డి, అంజయ్య, ఇరగబోయిన శ్రీనివాసులుయాదవ్, డీకల ఓబులు, విల్సన్, నరసింహతో కలసి 60 కుటుంబాలు చే రారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, యడవల్లి శ్రీనివాసులురెడ్డి, సైకం మాలకొండారెడ్డి, బాలు ఓబులురెడ్డి, సిద్దాటపు వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంట సొంత నిధులతో రోడ్ల అభివృద్ధి

తాళ్లూరు, ఫిబ్రవరి 23 : ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, యువ నాయకుడు మాగుంట రాఘవరెడ్డి సహకారంతో సొంత నిధులు వెచ్చించి మండలంలోని తాళ్లూరు గ్రామంలో రోడ్డు అభివృద్ధి పనులను శక్రవారం చేపట్టారు. గ్రామంలోని సుంకిరెడ్డిపాలెం (తూర్పుపాలెం) నుంచి కుంకుపాడు రోడ్డు వరకు పొలాలకు వెళ్లే మార్గంలో రోడ్ల వెంట చిల్లచెట్లు ఏపుగా పెరిగాయి. రోడ్లు గుంతలు మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ మేకల చార్లెస్ సర్జన్, వైస్ ఎంపీపీ ఐ. వెంకటేశ్వరరెడ్డి ఒంగోలు ఎంపీ మాగుంటకు విన్నవించారు. ప్రజల విన్నపం మేరకు సొంత నిధులు వెచ్చించి గ్రామానికి ఎక్స్‌కవేటర్ పంపగా కిలో మీటర్ పొడవున రో డ్ల వెంట ఉన్న చెట్లు తొలగించి రోడ్లపై గుంతలను పూడ్చారు. ప్రజల విన్నపం మే రకు గ్రామాభివృద్ధికి తోడ్పాటు నందించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని, యు వ నాయకులు మాగుంట రాఘవరెడ్డిని గ్రామసర్పంచ్ చార్లెస్ సర్జన్, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



తాళ్లూరులో ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న చిల్లచెట్లు

పెదరావిపాడులో చిల్లచెట్ల తొలగింపు

ముండ్లమూరు : ఎంపీ మాగుంట సొంత నిధులతో పలు గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో పలు రహదారులు చిల్ల చెట్లతో మూసుకు పోయాయి. వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న మాగుంట ఎక్స్‌కవేటర్‌ను పంపించి రావిపాడు - నాయుడుపాలెం రహదారి చిల్ల చెట్లు తొలగింపు, నాయుడుపాలెం నుంచి ఎన్ఎస్‌పీ కాలువ, బలరామ్ నగర్ నుంచి నాయుడుపాలెం రహదారికి ఇరువైపులా చిల్ల చెట్లను తొలగింప చేశారు. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు తొలగాయి. పెదరావిపాడు ఎస్సీ కాలనీవాసులు శ్మశానానికి వెళ్లాంటే చిల్ల చెట్లు పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ కూడా చిల్లచెట్లను తొలగించారు. మాగుంటకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న కదిరి

కార్యకర్తలు సంయమనం పాటించాలి..!

త్వరలో భవిష్యత్ కార్యాచరణ : మాజీ ఎమ్మెల్యే కదిరి

కనిగిరి, ఫిబ్రవరి 23 : అభిమానులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని, త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు కదిరి బాబూరావు అన్నారు. నియోజకవర్గంలోని శీలంవారిపల్లి గ్రామంలోని ఆయన నివాసంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అభిమానులు, కార్యకర్తలు వైసీపీని వీడి మరో పార్టీ నుంచి బరిలోకి దిగాలని అభిమానుల కోరికపై కదిరి విముఖత వ్యక్తం చేశారు. టీడీపీని వీడి వైసీపీలో చేరానని, తిరిగి వేరే పార్టీలకు మారే ఆలోచనలో లేనని స్పష్టం చేశారు. తనకు అధిష్ఠానం అవకాశం ఇస్తుందన్న నమ్మకం ఉందన్నారు. కులాలతో అభ్యర్థిని ఎంపిక చేయడం బాధగా ఉందన్నారు. కనిగిరి ప్రాంతంలో తన సామాజికి వర్గం ఓట్లు తక్కువ ఉన్నప్పటికీ తనను అన్ని వర్గాల వారు ఆదరించి గెలిపించారని గుర్తు చేశారు. తాను వైసీపీలో ఉన్నా కనిగిరిలో ఎలాంటి ఇబ్బందినీ కల్పించలేదన్నారు. ప్రత్యర్థులను తూల నాడటం, విమర్శలు, ఆరోపణలు చేసే మనస్తత్వం తనది కాదన్నారు. జడ్పీటీసీ, వార్డు, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో జగన్ నిలబెట్టిన వ్యక్తులకే మద్దతు ఇచ్చి గెలిపించానన్నారు. కానీ జగన్ తనకు ఇక్కడ నుంచి పోటీకి దింపేందుకు ఎందుకు సంశయిస్తున్నారో అర్థం కావటం లేదన్నారు. మరో నాలుగు రోజుల్లో విషయం తేల్చుకుని ఎన్నికల కదన రంగానికి నూరు శాతం సిద్ధమవుతానన్నారు. సమావేశంలో లూనా జబీన్, చమిడిశెట్టి శ్రీనివాసులునాయుడు, మాజీ కౌన్సిలర్ ఫయాజ్, కదిరి అభిమానులు, వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న ఉగ్ర

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి..!

డాక్టర్ ఉగ్ర


కనిగిరి, ఫిబ్రవరి 23: మహిళలు స్వయంశక్తితో ఎదగాలని టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర అన్నారు. స్థానిక మహిళా శక్తి కార్యాలయంలో జరుగుతున్న కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ ప్రాంతంలోని మహిళలకు ఆర్థిక చేయూతను ఇచ్చేందుకు కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి కుట్టుమిషన్‌ను అందజేస్తామని, దాంతో వారు ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కాలానికి అనుగుణంగా మహిళలు రాణించాలన్నారు. కుట్టు, అల్లికల్లో సృజనాత్మకత చాలా పెరిగిందన్నారు. వాటిని కూడా నేర్చుకుని ముందుకు సాగాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆదరిస్తే కనిగిరి ప్రాంతంలో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఉగ్ర భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు కరణం అరుణ, వాజిదాబేగం, తులసి, నారాయణమ్మ, కేనీరజ ఉన్నారు.

గ్రూపు-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23 : జిల్లాలో ఈనెల 25వ తేదీన జరగనున్న గ్రూపు-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శుక్రవారం గ్రూపు-2 పరీక్షల ఏర్పాట్లపై రూట్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లతో ఆయన మాట్లాడారు.







సాగునీరు లేని పీఎస్ ఛానల్

పంటలను కాపాడండి

సాగునీరు లేక పంటలు ఎండుముఖం ● నీటి కోసం జొన్న, మొక్కజొన్న రైతుల ఆందోళన ● నాడు నీరు ఎక్కువై నష్టం.. నేడు నీరు అందక కష్టం

చుండూరు ఫిబ్రవరి 23: నీరిచ్చి పంటలను కాపాడండి.. అర్ధాంతరంగా కాల్వలకు సాగునీటి విడుదల నిలిపివేస్తే వేసుకున్న పంటలను బతికించుకోవడం ఎలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒకవైపు వర్షాలు.. అదే సమయంలో కాల్వలకు నీటి విడుదలతో పంటలను రైతులు నష్టపోయారు. ఇప్పుడు కాల్వల ద్వారా నీరు అందక వేసిన పంటలు ఎండుముఖం పట్టడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. తుంగభద్ర సైడ్ ఛానల్(టీఎస్), యడ్లపల్లి ఛానల్, పర్రా ఛానల్ కింద రెండో పంటగా రైతులు 9-10వేల ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. రైతులు వీటి సాగు ఖర్చుల కోసం ఎకరాకు రూ.20 వేల వరకు ఖర్చు చేశారు. ఆయా పంటలకు మరో రెండు మూడు తడులకు సాగునీరు అవసరం. అయితే అర్ధాంతరంగా కాల్వలకు నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. మొక్కజొన్నకు నాలుగు తడులు అవసరం ఉండగా ఇప్పటికి రెండు సార్లు మాత్రమే అందాయి. జొన్నకు రెండు మూడు తడులు అవసరం ఉండగా ఒక తడికే నీరు అందాయి. కాల్వల్లో తూటి కాడ విపరీతంగా ఉండటంతో కాల్వల ఎగువ భూములకు ఒకటి రెండు తడులు కూడా సక్రమంగా అందలేదు. దీంతో ఆ భూములు నెర్రబారాయి. చివరి భూముల్లో పంటలకు పురుగు మందులు పిచికారి చేసుకోవడానికి కూడా కాల్వల్లో కడెవడి నీళ్లు లేకపోవడంతో రైతులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో వరికి మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో చేతికి అందివచ్చిన పంట నీటి పాలైంది. ప్రభుత్వ పరంగా పైసా ఆర్థిక సహాయం కూడా అందించలేదు. రెండో పంటైనా చేతికందివచ్చి నష్టాల నుంచి కొంతైనా ఆదుకుంటుందని రైతులు ఆశిస్తుంటే ఇరిగేషన్ అధికారులు అర్ధాంతరంగా కాల్వలకు సాగునీరు నిలిపివేసి వారి ఆశలను అడియాశలు చేశారు. దీంతో పంటలను ఎలా బతికించుకోవాలో తెలియక మండలంలోని చుండూరు, మోదుకూరు, వలివేరు, చిన పరిమి, పెదగాదెలవర్రు, చినగాదెలవర్రు, కారుమూరు వారిపాలెం, ఆలపాడు రైతులు అల్లాడుతున్నారు. సాగునీటి కోసం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు, ఇరిగేషన్ అధికారులు సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

వసతి వెతలు

● సంక్షేమ హాస్టళ్లకు ఆరునెలలుగా భోజన బిల్లులు చెల్లించని ప్రభుత్వం
● ఎస్సీ, బీసీ, ఎస్టీ వసతి గృహాలకు రూ.16 కోట్లకు పైగా బకాయి
● కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించని వైనం
● భోజన పట్టిక అమలు చేయలేని స్థితిలో నిర్వాహకులు
● అర్ధాకలితో అలమటిస్తున్న విద్యార్థులు

నా ఎస్సీలు.. నా ఎస్టీలు.. నా బీసీలు అంటున్న సీఎం జగన్ ఆయా వర్గ విద్యార్థుల సంక్షేమాన్ని గాలి కొదిలేశాడు. పేరుకే నా అంటూ.. వారిని నిండా మోసం చేస్తున్నాడు. సదరు విద్యార్థుల సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టివేశాడు. విద్యార్థుల భోజన బిల్లులు నెలల తరబడి చెల్లించడంలేదు. అర్ధాకలితో విద్యార్థులు అలమటిస్తున్నారు. చివరకు తలనూనెకు ఇంటి నుంచి డబ్బు తెచ్చుకోవాల్సిందే. కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించడంలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు రూ.16 కోట్లకు పైగా బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. విద్యార్థుల కడుపు మాడ్చలేక.. అప్పులు తీర్చలేక.. వసతి గృహాల అధికారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వారు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. కనీసం సరుకుల కొనుగోలుకు అప్పులు పుట్టని దుస్థితిని ఎదుర్కొంటున్నారు.

ఆరునెలలుగా వసతి గృహాలకు భోజన బిల్లులు చెల్లించలేదు. హాస్టల్స్‌ను ఎలా నిర్వహించగలం. మా పరిస్థితి పగవాడికి కూడా రాకూడదు. ప్రభుత్వం డైట్ బిల్స్‌కు గ్రీన్‌ఛానల్ ఉందని చెబుతున్నా బిల్లులు చెల్లించడంలేదు. సహాయక సంక్షేమాధికారి వారి లాగిన్ నుంచి బిల్స్ ట్రెజరీకి అప్‌లోడ్ కాకుండా నిలిపివేశారు. మా 26 ఏళ్ల సర్వీసులో ఇంత దారుణం ఎప్పుడూ చూడలేదు.
- ఓ వసతి గృహ నిర్వాహకుని ఆవేదన

ఖర్చు నెలకు రూ.2,200.. ఇచ్చేది రూ.1,400

కళాశాలల విద్యార్థులకు నెలకు రూ.1,600, స్కూల్స్ విద్యార్థులకు నెలకు రూ.1,400 భోజనం కోసం ప్రభుత్వం చెల్లిస్తోంది. కళాశాలల విద్యార్థులకు రోజు వసతి గృహంలో ఉదయం టిఫిన్, రెండు పూటల భోజనం అందించాలి. స్కూల్స్ విద్యార్థులకు ఉదయం టిఫిన్, ఒక పూట భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించాలి. స్కూల్స్ సెలవు రోజుల్లో రెండు పూటలా భోజనం వడ్డించాలి. కళాశాలల విద్యార్థులకు రోజుకు రూ.53.33, స్కూల్ విద్యార్థులకు రోజుకు రూ.46.66కు భోజనం, ఉదయం టిఫిన్ అందించాలి. ఉదయం అల్పాహారం రోజుకో రకం వేరుశనగ చట్నీతో, బెల్లంతో రాగి జావ, చిక్కీలు, రాత్రి భోజనం, అరటి పండు, వారంలో మూడు రోజుల చికెన్, ఆరు రోజులు ఉడికించిన గుడ్డు ఇవ్వాలి. పాలు అందించాలి. ఇలా మెనూ అమలుకు ఒక్కో విద్యార్థికి నెలకు రూ.2,200 ఖర్చు అవుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. మెనూ ఛార్జీలు పెంచాలని పదే పదే వినతిపత్రాలు అందిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెనూ ప్రకారం ఇవ్వాలంటే తమ జీతాలు కూడా సరిపోవని కొందరు నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వం వసతి గృహాల్లో భోజనానికి సంబంధించి సరుకుల ధరలు మార్కెట్ కనుగుణంగా పెంచకుండా విద్యార్థుల కడుపు కాల్చుతోంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణపై నిర్లక్ష్యం అలముకుంది. వేలాదిమంది విద్యార్థుల సంక్షేమానికి పాలకులు గండికొడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సంక్షేమ హాస్టళ్లలో తొమ్మిదివేల మంది విద్యార్థులు ఉంటూ చదువుకొంటున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. ఆరునెలలుగా వసతి గృహాల బిల్లులు ప్రభుత్వం విడుదల చేయలేదు. రూ.16 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. కాస్మొటిక్ ఛార్జీలకు సదరు విద్యార్థులు నోచుకోలేదు. వసతి గృహాల నిర్వహణకు సంబంధించిన నిధుల్లో 60శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో బిల్లులు చెల్లించలేని దుస్థితి ఏర్పడింది.

* ధరలకు పొంతన లేదు..

వసతి గృహాలకు ప్రభుత్వం చెల్లించే సరుకుల ధరలకు మార్కెట్ ధరలకు పొంతనే లేదు. మార్కెట్‌లో సరుకుల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. కూరగాయల ధరలు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.సరుకులు, గ్యాస్, పాలు అప్పు పద్ధతిలో కొనుగోలు చేసి బిల్లులు విడుదలైన సమయంలో వాటిని వసతి గృహాల అధికారులు చెల్లించేవారు. ఆరు నెలలుగా మెస్ బిల్లులు విడుదల కాకపోతుండటంతో షాపుల్లో అప్పు దొరకడం లేదు. ఈ నేపథ్యంలో నిర్దేశించిన భోజన పట్టికను అమలు చేయలేక పోతున్నారు. అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

* అప్పులు పుట్టక అవస్థలు..

ఆరు నెలలుగా బిల్లులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు ఆహారం అందించడంలో హెచ్‌డబ్ల్యూవోలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వంద మంది విద్యార్థులు ఉంటే నెలకు రూ.1.20 లక్షలు ఖర్చు అవుతోందని చెబుతున్నారు. ఇలా లెక్కిస్తే వంద మంది విద్యార్థులు ఉన్న వసతి గృహానికి ఈ నెల వరకు రూ.7.20 లక్షలు చెల్లించాల్సి ఉంది. వారికి వచ్చే జీతం కూడా సరుకుల కోసం వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు. బంగారం కుదువ పెట్టి కూడా అప్పులు చేస్తున్నవారు ఉన్నారు.

* బియ్యం కొనుగోలుకు సొంతంగా చెల్లించాల్సిందే...

వసతి గృహాలకు డీలర్ల ద్వారా బియ్యం సరఫరా చేస్తారు. కిలో రూపాయి చొప్పున డీడీ రూపంలో చెల్లిస్తేనే బియ్యం వసతి గృహాలకు సరఫరా చేస్తారు. 20 కింటాళ్ల బియ్యం కొనుగోలు చేయాలంటే రూ.2వేలు డీడీ చెల్లించాలి. గతంలో ప్రభుత్వం బియ్యం కోసం డబ్బు చెల్లించేది. ఈ ప్రక్రియ కూడా నిలిచిపోయింది. హెచ్‌డబ్ల్యూవోలు వారి సొంత డబ్బు చెల్లించి బియ్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. గ్యాస్ అప్పు లభించే పరిస్థితి లేదు. గ్యాస్ కూడా నిర్వాహకులే కొనుగోలు చేస్తున్నారు. సరుకులు, పాలు, కూరగాయలు అప్పుపై సరఫరా చేసే అవకాశం ఉంది. అయితే నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో వాటికి సరఫరా కూడా కొన్ని వసతి గృహాలకు నిలిచిపోయింది.

* ఎస్సీ శాఖ ముఖ్యకార్యదర్శిని కోరినా..

బిల్లులు చెల్లించాలని పదే పదే కోరుతున్నా హెచ్‌డబ్ల్యూవోల మొర ఆలకించే వారే కరువయ్యారు. ఇటీవల ఎస్సీ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ నిర్వహించిన సమావేశంలో బిల్లుల బకాయిల అంశాన్ని హెచ్‌డబ్ల్యూవోలు ప్రస్తావించారు. బిల్లులు చెల్లించాలని కోరినా వారు నేటికీ స్పందించక పోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో బిల్లులు తక్షణమే చెల్లించకపోతే వసతి గృహాలను మూసివేయాలని సదరు అధికారుల సంఘం నిర్ణయించింది. ఈమేరకు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిని కలసి లేఖ ఇవ్వాలని యూనియన్ నిర్ణయించినట్లు వారు చెబుతున్నారు. ఇదే జరిగితే విద్యార్థులు వసతి గృహాల నుంచి ఇంటికి వెళ్లాల్సి వస్తుంది.

* కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించలేదు..

ప్రభుత్వం విద్యార్థులకు నెలవారీ కాస్మొటిక్ ఛార్జీల నగదు ఇవ్వడం లేదు. దీంతో తలనూనె కొనాలన్నా, సబ్బు కావాలన్నా ఇంటి వైపు చూడక తప్పడంలేదు. ప్రతి నెలా తమ తల్లిదండ్రులను ఖర్చులకు డబ్బులు పంపమని అడగడం పరిపాటిగా మారింది. వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రతి నెలా కాస్మొటిక్ ఛార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాలి. 7 నుంచి 10వ తరగతి వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున తలనూనె, సబ్బులు ఇతర సామాగ్రి కొనుగోలుకు ఇస్తుంది. బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ ఛార్జీల కింద అదనంగా విడుదల చేస్తుంది. విద్యార్థుల బ్యాంకు ఖాతాలకే నేరుగా కాస్మొటిక్ ఛార్జీలను జమ చేయాలి. ఆరు నెలలుగా ఛార్జీల ఊసేలేదు.

* కనీస వసతులకు నిధులు లేవు..

వసతి గృహాల నిర్వహణకు నిధులు విడుదల కావడంలేదు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు నిర్వాహకులు వాపోతున్నారు. చివరకు మాడిపోయిన బల్బును మార్చాలన్నా వారి జేబులో నుంచి ఖర్చు చేయాల్సిందే. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి, అవసరమైన మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదు. కనీస వసతులకు హెచ్‌డబ్ల్యూవోలు సొంతంగా ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందన్న విమర్శలున్నాయి.

బీసీ, ఎస్టీ వసతి గృహాలకు బిల్లుల బకాయి

ఎస్సీలే కాదు బీసీ, ఎస్టీ వసతి గృహాలకు కూడా నెలల తరబడి భోజన బిల్లులు చెల్లిండంలేదు. ఈ విద్యాసంవత్సరంలో ఆయా వసతి గృహాలకు అక్టోబరు వరకే బిల్లులు చెల్లించినట్లు సదరు అధికారులు తెలిపారు. దాదాపు నాలుగునెలలుగా బీసీ, ఎస్టీ వసతి గృహాలకు బిల్లులు నిలిచిపోయాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బిల్లులు చెల్లించక పోవడంతో నిర్వాహకులు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీసీ వసతి గృహాలకు రెండు మూడింటికి ఒకే అధికారి ఉన్నారు. దీంతో బకాయిలు పేరుకుపోవడంతో వసతి గృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తే బిల్లులు విడుదల కావన్న ఆందోళన వసతి గృహాల అధికారుల్లో నెలకొంది.

నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం



తెనాలిలో డయేరియా..

కలకలం

● గుంటూరులో చికిత్స పొందుతూ మహిళ మృతి
● మరో 20 మందికిపైగా ఆస్పత్రుల్లో చికిత్సలు
● సమాచారం ఇచ్చినా పట్టించుకోని మున్సిపాలిటీ
● నెల నుంచి కలుషిత నీరు వస్తుందంటున్న ప్రజలు
● గురవయ్యకాలనీలోని బాధితులను పరామర్శించిన నాదెండ్ల



మృతురాలు లక్ష్మి కోడలు కలుషిత నీటి పరిస్థితి వివరిస్తున్న చిత్రం

తెనాలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెనాలిలోని గురవయ్యకాలనీకి మున్సిపాలిటీ సరఫరా చేసే తాగునీరు కొద్ది రోజులుగా రంగుమారి, వాసన వస్తుంది. ఈ విషయాన్ని మున్సిపల్ సిబ్బందికి మొరపెట్టుకున్నారు. చెప్పినరోజు నీటి సరఫరా ఆపేయడం, ఆ తర్వాత పునరుద్ధరించినా మురుగు నీటి వాసన పోలేదు. ఈ పరిస్థితుల్లో అదే నీటిని కాచి చల్లార్చి తాగామని, అయినా ఫలితం లేకపోయిందని, వాంతులు, విరేచనాలతో ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చిందని కాలనీవాసులు చెబుతున్నారు. గురవయ్యకాలనీ, పూలే కాలనీ, సుల్తానాబాద్, మరికొన్ని శివారు కాలనీల్లోనూ డయేరియా కేసులు భారీగానే నమోదయ్యాయి. పది రోజుల క్రితమే సుమారు 25 మంది వరకు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందారు. అయితే డయేరియా అని నమోదు చేయకుండా మున్సిపల్ అధికారులు జాగ్రత్త పడ్డారే కానీ, ప్రజల్ని కాపడటానికి మాత్రం ఏ చర్యలూ తీసుకోలేదు.

ఒక మహిళ మృతి... ఆస్పత్రుల్లో బాధితులు

గురవయ్య కాలనీకి చెందిన బండి లక్ష్మి(60) అనే మహిళ చనిపోతే, మరో 20 మంది గుంటూరు జిల్లా వైద్యశాలలో, మరి కొందరు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని సమాచారం. మూడు రోజుల క్రితం వాంతులు, విరేచనాలతో తెనాలి జిల్లా వైద్యశాలలో లక్ష్మి చేరగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు పంపారు. అక్కడికి వెళ్లిన గంటకే ఆమె చనిపోయినట్లు లక్ష్మి కోడలు తెలిపారు. ఆమెతోపాటే మరో 15 మంది వరకు ఆస్పత్రుల్లో చేరారని బాధితులు చెబుతున్నారు. పూలే కాలనీ నుంచి ఇద్దరు, సుల్తానాబాద్‌కు చెందిన నలుగురు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని, శుక్రవారమే ఇంటికి వచ్చిన కొందరు బాధితులు తెలిపారు. మరో ఏడుగురు వరకు ప్రైవేటు వైద్యశాలల్లో చేరినట్లు తెలిపారు.

నెల నుంచే నీటి సరఫరా సరిగాలేదని, రంగు మారి వాసన వస్తుందని మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోకుండా, కనీసం నీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపకుండా వదిలేయడం విమర్శలకు తావిస్తోంది. రెండు రోజుల నుంచి భారీగా డయేరియా లక్షణాలతో కేసులు వస్తున్నాయని, తెనాలి జిల్లా వైద్యశాల సిబ్బంది, ప్రైవేటు ఆస్పత్రుల సిబ్బంది సమాచారం ఇచ్చినా మున్సిపల్ ప్రజారోగ్య విభాగం పూర్తిగా గాలికొదిలేసింది. శుక్రవారం నాదెండ్ల మనోహర్ కాలనీల్లో పర్యటనకు వెళ్లిన సమయంలో బాధితులు వివరించటంతో ఆయన దీనిపై ఘాటుగా స్పందించారు. జనం చచ్చిపోతుంటే, ప్రజాప్రతినిధి విందు రాజకీయాల్లో బిజీగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు కూడా ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారని విమర్శించారు.

● ప్రహసనంగా మారిన రైతుభరోసా కేంద్రాల్లో ఎరువుల అమ్మకాలు

అన్నీ..గొప్పలే..!

● ఖరీఫ్, రబీ రెండు సీజన్‌లలో కలిపి విక్రయించింది 14,670 టన్నులే
● సిబ్బందికి టార్గెట్లు.. వైసీపీ నేతలకు ఉదారంగా ఎరువులు

బాపట్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రైతుభరోసా కేంద్రాల్లో అన్నదాతలకు అందని సేవలు లేవంటూ ఊకదంపుడు ప్రసంగాలను ఇస్తున్నారు. ఆ మాటలే నేతిబీరకాయలోని నేతి చందంగానే మిగిలిపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్, రబీ రెండు సీజన్‌లలో కలిపి ఆర్‌బీకేల ద్వారా విక్రయించిన ఎరువులు కేవలం 14,670 టన్నులే. అంటే జిల్లాలో అన్నదాతలు వినియోగించే మొత్తం ఎరువుల్లో రైతుభరోసా కేంద్రాల వాటా 7 శాతం లోపే ఉంది. మిగిలినదంతా బహిరంగ మార్కెట్ ద్వారానే రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఈ వాస్తవం మరుగునపరచి ఆర్‌బీకేల ద్వారానే అన్నదాతలు ఎరువులు పెద్దఎత్తున కొనుగోలు చేస్తూ లాభ పడుతున్నారనేది ప్రభుత్వ వాదన. పైగా బహిరంగ మార్కెట్ కంటే ఆర్‌బీకేలలోనే ఎక్కువ ధర వసూలు చేస్తున్నారనేది రైతుల ఆరోపణ. అమ్మకాల తంతు ఇలా ఉంటే వైసీపీ నేతలు అరువుపై తీసుకెళ్లిన ఎరువుల డబ్బుల వసూలు విషయంలో సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ ఒత్తిళ్లు తట్టుకోలేక వేమూరు మండలం చావలి రైతుభరోసా కేంద్రంలో పని చేస్తున్న ఓ ఉద్యోగిని ఇటీవలే ఆత్మ హత్య చేసుకున్న విషయం తెలిసిందే. మొత్తంగా చూస్తే ఆర్‌బీకేలలో ఎరువుల అమ్మకం అనేది నామ మాత్రం తప్పించి అన్నదాతలకు ఒనగూరుతున్న ప్రయోజనం గుండుసున్నా. పైగా ఇక్కడ కూడా ఎరువులు అప్పుగా తీసుకుని వైసీపీ చోటా మోటా నాయకులే లాభపడుతున్నారని రైతులు మండిపడుతున్నారు.



వీరన్నపాలెం రైతు భరోసా కేంద్రం

ఎటువంటి అదనపు ప్రయోజనం లేదు..

రైతుభరోసా కేంద్రాల వద్ద ఎరువులు కొనడం వల్ల అన్నదాతలకు ఒనగూరుతున్న మేలేమి అదనంగా లేకపోగా పలు ఇబ్బందులే ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఎరువులకు సంబంధించి కావాల్సిన బ్రాండు విషయంలో రైతులకు అగచాట్లు తప్పడం లేదు. పైగా ఉన్నవే తీసుకెళ్లాలనే సమాధానం సిబ్బంది నుంచి రావడం కొసమెరుపు. ఒక్కోసారి బహిరంగ మార్కెట్ కన్నా ఎక్కువ ధర ఆర్‌బీకేలలో చెల్లించాల్సి వస్తుందని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. ఇక ఇండెంట్ అని కాలయాపన కూడా రైతులకు ప్రతిబంధకంగా మారింది. ఆర్డర్ పెట్టిన తర్వాత వారం రోజుల తర్వాతగాని ఎరువులు రైతులకు చేరడం లేదనే విమర్శ ఉంది. దీంతో అన్నదాతలు బహిరంగ మార్కెట్‌వైపే మొగ్గు చూపుతున్నారని రైతు సంఘాలు చెబుతున్నాయి.

వైసీపీ నేతల దెబ్బకు సిబ్బంది హడల్..

రైతుభరోసా కేంద్రాల్లో అమ్మకాలే అరకొరగా ఉన్నాయంటే ఆ కాస్తా అమ్మకాలు కూడా వైసీపీ చోటా మోటా నేతలకు వరంగా మారాయని తెలుస్తోంది. పాలకపార్టీ నేతలు అన్న ఒక్క ట్యాగ్‌లైన్‌తో తీసుకెళ్లిన ఎరువులకు సకాలంలో డబ్బులు చెల్లించకుండా వేధిస్తున్న ఘటన ఒకటి ఇటీవల వెలుగుచూసిన సంగతి తెలిసిందే. అన్నదాతల విస్తృత ప్రయోజనాల కోసం అమల్లోకి తెచ్చిన ఎరువుల విక్రయాలను కూడా వైసీపీ నేతలు సొమ్ము చేసుకోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డిమాండ్ ఉన్నప్పుడు పత్తా ఉండరు..

ఎరువులకు వ్యవసాయ సీజన్ ఆరంభంలో మంచి డిమాండ్ ఉంటుంది. మామూలు సమయాల్లో అన్నదాతల దగ్గర నుంచి ఎరువుల కోసం ఇండెంట్ తీసుకునే ఆర్‌బీకే సిబ్బంది డిమాండ్ అప్పుడు మాత్రం స్పందన కరువవుతోందని రైతులు వాపోతున్నారు. బయట మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉన్నప్పుడు విరివిగా ఎరువులను రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచి ఆదుకోవాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా బయట బ్లాక్‌మార్కెట్‌ను ప్రోత్సహించే విధంగానే పాలకుల చర్యలు ఉండడం పట్ల అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో డీలర్లతో ప్రభుత్వ పెద్దలు కుమ్మక్కయి మరీ కృత్రిమ కొరత సృష్టించి తమను నిలువునా దోచుకున్న సందర్భాలు కోకొల్లలు అని రైతులు వాపోతున్నారు.

రెండు సీజన్లలో కలిసి విక్రయించింది 14,670 టన్నులు..

ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో రైతుల దగ్గర నుంచి ఇండెంట్ తీసుకుని ఆయా ఆర్‌బీకేలలో ఉంచిన ఎరువులు 15,795 మెట్రిక్ టన్నుల ఎరువులు కాగా ఇందులో విక్రయించింది 14,670 టన్నులే కావడం గమనార్హం. వాస్తవానికి జిల్లాలో ఉన్న సాగు విస్తీర్ణాన్ని బట్టి రెండు సీజన్లలో కలిపి దాదాపు లక్షన్నర టన్నుల వరకు ఎరువుల వాడకాన్ని అన్నదాతలు చేపడ తారనేది అంచనా. రైతులు వినియోగిస్తున్న ఎరువులతో పోలిస్తే ఆర్‌బీకేల ద్వారా అమ్మకం జరిగినది నామమాత్రమే.

రూ.221.41 కోట్లతో అమృత్‌స్టేషన్ల అభివృద్ధి

గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ



గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ స్టేషన్ స్కీం(ఏబీఎస్ఎస్) కింద గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో 13 రైల్వేస్టేషన్ల రూపురేఖలను మార్చబోతున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. పలు స్టేషన్లలో పనులు ప్రారంభమయ్యాయని, ఈ నెల 26వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో లింకు ద్వారా ఆయా పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. శుక్రవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో డీఆర్ఎం మాట్లాడారు. గుంటూరు, మంగళగిరి, నంద్యాల, గిద్దలూరు, కంభం, మార్కాపురం, నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, నడికుడి, మాచర్ల, మిర్యాలగూడ, నల్గొండ రైల్వేస్టేషన్లను అమృత్‌స్టేషన్లుగా ప్రకటించడం జరిగిందన్నారు. వీటిని సిటీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తామని, నగరం/పట్టణానికి ఇరువైపులా యాక్సెస్ కలిగివుంటాయన్నారు. పలు స్టేషన్లలోకి బస్సులు కూడా వచ్చి ప్రయాణీకులు దించి వెళ్లేలా సర్క్యులేటింగ్ ఏరియాలను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైళ్ల, ప్రయాణీకుల భద్రతలో భాగంగా 10 ఎల్‌సీ గేట్లను తొలగించి వాటి స్థానంలో ఆర్‌యూబీల నిర్మాణం చేపట్టబోతున్నామన్నారు. కురిచేడు, వినుకొండ టౌన్, మునుమాక, వేములూరిపాడు, కొప్పురావూరు, కంతేరు, దాచేపల్లి, నార్కెట్‌పల్లి, బుదారం, కేసరాజుపల్లి గేట్లను తొలగించి ఆర్‌యూబీలను రూ.36.28 కోట్లతో నిర్మాణం చేపట్టబోతున్నామన్నారు. సమావేశంలో ఏడీఆర్ఎంలు ఆర్.శ్రీనివాస్, కె. సైమన్, డీసీఎం (కో-ఆర్డినేషన్) డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

మడమ తిప్పి.. మోసగించి

» మాజీ ఎమ్మెల్యే ఉగ్ర ధ్వజం

కనిగిరి, ఫిబ్రవరి 23: జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనంతా అబద్ధాలతోనే సాగిందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. అమరావతి గ్రౌండ్స్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఉగ్ర మాట్లాడారు. హామీలపై మాటిచ్చి మడమ తిప్పి ప్రజలను మోసగించారని ఉగ్ర ధ్వజమెత్తారు. చంద్రబాబు పాలనలో నాణ్యతతో టిడ్కో ఇళ్లను నిర్మిస్తే అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి వాటిని పేదలకు ఇవ్వకుండా గాలికొదిలేశారన్నారు. చంద్రబాబు పాలనలో పేదలకు 2 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు ఎన్టీఆర్ హౌసింగ్ కింద కట్టించి ఇచ్చారని గుర్తు చేశారు. జగన్‌రెడ్డి కాలనీల పేరుతో లక్షలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కేవలం సెంటు భూమిని అది కూడా ఊళ్లకు దూరంగా ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏ ఎమ్మెల్యే, మంత్రి ప్రజలకు ఒరగపెట్టిందేదీలేదన్నారు. ఐదేళ్లు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఎన్నికల వస్తుండడంతో ఒంగోలులో ఇళ్ల పట్టాల పేరుతో సెంటు భూమిని ఇచ్చి రూ.కోట్లు మింగేందుకు ఎత్తులు వేస్తున్నారని ఆరోపించారు. కనిగిరిలో నిర్మించిన టిడ్కో ఇళ్లతో పాటు రాష్ట్రంలోని టిడ్కో ఇళ్లను టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు పేదలకు ఇస్తారని ఉగ్ర హామీ ఇచ్చారు. తల్లిని గెంటేసిన జగన్ చెల్లిపై కూడా కక్ష గట్టారన్నారు. జగన్ అరాచకపాలనపై వాస్తవాలు ప్రజలకు తెలియజేస్తున్న పత్రికా కార్యాలయాలు, మీడియా ప్రతినిధులపై దాడులు చేయించడం, పత్రికా కార్యాలయాలపై దాడులు చేయించిన చరిత్రహీనుడు జగన్‌రెడ్డి అన్నారు. యువతకు ఉపాధిపై ఐఐటీ, వెలిగొండపై ఏ లాంటి ఊసే లేదన్నారు. ఇక జగన్‌కు 50 రోజులే గడువు ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీపై గెలిచేది ఖాయమని, టీడీపీ సైన్యం అత్యధిక మెజార్టీ కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వీవీఆర్ మనోహరరావు, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు యాదవ్, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, యడవల్లి శ్రీనివాసులురెడ్డి, జంషీర్, గండికోట రమేష్, ముాలె బ్రహ్మారెడ్డి, సైకం మాలకొండారెడ్డి, సిద్దాటపు వెంకటరెడ్డి, బాలు ఓబులురెడ్డి, బుల్లా బాలబాబు, గుడిపాటి ఖాదర్, అహ్మద్, యువకిషోరం ఓబులురెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో సిద్ధం చివరి సభ

పిచ్చుకలగుడిపాడు వద్ద నిర్వహణ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీ ఎన్నికల సన్నాహకంలో భాగంగా నిర్వహిస్తున్న సిద్ధం బహిరంగ సభను ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఆ పేరుతో ఇప్పటికి రాష్ట్రంలో మూడు సభలు నిర్వహించిన వైసీపీ నాల్గవ సభను జాతీయ రహదారికి దగ్గరగా కొరిశపాడు మండలం పిచ్చుకల గుడిపాడు వద్ద వచ్చేనెల 3వ తేదీన నిర్వహించబోతున్నారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాలకు సంబంధించి ఈ సభను నిర్వహించాలని భావించారు. ఆ మేరకు ఆ పార్టీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి శుక్రవారం తాడేపల్లిలో సన్నాహక సమావేశాన్ని కూడా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి నాగార్జున, పర్చూరు, అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిలు యడం బాలాజీ, హనిమిరెడ్డిలు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇటీవల రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వైవీ సుబ్బారెడ్డి సొంత నియోజకవర్గం అద్దంకి కావటం పైగా ఆయన స్వగ్రామమైన మేదరమెట్లకు దగ్గరగా పి.గుడిపాడు ఉండటంతో అక్కడ సభను నిర్వహించాలని నిర్ణయించినట్లు భావిస్తున్నారు.

ఇద్దరికే అవకాశం

ఎంపీ మాగుంట, దర్శి ఎమ్మెల్యే గైర్హాజర్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్న బహిరంగసభలో ఇద్దరికే మాట్లాడే అవకాశం కల్పించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ అధ్యక్షోపన్యాసం చేయగా, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి మాట్లాడే అవకాశం కల్పించారు. పట్టాలు పొందిన ఇరువురు లబ్ధిదారులతో మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. సభలో ముగ్గురు మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ హోదాల్లోని కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నా ఎవ్వరికీ మాట్లాడే అవకాశం కల్పించలేదు. ముందుగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు ధర్మాన ప్రసాదరావు, ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, ఎమ్మెల్యేలు కరణం బలరామకృష్ణమూర్తి, అన్నా రాంబాబు, కె.నాగార్జునరెడ్డి, సుధాకర్‌బాబు, మదనూదన్‌యాదవ్, ఎమ్మెల్సీలు పోతుల సునీత, తూమాటి మాధవరావు, చంద్రశేఖర్‌రెడ్డి, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మేయర్ గంగాడ సుజాత, పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కుప్పం ప్రసాద్, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ వైఎం.ప్రసాద్‌రెడ్డి, పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శ్రీలక్ష్మీ, సీసీఎల్ఏ ఇన్‌చార్జ్ సెక్రటరి ఇంతియాజ్ పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాలో అధికారపార్టీ పత్రిక విలేకరి..!

» 130 బాటిళ్లను పట్టుకున్న సీఐ శేషగిరిరావు, ఎస్సై వేమన
» అదుపులో నలుగురు నిందితులు
» వారిలో ఒకరు బాపట్ల విలేకరి..!
» విషయం బయటకు పొక్కడంతో అతనిని సంస్థ నుంచి తొలగించినట్లు సమాచారం




పట్టుబడ్డ మద్యం సీసాలతో సీఐ, ఎస్ఐ

చీరాల, ఫిబ్రవరి 23 : అక్రమంగా తరలిస్తున్న 130 ఫుల్ బాటిల్స్ గోవా మద్యంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల జిల్లా చీరాల రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు, ఎస్సై వేమనలు సిబ్బందితో కలసి మద్యంను పట్టుకున్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులలో ఒకరు బాపట్లలో అధికారపార్టీకి చెందిన పత్రికలో పనిచేస్తున్న విలేకరి ఉన్నట్లు సమాచారం. చాలాకాలం నుంచి వీరు ఇదే తరహాలో అక్రమ మద్యం రవాణా, విక్రయాలు సాగిస్తున్నట్లు తెలిసింది. పక్కా సమాచారం మేరకు పోలీసులు నిర్వహించిన దాడులలో వారు పట్టుబడ్డట్లు తెలిసింది. వారు తీర ప్రాంతలోని రిసార్టులకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. మద్యం కేసులో పట్టుబడ్డ విలేకరిని సదరు పత్రిక యాజమాన్యం తమ సంస్థ నుంచి తొలగించినట్లు తెలిసింది. అయితే పట్టుబడ్డ నిందితులు, కేసు పూర్వాపరాలను పోలీసులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

అబద్ధాలతో అభాసుపాలు..!

» బాలినేని పేరు సీఎం ప్రస్తావించకపోవడంపై అనుమానాలు
» జడ్పీ చైర్‌పర్సన్‌ను మార్చాలన్న ప్రతిపాదనతో కలవరం
» మాగుంట, మద్దిశెట్టి, శిద్దా తదితరులు డుమ్మా
» చెవిరెడ్డికి సిగ్నల్ - మాగుంటకు గుడ్‌బై
» నా కోసం అమ్మను పక్కనపెట్టొద్దన్న బూచేపల్లి
» జనం ఇలా వచ్చారు.. అలా వెళ్లారు

సాక్షాత్తూ సీఎం చెప్పిన పచ్చి అబద్ధాలతో ఒంగోలులో శుక్రవారం జరిగిన పట్టాల పంపిణీ కార్యక్రమం అభాసుపాలైంది. జగన్ వ్యవహార శైలి, పార్టీపరంగా తీసుకున్న కొన్ని నిర్ణయాలు యావత్తు వైసీపీ నాయకత్వంలోను శ్రేణుల్లోను కలకలాన్ని రేకెత్తించింది. ఒకవైపు సభకు వచ్చిన జనం వచ్చినట్లే వెనుదిరిగి వెళ్తుండగా మరోవైపు జగన్ తీరుతో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని అనుచరులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఇంకోవైపు జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మను మార్చేయాలన్న సీఎం జగన్ నిర్ణయంతో మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఆయన వర్గీయులు ఖంగుతిన్నారు. కేవలం ఎంపీ మాగుంటే అనుకుంటే దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, మాజీ మంత్రి శిద్దాతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి, చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి తదితరులు కూడా రాకపోవడం వైసీపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.


లబ్ధిదారుకు ఇంటి పట్టాను అందజేస్తున్న సీఎం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

భారీ ఆశలు, భయాలతో సమీకరించిన జనం ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. ముఖ్యమంత్రి మాట్లాడే సమయంలో సభలో చాలాభాగం ఖాళీ అయ్యింది. వివిధ ప్రాంతాల నుంచి బస్సుల్లో తీసుకొచ్చిన మహిళలు కూడా వాటిల్లోనే కూర్చుని వేదిక వద్దకు రాకపోవటం లాంటి ఘటనలతో శుక్రవారం ఒంగోలులో జరిగిన సీఎం సభ వైసీపీ నేతలకు నిరాశే మిగిల్చింది. సభావేదిక కింద సుమారు గంటన్నర ఉన్న సీఎం పోటీకి సిద్ధమైన అభ్యర్థుల ఈతిబాధలను పట్టించుకోకుండా పార్టీశ్రేణులతో ఫొటోలు దిగేందుకే ప్రాధాన్యమిచ్చారు. పైపెచ్చు ఈ సభలో జగన్ కూడా తడబడుతూ మాట్లాడటం, జిల్లాకు సంబంధించిన ఇతరత్రా ఏ అంశాలను ప్రస్తావించకపోవటం, అబద్ధాలతో కూడిన అంశాలను ఎక్కువగా మాట్లాడటంతో ఆయన ప్రసంగం సభికుల చెవికెక్కలేదంటే అతిశయోక్తి కాదు. పార్టీ నేతలకు మన ఒంగోలు లోక్‌సభ అభ్యర్థి చెవిరెడ్డేనని బహిరంగంగానే పరిచయం చేయటం ద్వారా జగన్ నోటి నుంచి అధికారిక సమాచారం కోసం ఎదురుచూస్తున్న ఎంపీ మాగుంటకు ఇక వైసీపీలో తనకు స్థానం లేదన్న స్పష్టమైన సంకేతం వచ్చేసింది. ఈ మొత్తం పరిణామాలతో పట్టాల పంపిణీ ద్వారా రాజకీయంగా లబ్ధిపొందాలనుకున్న వైసీపీ లక్ష్యం దెబ్బతినిపోయింది.

సర్వశక్తులు ఒడ్డినా..

ఒంగోలులో 20,800మందికి నివాసస్థల పట్టాలు పంపిణీకోసం శుక్రవారం జరిగిన సభకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో అధికారులతో కలిసి భారీ ఏర్పాట్లు చేశారు. జన సమీకరణకు సర్వశక్తులు ఒడ్డారు. సీఎం కూడా సమయానికే సభకొచ్చారు. అయితే ఆ తర్వాత చోటుచేసుకున్న వివిధరకాల పరిణామాలు వైసీపీ ఆశించిన ప్రతిష్ఠను తీసుకురాకపోగా కార్యక్రమం అభాసుపాలైంది. నిజానికి ఈ పట్టాల పంపిణీ కోసం బాలినేని ప్రత్యేక శ్రద్ధతో కృషిచేశారు. నిధులు రాబట్టుకునేందుకు రమారమి నెలరోజులు అలకపాన్పు కూడా ఎక్కారు. కానీ సీఎం తన ప్రసంగంలో బాలినేని పేరు కూడా ప్రస్తావించకపోగా తానే అంతా చేశానన్నట్లు మాట్లాడారు.

కోర్టుకెళ్లింది వైసీపీ నేత - చంద్రబాబేనంటూ జగన్ ఆరోపణ

తాజాగా ఈ పట్టాల పంపిణీపై హైకోర్టులో పిల్ వేసింది ఒంగోలులో వైసీపీ నేతగా ఉన్న సింగరాజు రాంబాబు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే బాలినేనితో కలిసి నడిచిన ఆయన తర్వాత ఆయనతో విబేధించి వైవీ సుబ్బారెడ్డి పక్కన చేరారు. బాలినేని, వైవీలకు మధ్య ఉన్న విబేధాలతో రాంబాబుకు అక్కడ ఆదరణ కూడా లభించింది. హైకోర్టులో పిల్ వేసిన అంశాన్ని బాలినేని తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ కొందరు పిల్ వేశారని అన్నారే తప్ప టీడీపీ నాయకులని ఆరోపించలేదు. కానీ జగన్ మాత్రం ఇది కూడా చంద్రబాబు పనేనని బహిరంగంగా అబద్ధం ఆడేశారు. దీంతో వేదికమీద ఉన్న నేతలే కాక సభకు వచ్చిన ఒంగోలు ప్రాంతవాసులు కూడా నివ్వెరపోయారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరిపై ఆయన చేసిన వ్యాఖ్యానాలపై కూడా సభికుల నుంచి స్పందన లభించలేదు. ఆ వ్యాఖ్యానాలు కూడా పచ్చి అబద్ధాలని ఆ తర్వాత తేలిపోయింది. అంతకుముందు తన ప్రసంగంలో బాలినేన్ని పట్టాలకోసం సీఎంపై వత్తిడి తెచ్చానని చెప్పుకోగా సీఎం మాత్రం ఇదంతా తన ప్రతిభేనని చెప్పుకున్నారు.

బాలినేని పేరు ప్రస్తావించకపోవటంపై అనుమానాలు

తన ప్రసంగంలో ఏ సందర్భంలోను బాలినేని పేరును సీఎం జగన్ ప్రస్తావించకపోవటం ఆయన అనుచరుల్లో తీవ్ర అసంతృప్తిని రగిలించింది. ఈ విషయమై బాలినేని కూడా అసంతృప్తితోనే ఉన్నారని అంటున్నారు. సీఎం బాలినేని కనీసం సిఫార్సు చేశాడని కూడా చెప్పలేదు. ఎన్నికల సమయం కావటంతో బాలినేని పేరును ప్రస్తావించి ఇన్ని పట్టాలు ఇప్పించిన అతనిని భారీ మెజారిటీతో గెలిపించాలని సీఎం కోరతారని అందరూ భావించారు. అది జరక్కపోవటంతో రాజకీయ విశ్లేషకుల్లో పలు అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. బాలినేని విషయంలో సీఎం సంతృప్తిగా లేడనే విషయం తేటతెల్లమైందని కొందరు అంటుంటే మాగుంటకు మద్దతుగా నిలిచిన బాలినేని పట్ల సీఎం అసంతృప్తిగా ఉన్నాడని మరికొందరు అంటున్నారు. బాలినేని చివర్లోనైనా వైసీపీకి గుడ్‌బై చెబుతాడేమోనన్న అనుమానం సీఎంలో ఉందని, అందుకే ఆయన గురించి ప్రస్తావించకుండా అంతా తానే చేశానని చెప్పుకున్నాడని కూడా భావిస్తున్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌గా ఇందిరను ఎన్నుకోండి

కాగా జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న వెంకాయమ్మను మార్చేసి ఆమె స్థానంలో తర్లుపాడు జడ్పీటీసీ సభ్యురాలిగా ఉన్న వెన్నా ఇందిరను ఎంపిక చేయాలని జగన్ సూచించారు. సభావేదిక కింద నాయకులతో మాట్లాడేటప్పుడు జగన్ ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ వెంటనే ఆ పని పూర్తిచేయాలని బాలినేనిని ఆదేశించారు. ప్రస్తుత చైర్‌పర్సన్ వెంకాయమ్మ కుమారుడు శివప్రసాదరెడ్డికి దర్శి టికెట్‌ను ఖరారు చేసిన విషయం తెలిసిందే. అలాగే తర్లుపాడు జడ్పీటీసీ భర్త, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి బాలినేని ద్వారా మార్కాపురం టికెట్ కోసం ప్రయత్నించగా ఆయనకు అవకాశం ఇవ్వలేదు. అయితే ఇందిరను జడ్పీ చైర్మన్‌గా ఎంపికచేయాలని జగన్ సూచించటం విశేషం. ఇది పార్టీ శ్రేణుల్లో కలకలాన్ని సృష్టించింది. ఆ తర్వాత శివప్రసాదరెడ్డి జగన్ వెనుక పరుగు తీసి ఆయనతో మాట్లాడారు. హెలిప్యాడ్ వద్ద ఆయన సీఎంతో తన తల్లికి ఛైర్మన్ పదవి ఉంచాల్సిందేనని కోరినట్లు తెలిసింది. ఒకే ఇంట్లో రెండు పదవులు అవసరమా? అని జగన్ ప్రశ్నించటంతో శివప్రసాదరెడ్డి ఇప్పటికే దర్శిలో ప్రచార కార్యక్రమం ప్రారంభించానని పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరినట్లు సమాచారం. ఈ తాజా నిర్ణయం యావత్తు వైసీపీ నాయకుల్లోను, శ్రేణుల్లోను కలకలాన్ని సృష్టించింది. అనుకున్న ప్రకారం జగన్ ముందుకెళ్తారా వెనక్కు తగ్గుతారా? అన్నది చూడాల్సి ఉంది.

మాగుంటకు అవకాశంలేదని తేల్చేసిన జగన్

ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి పోటీ చేస్తారనే విషయాన్ని సీఎం జగన్ స్పష్టం చేశారు. ఒంగోలులో సభ పూర్తయి వెళ్లేటప్పుడు గంటన్నర పాటు తనను కలిసిన నాయకులు, కార్యకర్తలతో ఫొటోలు దిగిన జగన్ మీ లోక్‌సభ అభ్యర్థి చెవిరెడ్డేనని అందరికీ పరిచయం చేశారు. గతంలోనే మాగుంటకు తిరిగి టికెట్ ఇవ్వటం లేదని చెవిరెడ్డికి పార్టీ బాధ్యతలిచ్చి ఒంగోలుకు పంపిన విషయం తెలిసిందే. మాగుంట కూడా తన కుమారుడి కోసం ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే కాదు పొమ్మన్నామని అధికారికంగా వైసీపీ ప్రకటిస్తే బయటపడాలని మాగుంట, వెళ్లిపోతే ఆ నెపం ఆయనమీదే వేయాలని వైసీపీ అధిష్ఠానం డ్రామాలు ఆడుతున్నాయి. శుక్రవారం సభతో మాగుంట విషయంలో పూర్తిస్థాయి స్పష్టత వచ్చినట్లైంది. అయితే మాగుంటే ముందుగా టీడీపీలోకి వెళ్తారా లేక జగనే ముందుగా వైసీపీ లోక్‌సభ అభ్యర్థిగా చెవిరెడ్డి పేరును ప్రకటిస్తారా అనేది చూడాల్సి ఉంది. ఈ సభకు మాగుంటతోపాటు తనకు ఎక్కడా టికెట్ ఇవ్వకపోవటంతో అసంతృప్తితో ఉన్న దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కూడా గైర్హాజరయ్యారు. ఆయన కూడా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించుకుంటున్నట్లు సమాచారం. గత ఎన్నికల అనంతరం వైసీపీలో చేరి ఉమ్మడి జిల్లాలో సీఎం ఎక్కడికొచ్చినా వెళ్లి కలిసే మాజీ మంత్రి శిద్దా కూడా ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. టీటీడీ సభ్యునిగా ఉన్న ఆయన కుమారుడు సుధీర్ వచ్చినా రాఘవరావు గైర్హాజరుకావటంపై పలు అనుమానాలను విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉండి ఈ ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వటం లేదని జగన్ తేల్చిచెప్పిన కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డి, చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచిలు కూడా మర్యాద పూర్వకంగా కూడా రాకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గ స్థాయిలో పలువురు నాయకులైతే ఈ సభకు దుమ్మాకొట్టారు.

3 రోజులు - 8 నియోజకవర్గాలు

» వచ్చేనెల తొలివారంలో ఉమ్మడి జిల్లాకు లోకేష్
» తొలి సభ ఎర్రగొండపాలెంలో
» ఏర్పాట్లను పరిశీలించిన ఇన్‌చార్జి



ఒంగోలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మరోసారి ఉమ్మడి జిల్లా పర్యటనకు రానున్నారు. యువగళం పాదయాత్ర విజయవంతం అనంతరం కొద్దిరోజులు ఆగి తిరిగి శంఖారావం పేరుతో రాష్ట్రవ్యాప్త పర్యటనలకు లోకేష్ శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఉతరాంధ్రలోని ఐదు జిల్లాల్లో ఆ కార్యక్రమాన్ని పూర్తిచేసిన లోకేష్ వచ్చేనెల తొలివారంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు రానున్నారు. మూడు రోజుల పాటు ఎనిమిది నియోజకవర్గాల్లో శంఖారావ సభలు ఉండనున్నాయి. తొలి రోజు యర్రగొండపాలెం, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లో రెండవ రోజు ఒంగోలు, కొండపి, కందుకూరులలో, మూడవ రోజు కనిగిరి, గిద్దలూరుల్లో జరిగే సభల్లో పాల్గొని మూడవరోజు సాయంత్రం కడప జిల్లా బద్వేల్ వెళ్లనున్నారు. ఆ మేరకు మూడురోజుల కార్యక్రమంపై ఇక్కడి టీడీపీ నేతలకు సమాచారం ఇచ్చారు. తొలుత ఈనెల 26 నుంచి 28 వరకు వరుసగా మూడు రోజులు కార్యక్రమం ఉంటుందని తదనుగుణంగా ఏర్పాట్లు చూసుకోవాలన్న ఆదేశాలు అందాయి. అయితే ఈనెల 28న టీడీపీ, జనసేనల ఉమ్మడి రాష్ట్రస్థాయి సభను తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేస్తుండటంతో జిల్లాలో లోకేష్ పర్యటన తేదీల్లో కొద్దిపాటి మార్పులు జరిగే అవకాశం కనిపిస్తోంది. దాని వల్ల మార్చి మొదటివారానికి లోకేష్ జిల్లా పర్యటనను మార్పు చేసినట్లు తెలిసింది. తొలిసభ వైపాలెం కావడంతో లోకేష్ పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించే బృందం సభ్యులు శుక్రవారం అక్కడికి వచ్చి ఎరిక్షన్‌బాబుతో కలిసి సభాప్రాంగణం, స్థల పరిశీలన ఇతర ఏర్పాట్లపై చర్చించారు.

ఎఫ్ఏ-4, ప్రీ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 23: పాఠశాలల్లో 1 నుంచి 9 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులకు ఫార్మెట్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ)4, పదవ తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం పరీక్షలు నిర్వహించారు. హైస్కూళ్లు, ప్రాథమిక పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 1.10 నుంచి 2.40 వరకు తెలుగు, 2.45 నుంచి 3.45 వరకు గణితం పరీక్ష నిర్వహించారు. 9వ తరగతి వారు ఉదయం 9.45 నుంచి 10.45 వరకు తెలుగు, 11 నుంచి 12 గంటల వరకు గణితం పరీక్ష జరిగింది. పదవ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 నుంచి 4.30 గంటల వరకు తెలుగు పరీక్ష జరిగింది. వీరికి ప్రశ్నపత్రాలను డీసీఈబీ ద్వారా ఎమ్మార్సీలకు పంపారు. అక్కడి నుంచి ఎంఈవోలు గంట ముందుగా హెచ్ఎంలు లేదా టీచర్ల ద్వారా ఆయా పాఠశాలలకు పంపారు.

రేపు వడ్డెర సంఘం యువగర్జన



పీసీపల్లి, ఫిబ్రవరి 23 : గుంటూరులో ఈనెల 25న రాష్ట్ర స్థాయి వడ్డెర సంఘం యువగర్జన నిర్వహిస్తున్నట్లు వడ్డెర పరిరక్షణ సమితి రాష్ట్ర సలహాదారు బండారు వెంకట్రావు తెలిపారు. మండల కేంద్రమైన పీసీపల్లిలో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎంతోకాలంగా వడియరాజులు పాలకుల నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. తమ హక్కులు, ఆత్మగౌరవం కోసం సంఘం తరుపున ఈ నెల 25న గుంటూరులో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వడియరాజులను సమావేశపరిచి తమ సమస్యల పరిష్కారం కోసం చర్చిస్తామన్నారు. గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే యువగర్జనకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వడియ రాజులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడే టీడీపీ, జనసేన తొలి జాబితా

ఎన్ని స్థానాలకు అవకాశం అనేది సందిగ్ధం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వచ్చే ఎన్నికల్లో పోటీచేయనున్న తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమి అభ్యర్థుల తొలి జాబితాలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కొందరికి అవకాశం దక్కనున్నట్లు సమాచారం. శనివారం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు కలిసి జాబితాను విడుదల చేయనున్నారు. ఆ మేరకు శనివారం ఉదయం కొందరు సీనియర్ టీడీపీ నాయకులతో ముందుగా చంద్రబాబు మాట్లాడనున్నారు. ఆ సమావేశానికి అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్‌కు కూడా ఆహ్వానం అందినట్లు తెలిసింది. కాగా ఉమ్మడి జిల్లాలో ఏడు స్థానాలకు టీడీపీ అభ్యర్థులను గతంలో ఖరారు చేసినప్పటికీ మూడు నుంచి ఐదు స్థానాలలో మాత్రమే అభ్యర్థులను తొలి జాబితాలో విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. దర్శిని జనసేనకు కేటాయించాలని నిర్ణయించినప్పటికీ తొలి జాబితాలో ఆ అభ్యర్థిని ప్రకటిస్తారో లేదా అన్నది అనుమానమే. ఉమ్మడి జిల్లాలో టీడీపీకి ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలు స్వామి, రవికుమార్, ఏలూరి సాం బశివరావులతోపాటు మరో ఇద్దరు అభ్యర్థులను తొలి జాబితాలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు.

వద్దు బాబోయ్!

» జనం చెవికెక్కని జగన్ ప్రసంగం
» మాట్లాడుతుండగా వెనుదిరిగిన మహిళలు
» బస్సులన్నీ సభకు తరలించడంతో ప్రయాణికులకు పాట్లు
» ప్రీ ఫైనల్స్ పరీక్షలకు బస్సులు లేక విద్యార్థుల అవస్థలు
» పట్టాల పంపిణీ కార్యక్రమంపై ప్రజల పెదవి విరుపు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 23 : ఒంగోలులో పేదలకు పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రజలకు విసుగు పుట్టించింది. సీఎం జగన్మోహన్‌రెడ్డి పదే పదే టీడీపీ అధినేత చంద్రబాబును విమర్శించడానికే ఒంగోలు వచ్చినట్లుందని పలువురు పెదవి విరిచారు. జగన్ ప్రసంగం జనం చెవికి ఎక్కకపోవడం స్పష్టంగా కనిపించింది. వివరాల్లోకెళితే.. ఒంగోలు నగరంలోని పేదలకు పట్టాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నగర పరిధిలోని ఎన్.అగ్రహారంలో నిర్వహించారు. కలెక్టర్ దినేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం వేలాది మంది ప్రజల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా గత వారంరోజులుగా, అధికారులు, వైసీపీ నేతలు నానా హడావుడి చేశారు. అయితే వారు అనుకున్నట్లుగా జన సమీకణలో సక్సెస్ అయినా, ప్రజల మనసు గెలుచుకోవడంలో విఫలమయ్యారు. ఈ మేరకు ఒంగోలు వచ్చిన సీఎం ఒంగోలుకు తాను పట్టాలు ఇచ్చానని, తాగునీటికి నిధులు కేటాయిస్తానని గంటసేపు ఊకదంపుడు ఉపన్యాసం దంచారు. అధిక సమయం చంద్రబాబు, ఆంధ్రజ్యోతి, ఈనాడు, టీవీ-5పై విరుచుకుపడ్డారు. అయితే ప్రజలు, ఆయన ప్రసంగాన్ని చెవికి ఎక్కించుకోలేదు. సీఎం మాట్లాడుతుండగానే ప్రాంగణం వదిలి బస్సుల్లోకి చేరారు. కొందరైతే నడుచుకుంటూనే రోడ్డుపైకి చేరారు.

సీఎం, బాలినేని, ప్రసంగిస్తుండగానే వెనుదిరిగిన జనం

జన సమీకరణకు ప్రైవేటు, ఆర్టీసీ బస్సులు వెయ్యికిపైగా కేటాయించారు. సీఎం సభకు రాకుంటే పథకాలు తొలగిస్తామని బెదిరించారు. దీంతో తప్పదని భావించిన జనం ఒక పూటే కదా పోయి వద్దామని భావించి రాగా, నేతల ప్రసంగం పెద్దగా రుచించలేదు. ఉదయం 11 గంటలకు సీఎం రాగా, అప్పటికే జనం ఇంటిబాట పట్టారు. సభ ముగిసేందుకు చాలాసమయం పడుతుందని కాలిబాటన బయలుదేరారు. అయితే ఉన్నవారిలో అధిక శాతం మంది తొలుత కలెక్టర్ పరిచయ ప్రసంగంలో కొద్దిసేపు ఉన్నప్పటికీ ఆ తర్వాత బాలినేని, జగన్ ప్రసంగానికి పోలోమని వెళ్లిపోయారు. దీంతో సీఎంతో పాటు నేతల ముఖాల్లో అసంతృప్తి స్పష్టంగా కనిపించింది.

ప్రయాణికులకు తప్పని పాట్లు

సీఎం సభకు 506 ఆర్టీసీ బస్సులు కేటాయించడంతో రోజువారీ ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. సభకు ఒక రోజు ముందే బస్సులన్నీ ఆయా ప్రాంతాలకు తరలించడంతో గురువారం నుంచే ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. తెలియక వచ్చిన వారు గంటలకొద్దీ బస్టాండ్లలో పడిగాపులు కాశారు. అంతేకాకుండా గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి కూడా బస్సులు కేటాయించడంతో ఆయా డిపోలలోనూ ఇదే పరిస్థితి.

ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు తప్పని కష్టాలు

జిల్లావ్యాప్తంగా ప్రైవేటు పాఠశాల బస్సులన్నీ సీఎం సభకు కేటాయించడంతో విద్యార్థులకు అవస్థలు తప్పలేదు. ఒకవైపు శుక్రవారం నుంచి పదవ తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్స్ ఎగ్జామ్స్ ప్రారంభం కాగా, ఆరు నుంచి 9వ తరగతి వారికి ఎఫ్ఏ-4 పరీక్షలు మొదలయ్యాయి. దీంతో విద్యార్థులు పరీక్షకు వెళ్లేందుకు నానా అగచాట్లు పడ్డారు.


బస్సులన్నీ సీఎం సభకు తరలించడంతో బస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

తాగునీరు తప్ప తిండి లేదు..

సీఎం సభ విజయవంతం కోసం వైసీపీ నేతలు పరుగులు పెట్టారు. ఉదయం 8గంటల నుంచే డివిజన్లవ ఉంచి మహిళలను తరలించే కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. వారికి టిఫిన్ అందించి బస్సులెక్కించిన నేతలు ఆ తర్వాత సభ ముగిసే వరకు వారి బాగోగులు పట్టించుకోలేదు. కేవలం తాగునీరు బాటిల్స్ అందించి చేయి దులుపుకొన్నారు. అరకొరకగా ఆహారం అందించగా, చాలీచాలక ప్రజలు ఆకలితో అల్లాడిపోయారు. సుమారు 40వేల మందికి వరకు జనసమీకరణ చేసినప్పటికీ అందుకు అనుగుణంగా మరుగుదొడ్లు నిర్మించలేదు. కేవలం ఓ ఇరవై మరుగుదొడ్లు నిర్మించి వదిలేయడంతో మహిళలు తీవ్ర అవస్థలు పడ్డారు.

చీరలు ఇస్తారని ఆశపడి.. నిరాశగా ఇంటికి..

సీఎం సభలో ఇళ్లపట్టాలు పంపిణీ సమయంలో ప్రతి మహిళకు చీర, పురుషులకు ఫ్యాంట్, షర్ట్ ఇస్తామని ఆ పార్టీ నాయకులు ముందుగానే డివిజన్‌ల నేతలు తెలపడంతో ప్రజలు ఆశతో అధికసంఖ్యలో హాజరయ్యారు. అయితే అక్కడ చీరల పంపిణీ లేకపోవడం, కొత్తగా ఇళ్లపట్టాలు ఇవ్వకపోవడంతో నిరాశగా ఎదురుచూశారు. ఒకవైపు మండుటెండలో ఉక్కపోతల మధ్య అల్లాడిన జనం సభ నగంలోనే ఇళ్లబాట పట్టారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

అద్దంకి, ఫిబ్రవరి 23: మండలంలోని ధర్మవరం సమీపంలో ఉన్న భీమలింగేశ్వ రాలయం వద్ద తవ్వకాలు జరిగాయి. గతంలో కూడా పలుమార్లు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగాయి. గురువారం రాత్రి తవ్వకాలు చేసి పెద్దపెద్ద బండరాళ్లను బయట పడవేసి తవ్వకాల ఆనవాళ్ళు కనిపించకుండా నాపరాళ్ళను కప్పి సిమెంట్ పూత కూడా పూయటం అనుమానాలు కలిగిస్తుంది. అతి పురాతన ఆలయం కావటం, రాజుల కాలంలో ధర్మవరం కేంద్రంగా కొంతకాలం పాలన సాగించి ఉండటంతో గుప్త నిధులు ఉండి ఉంటాయన్న అనుమానాలతో తరచూ తవ్వకాలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి తవ్వకాలు చేసి సుమారు 30 బండరాళ్ళను పక్కనే పడవేశారు. అయితే, అంత ఖాళీలో ఏమి ఉపయోగించి పూడ్చారు అన్న విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం ఉదయం దేవాలయం వద్దకు వెళ్ళిన పాలక మండలి కమిటీ ఛైర్మన్ పచ్చవ విజయభాస్కర్ తవ్వకాలు జరిగిన విషయాన్ని గుర్తించి దేవదాయ అధికారులకు సమాచారం అందించారు. శనివారం దేవదాయ శాఖ అధికారులు పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది.

ఆగని ఆక్రమణల పర్వం

» 2.70 ఎకరాల ప్రభుత్వ భూమికి రెక్కలు



కట్టకిందపాలెం సమీపంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు

అద్దంకి, ఫిబ్రవరి 23: అధికారులు ఎన్నికల విధులలో బిజీగా ఉండటంతో ఆక్రమణదారులు మరింత రెచ్చిపోయి ఆక్రమణల పర్వం కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పలు సార్లు అధికారులు స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినా మరలా యథావిధిగా ఇళ్ళ నిర్మాణాలు సాగిస్తున్నారు. ఉత్తర అద్దంకి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 19లో సుమారు 2.70 ఎకరాల భూమిని పూర్వంలో సాగుకు తాత్కాలికంగా ఇచ్చారు. అయితే, రెవెన్యూ అధికారుల విచారణలో పంటల సాగుకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారన్న విషయం తేలటంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అయితే, అవకాశం వచ్చినప్పుడల్లా ఇళ్ళ నిర్మానానికి సిద్ధం కావటం రెవెన్యూ అధికారులు అడ్డుకోవటం జరుగుతుంది. కొంతభాగాన్ని మున్సిపల్ అవసరాలకు కేటాయించగా, మరికొంత భూమి మిగిలి ఉంది. అధికారులు ఎన్నికల హడావుడిలో ఉండటంతో గత రెండు, మూడురోజులుగా ఇళ్ల నిర్మాణాలు మరింత ఊపందుకున్నాయి. రెండు రోజుల వ్యవధిలోనే గోడలు పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తిచేశారు. రెవెన్యూ అధికారులు వెళ్లినప్పుడు తాత్కాలికంగా పనులు ఆపటం, మరలా యథావిధిగా నిర్మాణ పనులు చేస్తున్నట్లు తెలుస్తుంది.

శింగరకొండ రోడ్డులో ఆటో నగర్‌ను ఆనుకొని ఉండటంతో మంచి విలువ ఉంది. ప్రభుత్వ అవసరాలకు కూడా వినియోగించుకునే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ళ నిర్మాణాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈవిషయాన్ని తహసీల్దార్ మహబూబ్ సుభాని దృష్టికి తీసుకుపోగా ఇప్పటికే తమ దృష్టికి రావటంతో పనులు నిలిపివేయించినట్టు చెప్పారు. మరోసారి సిబ్బందిని పంపించి చర్యలు చేపడతామని తెలిపారు.

వైసీపీ పతనం ఖాయం

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

» 40 ముస్లిం కుటుంబాలు టీడీపీలో చేరిక



బల్లికురవ: ఎమ్మెల్యే రవికుమార్‌కు సంఘీభావం తెలుపుతున్న వల్లాపల్లి ముస్లిం నేతలు

బల్లికురవ, ఫిబ్రవరి 23: వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని వల్లాపల్లి గ్రామానికి చెందిన 40 మంది ముస్లిం కుటుంబాల వారు గ్రామ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్‌తో కలిసి చిలకలూరిపేటలో ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ముస్లింలకు పలురకాల పథకాలను అందించామన్నారు. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం వారికి మొండిచెయ్యి చూపుతుందని ధ్వజమెత్తారు. రంజాన్ పండుగ వస్తే టీడీపీ రంజాన్ తోఫా అందిందని గుర్తుచేశారు. మసీదుల మరమ్మతులకు నగదు అందించినట్టు చెప్పారు. ముస్లింల వివాహానికి నగదు ప్రోత్సాహాన్ని కూడా అందించామన్నారు. అప్పట్లో ముస్లిం కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని, ఇప్పుడు వారి గురించి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. తిరిగి టీడీపీ అధికారంలోకి రాగానే మరలా వారికి సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంపై రోజురోజుకు వస్తున్న వ్యతిరేకతను గమనించి ప్రజలను తప్పుదోవ పట్టించాలని సిద్ధం అంటూ సభలు పెడుతున్నారని విమర్శించారు. ప్రజలు కూడా ఈ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని హామీలను అమలు చేశామని అబద్ధాలు చెబుతున్నారని ఆయన విమర్శించారు. మద్య పాన నిషేధం, ఉద్యోగులకు సీపీఎస్ అమలు, రైతులకు పోలవరం, అమరావతి రాజదాని నిర్మాణం చేయటం చేతకాని వైసీపీ ప్రభుత్వం అప్పులు తెచ్చి కొంతమందికి అరకొరగా పంపిణీ చేసి మిగిలిన దానిని తమ జేబుల్లో వేసుకుంటున్నారని ఎమ్మెల్యే రవికుమార్ ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రం మరలా పూర్వ వైభవం సాధించాలంటే ఎంతో అనుభవశాలి, సంపద సృష్టించిన మేధావి అయిన చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రిగా రావాల్సిన అవసరం ఉందన్నారు. టీ డీపీలో చేరిన వారిలో వైస్‌ప్రెసిడెంట్ షేక్ బడా ఖాశీం, మస్తాన్‌వలి, నాగూర్ మీరా, ఖాజావలి, దాదావలి, ఈసూవలి, ఖాశిం, అల్లాఉద్దీన్, హజరత్, సలీం, సైదా, దరియావలి, మాబుసుబాని తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నేతలు పరుసు ప్రేమప్రసాద్ బాబు, చింతల అమరనాథ్, ముట్లూరి మహేష్, తదితరులు పాల్గొన్నారు.



సంతమాగులూరు: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యం

సంతమాగులూరు, ఫిబ్రవరి 23: సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, మన బిడ్డల భవిష్యత్తు కోసం తెలుగుదేశం పార్టీకి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్దగల అతిథి గృహంలో మండలంలోని గురిజేపల్లి, చవిటిపాలెం, తంగేడుమల్లి, మిన్నెకల్లు, బండివారిపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగున్నరేళ్ళుగా రాష్ట్రంలో అరాచక పాలనను ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు. గడిచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో ఏఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తిచేయలేదన్నారు. సజ్జాపురం ఎస్టీ కాలనీకి చెందిన 20 కుటుంబాలు, యాదవకాలనీకి చెందిన పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో అట్లా చిన వెంకటరెడ్డి, ఆలూరి శ్రీనివాసరావు, సన్నెబోయిన ఏడుకొండలు, అట్లా పెద వెంకటరెడ్డి, తేలప్రోలు రమేష్, కంచేటి మురళి, దూపాటి ఏసోబు పాల్గొన్నారు.

మండలంలోని కామేపల్లికి చెందిన వైసీపీ నాయకులు గంటా రంగారావు, గుంపునేని రామారావు, గుండపునేని నరసింహారావు, గాడిపర్తి సాంబయ్య, శివన్నారాయణ, గుండపునేని శ్రీనివాసరావు తదితరులు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను కలసి మద్దతు తెలిపారు.



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య

ప్రతి ఓటు కీలకం

చీరాల, ఫిబ్రవరి 23: రానున్న ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. 18 సంవత్సరాల నుంచి 80 సంవత్సరాల వరకు ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు చంద్రబాబు సీఎం అయితే ఒనగూరే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి, యువత భవితకు చంద్రబాబు మరలా సీఎం కావల్సిన చారిత్రాత్మక ఆవశ్యకతను వివరించాలన్నారు.

కార్యక్రమంలో నాయకులు నాతాని ఉమామహేశ్వ రరావు, నాశిక వీరభద్రయ్య, షేక్ సుభాని, ధేని కనకరాజు, గజవల్లి శ్రీనివాసరావు, డేటా నాగేశ్వరరావు, గంజి పురుషోత్తమ్, ఉసురుపాటి సురేష్, కొమ్మనబోయిన రజిని, కౌతవరపు జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుల నిరసన

పర్చూరు, ఫిబ్రవరి 23: పాఠశాలలోకి అనుమతించలేదని ఉపాధ్యాయులు గేటు వద్ద బైటాయించి నిరసన వ్యక్తం చేసిన సంఘటన మండలంలోని చెరుకూరు ఎయిడెట్ పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. పాఠశాలలో మ్యాథ్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సీహెచ్ వెంకటేశ్వర్లు, తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పద్మావతమ్మలు తమను ఉద్యోగం నుండి వాలంటరీ రిటైర్డ్‌మెంట్ ఇవ్వమని వేధిస్తున్నారని వాపోయారు. కరస్పాండెంట్ వేధింపులకు పాల్పడుతూ పాఠశాలలోకి అనుమతించకుండా నిరాకరించారని పేర్కొన్నారు.

ఈవిషయంపై డిప్యూటీ ఈవోతోపాటు, మండల విద్యాశాఖ అధికారులకు తమ సమస్యను వివరించినట్టు చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

ఘనంగా అంతర్జాతీయ రోటరీ ఆవిర్భావ దినోత్సవం

పర్చూరు, ఫిబ్రవరి 23: అంతర్జాతీయ రోటరీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు స్థానిక భవనం వీరారెడ్డి రోటరీ భవనంలో శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. వివిధ వృత్తుల వారిని ఆహ్వానించి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు, క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, పాబోలు ఉదయభాస్కర్, కోమటి ఆంజనేయులు, గడ్డిపాటి శ్రీనివాసరావు, కటా శ్రీనివాసరావు, కారుమూడి సుబ్బారావు, భవనం రాజగోపాలరెడ్డి, మున్నంగి వెంకటసుబ్బయ్య, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, పాబోలు వెంకన్న, పోలిశెట్టి చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

రైతుల నిరసన ర్యాలీ

ఇంకొల్లు, ఫిబ్రవరి 23: హర్యానాలో రైతులపై జరిగిన దాడులకు నిరసనగా ఇంకొల్లులో రైతు సంఘం ఆధ్వర్యంలో కాగడాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. రామమందిరం నుండి సినిమాహాల్ కూడలి వరకు రైతులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు, చిలుకూరి శ్రీనివాసరావు, బట్టు శ్రీను, మాదాల అంజియ్య, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువత భవిష్యత్తు

» ఎమ్మెల్యే ఏలూరి



ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన మార్టూరు యువకులు

మార్టూరు, ఫిబ్రవరి 23: రాబోయే కాలంలో రాష్ట్ర యువత భవిష్యత్తు తెలుగుదేశం పార్టీతోనే ముడిపడి ఉందని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం ద్వారానే యువత భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. మండలంలోని ఇసుకదర్శిలో గల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మార్టూరులోని పోలేరమ్మ గుడి బజారులోని యువకులు టీడీపీలో చేరారు. వారందరికి పార్టీ కండువాను మెడలో వేసి ఏలూరి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మార్టూరు వీరాంజనేయులు, మార్టూరు సతీష్, తాతా అఖిల్, ఉప్పుటూరి పవన్, మణితేజ, ఎస్కే చాందా, నాగూర్, మౌలాలి, గుంటుపల్లి శ్రీను, మార్టూరు శ్రీను, మార్టూరు వెంకటేష్, సాయి పవన్, రాకేష్, తదితరులు ఉన్నారు. అలాగే, విజయ్‌నగర్ కాలనీకి చెందిన కొమర వీరబ్రహ్మం, కొమర శివ, తన్నీరు శ్రీను తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో కామినేని జనార్దన్, బండి చంద్రరావు, బూదయ్య, తొగటి వెంకట సుబ్బయ్య, తుమ్మల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం కావాలి

మార్టూరు, ఫిబ్రవరి 23: రాజధాని లేని రాష్ట్రం చేసిన జగన్ ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం కావాలని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి మండలంలోని ఇసుకదర్శిలోగల క్యాంపు కార్యాలయంలో బొబ్బేపల్లి, జొన్నతాళి, రాజుగారిపాలెం, చిమ్మిరిబండ, ద్రోణాదుల, ఇసుకదర్శి గ్రామాల ముఖ్య నేతలు, మండల కమిటీ సభ్యులు బూత్ కన్వీనర్లు, పేజీ నేస్తం సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయిలో పార్టీని పటిష్ఠ పరచడానికి సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో ఐదేళ్ల నుంచి జరుగుతున్న విధ్వంస, అరాచక పాలనను అంతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారన్నారు. ప్రజల ఆలోచనలను, ఆకాంక్షలను నెరవేర్చడానికి కార్యకర్తలు కంకణబద్ధులై ముందుకు నడవాలన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ఇవే చివరి ఎన్నికలుగా ప్రజాతీర్పు ఉండే విధంగా కార్యకర్తలు పనిచేయాలని ఏలూరి పేర్కొన్నారు.

దర్జీల సమస్యలను పరిష్కరిస్తాం

చినగంజాం, ఫిబ్రవరి 23: చినగంజాం మండల పరిధిలోని దర్జీల సమస్యలను పరిష్కరిస్తానని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మార్టూరు మండలం ఇసుకదర్శిలో గల క్యాంపు కార్యాలయంలో మండల దర్జీల అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీ ఆధ్వర్యంలో దర్జీలు శుక్రవారం ఏలూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. దర్జీల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల అనంతరం ఏర్పడే టీడీపీ, జనసేన ప్రభుత్వంలో దర్జీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో మండల దర్జీల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుల్తాన్ బాషా, కోశాధికారి పఠాన్ సుభాని, సభ్యులు షేక్ కరిముల్లా, సుభాని, బసవారెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, లక్ష్మీదుర్గ, కోటేశ్వరమ్మ, రామకృష్ణ, షేక్ అమీర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు చేపడితే కఠినచర్యలు



గ్రావెల్ తవ్వకాలు చేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న వేటపాలెం ఫారెస్టు సెక్షన్ అఫీసర్ జాన్సన్, తదితరులు

బల్లికురవ, ఫిబ్రవరి 23: అనుమతులు లేకుండా ఎవరైన అటవీ భూములలో అక్రమంగా గ్రావెల్ మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని వేటపాలెం ఫారెస్టు సెక్షన్ అఫీసర్ జాన్సన్ హెచ్చరించారు. వైసీపీ నేతల బరితెగింపు శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించారు. కొప్పెరపాలెం, ఉప్పుమాగులూరు ప్రాంతాలలో గ్రావెల్ తవ్వకాలు చేసిన ప్రదేశాలను పరిశీలించారు. పెద్ద ఎత్తున గ్రావెల్ తవ్వినట్లు ధ్రువీకరించారు. ఈ భూములు రెవెన్యూ పరిధిలో ఉందన్న విషయాన్ని వారికి సమాచారం పంపిస్తామని తెలిపారు. ఈసందర్భంగా సెక్షన్ అఫీసర్ జాన్సన్ మాట్లాడుతూ అటవీ భూములలోకి అనుమతులు లేకుండా ఎవరికి ప్రవేశం లేదన్నారు. యంత్రాలు పెట్టి రాత్రుళ్లు గ్రావెల్ మట్టి తవ్వితే వెంటనే యంత్రాలను సీజ్ చేస్తామని చెప్పారు.

కొన్ని గ్రామాలలో అటవీ భూములు, రెవెన్యూ భూములు కలిసి ఉండటంతో రైతు లకు అర్థంకాక అటవీ భూములలో తవ్వకాలు చేస్తున్నట్లు అపోహ పడుతున్నారని చెప్పారు. ఈ విషయాన్ని అందరూ గమనించాలన్నారు. ఈ పరిశీలనలో కూకట్లపల్లి బీట్ అఫీసర్ రమేష్, అసిస్టెంట్ బీట్ అఫీసర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడులకు రైతుల పాట్లు

» నీరులేక ఎండపోతున్న పైర్లు



చెరుకూరు సమీపంలో నీరులేక ఎండిపోతున్న వైట్‌బర్లీ పొగాకు

పర్చూరు, ఫిబ్రవరి 23: ఆరుతడులు అందక కళ్ళముందే ఎండిపోతున్న పైర్లను చూచి రైతులు దిగాలు చెందుతున్నారు. ఎండిపోతున్న పంటలను రక్షించుకునేందుకు నీటికోసం నానా అగచాట్లు పడుతున్నారు. కనుమేర చూపులో నీరు అందుబాటులో లేకపోవటంతో ఏమిచేయాలో అర్థంకాని స్థితిలో రైతులు ఉన్నారు. నిన్నా మొన్నటి వరకు అరకొరగా కాలువలు, కుంటల్లో ఉన్న కొద్దిపాటి నీరుకూడా ఎండతీవ్రతకు ఆవిరి కావటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో వేల ఎకరాల్లో సాగుచేసుకున్న వైట్‌బర్లీ, మిర్చి పైర్ల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఎక్కడ చూచినా పైర్లు వడలిపోయి, ఎండుముఖం పట్టాయి. ఇప్పటికే వేలకు వేలు పెట్టుబడులు పెట్టి సాగుచేసుకున్న పంటలు ఇలా ఎండిపోతుండటంతో అన్నదాతల్లో నైరాశ్యం నెలకొంది. మరోపక్క మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందాన మిర్చి పైర్లను తెగుళ్ళు వెంటాడటంతో సమస్య మరింత దయనీయంగా మారింది.

వైట్‌బర్లీకి నాణ్యమైన ధర ఉన్నా దిగుబడి అరకొరగానే ఉంది. ఆరుతడులు లేక పైర్లు ఎండిపోతున్నాయి. పైర్లను రక్షించుకునేందుకు వేలకు వెచ్చించి ఆరుతడులు అందిద్దామన్నా నీరు అందుబాటులో లేదు.

'సముచిత సీట్లు కేటాయించాలి'

అద్దంకి, ఫిబ్రవరి 23: ఎన్నికలలో మాలలకు సుముచిత సీట్లు కేటాయించాలని మాల మహాసభ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్ లో జరిగిన అద్దంకి నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రాజకీయపార్టీలు మాలల భవిష్యత్‌ను దెబ్బతీసే విధంగా సమీకరణలు రూపొందిస్తున్నాయన్నారు. మాలలను నిర్లక్ష్యం చేసే రాజకీయ పార్టీలకు రానున్న ఎన్నికలలో తగిన విధంగా బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో అంకం కిరణ్‌కుమార్, నాగేశ్వరరావు, నాగయ్య, వికాస్, తదితరులు పాల్గొన్నారు.

నల్లవాగులో మృతదేహం గుర్తింపు

అద్దంకి, ఫిబ్రవరి 23: అద్దంకి పట్టణంలోని నల్లవాగులో బయటపడ్డ మృతదేహం పట్టణంలోని గొర్లమిట్టకు చెందిన పాపనబోయిన శ్రీనివాసరావు(45)గా గుర్తించారు. శ్రీనివాసరావు గత శుక్రవారం ఇంటి నుంచి వెళ్ళిపోయి కనిపించలేదు.

నల్లవాగులో మృతదేహం ఉన్నట్లు తెలియటంతో కుటుంబసభ్యులు వెళ్ళి చూడగా శ్రీనివాసరావుదిగా గుర్తించారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. చేపల వేటకు వెళ్ళిన వ్యక్తులు వల వేయటంతో మృతదేహం నీటిపైకి వచ్చింది.

గంగపాలెంలో వ్యవసాయ మెటార్లు చోరీ

బల్లికురవ, ఫిబ్రవరి 23: మండలంలోని గంగపాలెంలో గురువారం అర్ధరాత్రి పంట పొలాల్లో ఉన్న ఐదు వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయి. గ్రామానికి సమీపంలో నల్లవాగు వద్ద ఉన్న పంట పొలాల్లో రాయుడు శివరామయ్య, ఆంజనేయులు, పోపూరి సుబ్బారావు, రమేష్, బి.డేవిడ్ అనే రైతులు పంట పొలాలకు నీరు పెట్టుకునేందుకు మెటార్లు పెట్టారు. గుర్తుతెలియని దొంగలు అర్ధరాత్రి సమయంలో ఐదుగురు రైతులకు చెందిన మోటార్లను తస్కరించారు. శుక్రవారం పంటలకు నీరు పెట్టుకునేందుకు వెళ్లిన రైతులు మోటార్లు లేకపోవటంతో బల్లికురవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీ అయిన మోటార్ల విలువ రూ.లక్ష పైచిలుకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

మినీవ్యాన్‌ను ఢీకొన్న కారు.. ఒకరికి గాయాలు

పంగులూరు, ఫిబ్రవరి 23: మిర్చి లోడుతో గుంటూరు వైపు వెళుతున్న మినీ వ్యాన్‌ను వెనుకనుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని జాగర్లమూడివారిపాలెం గ్రామం వద్ద 16వ నెంబరు జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై గురువారం తెల్లవారు జామున జరిగిన ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తులు సీటు బెల్ట్ ధరించి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. వీరిలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. మినీ వ్యాన్‌ను అతి వేగంగా వెనుకనుంచి కారు ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న గస్తీ పోలీసులు నైట్‌డ్యూటీలో ఉన్న ఎస్ఐ చంద్రశేఖర్‌కు సమాచారం అందివ్వడంతో క్రేన్ సాయంతో రోడ్డుకు అడ్డంగా నిలిచిన కారును తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. గాయాలపాలయిన వ్యక్తిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రేణంగివరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చేనెల 6న పోలురాధా ఎడ్ల పోటీలు

చినగంజాం, ఫిబ్రవరి 23: మండలంలోని సోపిరాల గ్రామంలోని లలితాపరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని మార్చి 6న ఒంగోలు జాతి జూనియర్ ఎడ్ల విభాగంలో రాష్ట్ర స్థాయి నాటుబండి పోలురాధా ఎడ్ల పందాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సోపిరాల గ్రామ టైరుబండ్ల అసోసియేషన్, గ్రామస్థుల సహకారంతో రాష్ట్రస్థాయి నాటుబండి పోలురాధ ఎడ్ల పందాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9133377719, 8919494992 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 23: పర్చూరులో ఈనెల 25న జరగనున్న ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. ఈసందర్భంగా శుక్రవారం మండలంలోని పూనూరు గ్రామంలో ముస్లిం మైనారిటీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ రసూల్, మార్టూరు గ్రామ ఉపాధ్యక్షుడు సెల్ సుభాని, మాజీ సర్పంచ్ బోయపాటి సాంబయ్య, గ్రామానికి చెందిన మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు ఆపకపోతే ఎన్నికలను బహిష్కరిస్తాం

మార్టూరు, ఫిబ్రవరి 23: తమ గ్రామానికి చెందిన గ్రావెల్ కొండపై గత పదేళ్లుగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు, పట్టించుకోవడం లేదని మండలంలోని బొబ్బేపల్లి గ్రామస్థులు పేర్కొన్నారు. అక్రమ తవ్వకాలు ఆపకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని శుక్రవారం మార్టూరులో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. పదేళ్లలో రూ.వంద కోట్ల విలువైన గ్రావెల్‌ను అక్రమార్కులు తరలించుకుపోయారని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మహిళా సర్పంచ్ భర్త తాళ్లూరి కోటేశ్వరరావుతో పాటు పలువురు గ్రామస్థులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

మేదరమెట్ల, ఫిబ్రవరి 23: జాతీయ రహదారిలో మేదరమెట్ల - తిమ్మనపాలెం మధ్య శుక్రవారం మోటార్ సైకిళ్ళు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరు దుర్మరణం చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. విజయవాడకు చెందిన కోరంపల్లి ఆంజనేయులు, గుంటూరుకు చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు ఒంగోలు వైపు నుంచి గుంటూరుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఈక్రమంలో మేదరమెట్లకు చెందిన ఏ.క్రాంతికుమార్ స్కూటీపై వెళ్తూ ఎదురుగా వస్తున్న మోటర్‌సైకిల్‌ను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో కోరంపల్లి ఆంజనేయులు(43) అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున ఏడుకొండలు, ఎదురుగా వస్తున్న క్రాంతికుమార్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలుకు తరలించారు. మేదరమెట్ల ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రైతు మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 23: గిట్టుబాటు ధర ఇవ్వాలంటూ పోరాటం చేస్తున్న రైతు ప్రాణాలు పోవడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ కార్మిక రైతు సంఘాల పిలుపు మేరకు చీరాల ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో బ్లాక్ డే నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ కేసులు ఎత్తివేయాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శామ్యేల్, అచ్యుతుని బాబురావు, మేడా వెంకటరావు, ప్రకాష్‌బాబు, వెంకటేశ్వర్లు, జయరామిరెడ్డి, మోహన్‌కుమార్ ధర్మ, రావూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా పోటీలకు విద్యార్థినుల ఎంపిక

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 23: రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ స్థాయిలో ఎస్.భానుప్రియ, జూనియర్ స్థాయిలో బుర్ల లోకేశ్వరి పోటీలో పాల్గొననున్నారు. ఒంగోలులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 24, 25 తేదీలలో నెల్లూరు జిల్లా ముత్తుకూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. ఈసందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని హనోరా, వ్యాయామ ఉపాధ్యాయిని రోజ్‌హెల్కా, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, పద్మజ, వరలక్ష్మి, తదితరులు విద్యార్థినులను అభినందించారు.

నిందితుల అరెస్టు

చీరాలటౌన్, ఫిబ్రవరి 23: 15 గాడిదలు, ఒక గుర్రాన్ని అపహరించి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను చీరాల వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. కారంచేడు వైపు నుంచి స్వాపర్టుపురంకు చెందిన నలుగురు వ్యక్తులు టాటాఏస్ వాహనంలో వీటిని చీరాలకు తరలిస్తుండగా పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. వాహనాన్ని, జీవాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనిపై పోలీసులు వివరాలు వెల్లడించాల్సి ఉంది.

భజన సంప్రదాయానికి ఆద్యుడు అన్నమాచార్యులు

అద్దంకి, ఫిబ్రవరి 23: దక్షిణ పథంలో భజన సంప్రదాయానికి ఆద్యుడు తాళ్ళపాక అన్నమాచార్యులు అని రిటైర్డ్ ఆర్‌జేడీ దేవపాలన పేర్కొన్నారు. పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు 521వ వర్ధంతి సందర్భంగా అద్దంకి పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాస భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు, దామా హనుమంతరావు, చెన్నుపాటి రామాంజనేయులు, అన్నమనేని వెంకటరావు, షేక్ మస్తాన్, మాబు సుభాని, చెన్నుపల్లి పవన్‌వెంకటసాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు న్యాయవాది నారిమన్ మృతికి సంతాపం

పర్చూరు, ఫిబ్రవరి 23: సుప్రీం కోర్టు ప్రముఖ న్యాయవాది నారిమన్ మృతికి పర్చూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు భవనాల సముదాయంలో న్యాయవాదులు సంతాపం తెలియజేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో న్యాయవాదులు రావి సత్యనారాయణ, మేకల రవీంద్రనాథ్‌రెడ్డి, రావి శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి గోవిందరాజులు, రావి రమేష్‌బాబు, చాగంటి సుబ్బారావు, పోతిని సురేంద్ర తదితరులు ఉన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

అద్దంకి, ఫిబ్రవరి 23: అద్దంకి పట్టణంలోని వింధ్యావాసిని సమేత నగరేశ్వర స్వామి (వేయిస్తంభాల గుడి) దేవాలయంలో షష్టమ కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం రుద్రహోమం నిర్వహించారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.





ఉమ్మడి జిల్లా కలెక్టర్‌గా జనరంజక పాలన అందించి సింహపురి ప్రజల హృద యాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి జన్నత్‌హుస్సేన్. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉద్యోగ విరమణ పొందిన ఆయన నాలుగేళ్లుగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ శుక్రవారం తెల్లవారుజామున తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని తన స్వగృహంలో కన్ను మూశారు. ఆయనకు జిల్లా ప్రజలు అశ్రునివాళులు అర్పించారు.

జనరంజక పాలకుడు

జన్నత్ హుస్సేన్

పూర్వ కలెక్టర్ అస్తమయం

నాటి సేవలను స్మరించుకున్న ఉమ్మడి జిల్లా ప్రజలు

నెల్లూరు (సాంస్కృతికం) : 1977 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన జన్నత్ ఉమ్మడి చిత్తూరు జిల్లాకు వివిధ సందర్భాల్లో ప్రత్యేకాధికారిగా పనిచేశారు. ఆ తర్వాత 1985-87 మధ్య నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. కలెక్టర్ హోదాను పక్కనపెట్టి తన వద్దకు ఎవరు వచ్చినా లేచి నిలబడి అర్జీలు తీసుకునేవారు. ఎప్పటి సమస్యను అప్పుడే పరిష్కరించేవారు. ఎందరో నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చారు. అధికారులను కూడా ఓ మిత్రుడిగా ప్రోత్సహించేవారు. రెవెన్యూ శాఖ ఆయనను ఇప్పటికీ దేవుడిగా భావిస్తున్నట్లు ఆ శాఖ విశ్రాంత అధికారులు చెబుతున్నారు. నెల్లూరు నగరంలో ఎంతో మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందజేశారు. జన్నత్ హుస్సేన్ నగర్, కిసాన్‌నగర్ ఆయన హయాంలోనే ఏర్పాటు చేశారు. పేదలకు గృహ నిర్మాణాలలో నెల్లూరు జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన ఆయనకు ప్రభుత్వం అవార్డు, నగదు పురస్కారం అందజేసింది. ఆ నగదును హౌసింగ్ శాఖ సిబ్బందికే పంచిపెట్టారు. నగరంలోని కొత్తూరులో నిరుద్యోగులకు ఇచ్చిన కోళ్లఫారంలో కోళ్లు గంబోరో వ్యాధితో చనిపోయి తీవ్రంగా నష్టపోయారు. కలెక్టర్ హోదాలో జన్నత్ స్వయంగా కోళ్లఫారాలను సందర్శించి నిర్వాహకులకు ధైర్యం చెప్పారు. పేద విద్యార్థులు చదువుకునే సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించడమేకాక విద్యార్థులకు దుస్తులు పంచేవారు. ఆయన బదిలీ అయిన తర్వాత జిల్లా చరిత్రలో ఏ కలెక్టర్ చేయని విధంగా ఉమ్మడి జిల్లాలోని 46 మండలాలకు వెళ్లి అక్కడి అధికారులు, సిబ్బందిని పలకరించి వీడ్కోలు తీసుకున్నారు. ఆనాటి సంఘటనలను పలువురు విశ్రాంత అధికారులు స్మరించుకుంటున్నారు.

● ఎమ్మెల్యే కోటంరెడ్డి నివాళి

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే టీడీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జన్నత్ హుస్సేన్ మరణంపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985లో వీఆర్ కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా 13రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసిన ప్పుడు అప్పటి కలెక్టర్ హోదాలో జన్నత్ హుస్సేన్ దీక్షా శిబిరం వద్దకు వచ్చారని గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించి, తనకు ఆయన స్వహస్తాలతో నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారని తెలిపారు. ఆయన మరణానికి తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కన్నీటి నివాళులు అర్పించారు.



నిరాహారదీక్ష శిబిరం వద్ద కోటంరెడ్డికి నిమ్మరసం ఇస్తున్న అప్పటి కలెక్టర్ జన్నత్


● నిజాయితీకి నిలువుటద్దం : సోమిరెడ్డి

నిజాయితీకి నిలువుటద్దం జన్నత్ హుస్సేన్ అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తన మేనమామ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఆయన నెల్లూరు కలెక్టర్‌గా పని చేశారని, తమ పొరుగూరు గుడిపల్లిపాడులో ముస్లిం కాలనీకి ఆయన పేరు పెట్టారని అన్నారు. ఆయన ప్రజలకు అందించిన సేవలు, ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు.

'వందనం'తో వల!

- ఎన్నికల వేళ వలంటీర్లకు తాయిలాలు
- మూడు నెలలకు ముందే ప్రోత్సాహకాలు
- నగదు మొత్తం పెంచి ఆకట్టుకునే ప్రయత్నం
- ఎన్నికల్లో తమకు అనుకూలంగా వ్యవహరించేలా వైసీపీ కుట్రలు

నెల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ తీరుతో అన్ని వర్గాల్లో తీవ్ర అసహనం కనిపిస్తోంది. ఉద్యోగ వర్గాల్లో అయితే పీకల్లోతు కోపం వ్యక్తమవుతోంది. వారికి రావాల్సిన బకాయిలను కూడా ప్రభుత్వం సకాలంలో చెల్లించకుండా చెడుగుడు ఆడుతోంది. అదే సమయంలో వలంటీర్లతోనూ గొడ్డు కష్టం చేయించుకుంటూ గౌరవ వేతనం అంటూ వారి జీవితాలతో ఆటలాడుకుంటోంది. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వ్యవస్థ అయినా ప్రభుత్వ తీరుతో విసిగిపోయిన వలంటీర్లు ఇటీవల ప్రభుత్వంపై తిరగబడటం ప్రారంభించారు. గౌరవ వేతనం పెంచాలంటూ ఉద్యమం చేశారు. అయితే నాడు వారి డిమాండ్లను పట్టించుకోని ప్రభుత్వం, ఇప్పుడు ప్రోత్సాహక తాయిలాలతో వలంటీర్లపై వల వేస్తోంది. ఎన్నికలకు ముందు వారిని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు అనేక కుట్రలు పన్నుతోంది. మే నెలలో ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను మూడు నెలల ముందుగానే అందజేస్తోంది. దారుణంగా ఉన్న రోడ్లను పట్టించుకోరు, పెండింగ్ బిల్లులతో ఆగిపోయిన సచివాలయ భవనాలు, ఆసుపత్రుల నిర్మాణాల గురించి ఆలోచించరు, ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను చెల్లించరు.. ఆఖరుకు పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బకాయి లను కూడా జమ చేయరు.. కానీ షెడ్యూల్ కన్నా మూడు నెలల ముందే ఎన్నికల ముంగిట వలంటీర్లకు మాత్రం 'వందనం' పేరుతో భారీ నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు. ఈ తంతు చూస్తున్న అటు ఉద్యోగులు, సామాన్యులు వైసీపీ అంతరంగాన్ని పసిగట్టి చర్చించుకుంటున్నారు.



● పెరిగిన ప్రోత్సాహక నగదు

ఎన్నికల నేపథ్యంలో ప్రోత్సాహకాలు అందుకునే వలంటీర్ల సంఖ్య, ప్రోత్సాహక నగదు మొత్తం పెరిగింది. జిల్లాలోని 769 సచివాలయాల పరిధిలో 13,295 మంది వలంటీర్లు ఉండగా దాదాపుగా వారందరికీ ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమం కింద గతేడాది మే నెలలో జిల్లాలో మొత్తం 11,359 మందికి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అందులో సేవామిత్ర అవార్డులు 11,080 మంది, సేవారత్నలు 231, సేవావజ్ర అవార్డులు 44 ఉన్నాయి. నాడు సేవామిత్రకు రూ.10 వేలు, సేవారత్నకు రూ.20 వేలు, సేవావజ్ర అవార్డుకు రూ.30 వేల చొప్పున అందజేశారు. ఈ సంవత్సరం జిల్లాలో 12,783 మందికి ప్రోత్సాహకాలు అందజేస్తుండగా అందులో సేవామిత్రలు 12,517 మందికి, సేవారత్నలు 225 మందికి సేవావజ్రలు 41 మందికి ఇస్తున్నారు. ప్రస్తుతం సేవామిత్రకు రూ.15 వేలు, సేవారత్నకు రూ.30 వేలు, సేవావజ్రకు రూ.45 వేలు చొప్పున అందజేస్తున్నారు. మొత్తంగా జిల్లాలో గతేడాది సుమారు రూ.11.67 కోట్లను వలంటీర్లకు ప్రోత్సాహకాల రూపంలో అందజేయగా ఈ ఏడాది ఆ మొత్తం సుమారు రూ.20 కోట్లకు పెరిగింది.

● వలంటీర్లకు బ్రెయిన్ వాష్

వలంటీర్లకు పెద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు. మండలాలు, డివిజన్లు, నియోజకవర్గాల వారీగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అయితే ఈ కార్యక్రమాల వేదికగా వలంటీర్ల బ్రెయిన్ వాష్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులే కాకుండా అనేక మంది వేదికలపై ప్రసంగిస్తున్నారు. అదే సమయంలో కొంత మంది ప్రత్యేక వక్తలను తీసుకొచ్చి వారి ద్వారా 'వైసీపీ ఎంత గొప్పదో.. మీరు వైసీపీకి రుణపడి ఉన్నారు' అనే సందేశం ఇచ్చేలా ఉపన్యాసాలు ఇప్పిస్తున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వలంటీర్లు పని చేసేలా భారీ కుట్రలు జరుగుతున్నాయంటూ మరోవైపు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

అందరిదీ మైనారిటీలపై మమకారమే!

● మత పెద్దలతో సమావేశం, విందు ● కానుకలతో ఆకట్టుకునే ప్రయత్నం



కావలి (టౌన్), ఫిబ్రవరి 23 : కావలి పట్టణంలోని మైనారిటీలను ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీల నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మత పెద్దలు, ఇతర ప్రముఖులతో సమావేశాలు నిర్వహించి, పసందైన రుచులతో విందు ఇవ్వడంతోపాటు కానుకలు కూడా అందజేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం, రాత్రి ముసునూరులోని ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి తన నివాసంలో క్రైస్తవ ప్రముఖులు, మత పెద్దలు, పాస్టర్లతో సమావేశమయ్యారు. విందు ఏర్పాటు చేసి కానుకలు అందించడంతోపాటు ప్రార్థన మందిరాల అభివృద్ధికి వరాలు ప్రకటించారు. ఆ తర్వాత రాత్రి ముస్లిం మత పెద్దలు, మసీద్ కమిటీల పెద్దలు, ప్రముఖులతోనూ సమావేశమై విందు ఇచ్చారు. షాదీ మంజిల్ అభివృద్ధి పనులకు రూ.5ల క్షలు, ముసునూరు ఆటోనగర్‌లోని సాద్ మసీదు నిర్మాణానికి రూ.1 లక్ష విరాళంగా నగదు అందించారు. ఇక టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి కూడా మైనార్టీ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నా రు. ఈ ప్రక్రియలో భాగంగా పట్టణ పరిధిలోని మసీదుల నిర్వాహకులను, ముస్లిం మతపెద్దలతోపాటు వైసీపీ మైనార్టీ నేతలనూ కలుస్తూ మద్దతు కూడగడుతున్నారు. శుక్రవారం జామియా మసీదులో జరిగిన ప్రార్థనలో కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం మత పెద్దలతో సమావేశమై మసీదు అభివృద్ధికి రూ.5 లక్షలు, ఆటోనగర్ మసీదుకు రూ.50వేలు విరాళం అందించారు. ఇక స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న పసుపులేటి సుధాకర్ కూడా మసీదులు, చర్చిలకు విరాళాలు అందిస్తున్నారు.



ఏపీజీబీ ఎదుట నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమ్మె

నెల్లూరు (హరనాథపురం) : తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు నెల్లూరు రీజియన్‌కు చెందిన ఉద్యోగులు శుక్రవారం సమ్మె చేశారు. నెల్లూరు నగరంలోని ఆ బ్యాంకు ఎదుట జరిగిన ఆందోళనలో ఉద్యోగులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గ్రామీణ బ్యాంకులలో ఖాళీగా ఉన్న 30 వేల పోస్టులను భర్తీ చేయాలని, వాణిజ్య బ్యాంకులతో సమానంగా వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ బ్యాంకులన్నిటినీ కలిపి ఒకే జాతీయ బ్యాంకుగా చేయాలని, ఉద్యోగులకు అలవెన్సులన్నీ వర్తింపజేయాలన్నారు. అనంతరం ఏపీజీబీ ఆర్ఎం టి.మోహన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ నిరసనలో రీజినల్ కార్యదర్శి లియాకత్ అలీ, మునిరత్నం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సోమశిలలో 18.726 టీఎంసీల నిల్వ

అనంతసాగరం: సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి జలాశయంలో 18.726 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కావలిలో గంజాయి గబ్బు!

హైదరాబాద్ నుంచి డ్రగ్స్ దిగుమతి

8 మంది అరెస్ట్, పరారీలో మరో ముగ్గురు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, డ్రగ్స్, సిరంజీలు

కావలి, ఫిబ్రవరి 23 : కావలిలో యువతే టార్గెట్‌గా కొంతమంది గంజాయి, డ్రగ్స్‌ను విక్రయిస్తున్నారు. బయట ప్రాంతాల నుంచి పట్టణంలోకి దిగుమతి చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తూ యువతను మత్తుకు బానిసలు చేస్తున్నారు. ఈ విషయం సాక్షాత్తు పోలీసుల దాడుల్లోనే వెలుగు చూసింది. మొత్తం 8 మందిని అరెస్ట్ చేయగా, ముగ్గురు పరారీలో ఉన్నట్లు కావలి డీఎస్పీ ఎం. వెంకటరమణ తెలిపారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో వన్‌టౌన్ సీఐ రాజేష్‌తో కలిసి కేసు పూర్వాపరాలను విలేకరులకు వెల్లడించారు. పట్టణ పరిధిలోని పాపిరెడ్డి చెరువు వద్ద గురువారం కొందరు యువకులు టైడల్ (మత్తు) మాత్రలను నీళ్లలో కలిపి సూది మందు ద్వారా ఎక్కించుకుంటున్నారు. ఈ మేరకు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించగా 8 మందిని అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వారి నుంచి 900 గ్రాముల 9 గంజాయి ప్యాకెట్లు, టైడల్ మాత్రలు 10 షీట్లు, వంద సిరంజీలు, వంద మినరల్ వాటర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సునాని రుగ్దార్, కంబా ఉదయ్, దేవరకొండ నిఖిల్, షేక్ షాహీద్, వల్లెపు అభినయ్, పండిపట్ల దేవదానం, పల్లెబోయిన ఈశ్వర్ సాయి, దుంపాల జాన్ వసంత్‌లను అరెస్ట్ చేసిన వారిలో ఉన్నారు. ఒడిశాకు చెందిన మొదటి ముద్దాయి సునాని రుగ్దార్ కొన్నేళ్లుగా కావలిలోని ఇందిరానగర్‌లో ఉంటూ ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న ముగ్గురు హైదరాబాదు నుంచి టైడల్ మాత్రలు తెచ్చి కావలిలో అధిక ధరలకు విక్రయిస్తూ యువతను డ్రగ్స్‌కు అలవాటు చేస్తున్నట్లు చెప్పారు.

పాలలో మోసాలకు చెక్!

- అమలులోకి పాల సేకరణ చట్టం
- మిల్క్ ఎనలైజర్స్‌కు లైసెన్సులు తప్పనిసరి
- మోసాలు, కల్తీలు గుర్తిస్తే కఠిన చర్యలు

నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 23 : పాలసేకరణ, విక్రయాల్లో మోసాలను అరికట్టేందుకు పాల సేకరణ, నాణ్యమైన పాల వినియోగ చట్టం-2023ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం అమలుకు అవసరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) రూపకల్పన, నిబంధనలతో అధికారిక గజిట్‌లో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు తెలిపారు. పాల సేకరణతోపాటు ధరల చెల్లింపుల్లో తేడాలు, కల్తీలు గుర్తిస్తే ఆయా యూనిట్లను సీజ్ చేయడంతోపాటు చట్ట ప్రకారం జరిమానా, జైలుశిక్షలు విధించనున్నట్లు పేర్కొన్నారు.

● రోజుకు 15లక్షల లీటర్ల పాల ఉత్పత్తి

జిల్లాలో ప్రతిరోజు దాదాపు 15-16 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. స్థానికంగా 2లక్షల లీటర్ల వినియోగం, ప్రభుత్వ సహకార డెయిరీల ద్వారా 3లక్షల లీటర్లు, ప్రైవేటు డెయిరీల ద్వారా దాదాపు 10లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన చట్టం అమలు, పర్యవేక్షణ రాష్ట్రస్థాయిలో కార్యనిర్వాహక అధికారిగా పశుసంవర్ధక శాఖ సంచాలకులు వ్యవహరిస్తారు. జిల్లాస్థాయిలో ఆథరైజ్డ్ ఆఫీసర్‌గా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు, మిల్క్ ఇన్‌స్పెక్టర్లుగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్, ఏడీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్లు వ్యవహరించనున్నారు. చట్టం ప్రకారం మిల్క్ ఎనలైజర్స్‌తోపాటు పాల సేకరణ కేంద్రాలు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు (బీఎంసీ), ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్లు (ఏఎంసీ) పనిచేసేలా పర్యవేక్షి స్తారు. పాల నాణ్యత పాటించకపోతే ఫుడ్ సేఫ్టీ నాణ్యతా ప్రమాణాల యాక్టు 2006 ప్రకారం చర్యలు తీసుకుంటారు. పాలల్లో కొవ్వు, ఎస్ఎన్ ఎఫ్ శాతాన్ని బట్టి నిర్ధేశించిన ధరల పట్టిక ప్రకారం పాడిరైతులకు మద్దతు ధర దక్కేలా పర్యవేక్షిస్తారు. ఇందుకోసం సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ అభివృద్ధి చేస్తున్నారు. చట్టం అమలుపై రాష్ట్రస్థాయి లో ఎంపిక చేసిన రీసోర్స్ పర్సన్స్‌కు ఇటీవలే శిక్షణ కూడా పూర్తయింది. వీరి ద్వారా మండల స్థాయిలో మిల్క్ ఇన్‌స్పెక్టర్లుగా వ్యవహరించే అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు.

● లైసెన్సులు తప్పనిసరి

మిల్క్ ఎనలైజర్లు తప్పనిసరిగా లైసెన్సులు పొందాలి. తొలుత రూ. వెయ్యి చెల్లించి సంబంధిత ఆథరైజ్డ్ అధికారి నుంచి లైసెన్సు పొందాలి. అదేవిధంగా మిల్క్ డీలర్లు ప్రతి రెండేళ్లకోసారి రూ.2లక్షలు చెల్లించి మిల్క్ కమిషనర్ ద్వారా లైసెన్సు పొందాలి. ఆ తరువాత 120 రోజులలోపు వారి పరిధిలోని మిల్క్ ఇన్‌స్పెక్టర్ వద్ద రూ.500 చెల్లించి కనీసం ఏడాదిపాటు చెల్లుబాటు అయ్యేలా వెరిఫికేషన్ సర్టిఫికెట్ పొందాలి. మిల్క్ ఎనలైజర్స్ లైసెన్సు, వెరిఫికేషన్ సర్టిఫికేట్‌ను పాల సేకరణ కేంద్రాల్లో ప్రదర్శించాలి. అదేవిధంగా సంబంధిత రికార్డులను విధిగా నిర్వహించాలి.

● క్రమం తప్పకుండా తనిఖీలు

పాల సేకరణ కేంద్రాలు, డెయిరీలలో మిల్క్ ఇన్‌స్పెక్టర్ క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తారు. మోసాలు, కల్తీలు గుర్తిస్తే జరిమానా, లైసెన్స్ రద్దుతోపాటు కేసు నమోదు వంటి చర్యలు తీసుకుంటారు. కల్తీ జరిగినట్లు గుర్తిస్తే తగిన చర్యల కోసం ఆహార భద్రత అధికారికి సమాచారం అందిస్తారు. మిల్క్ యూనియన్ డెయిరీ నిర్ధారించిన ధర పట్టిక ప్రకారం పాల ధరలు చెల్లిస్తున్నది లేనిది కూడా పరిశీలిస్తారు. జిల్లాస్థాయిలో ఆథరైజ్డ్ అధికారిగా వ్యవ హరించే అధికారులు ఈ మిల్క్ ఇన్‌స్పెక్టర్ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు.



మామిడీలా!

- పది చెట్లకుగానూ నాలుగింటికే పూత
- ఆపై త్రిప్స్ వైరస్ దండయాత్ర
- పిందెపాటు అనుమానమే అంటున్న రైతులు
- కోలుకోవడం కష్టమేనంటున్న కౌలుదారులు
- ఈ ఏడాది కూడా గగనంగా మారనున్న సాగు

ఉలవపాడు, ఫిబ్రవరి 23 : ప్రతిఏటా డిసెంబరు ద్వితీయార్థం నుంచి ఫిబ్రవరి వరకు మామిడిచెట్లు పూతలు పూస్తూ పిందెపాటు దశలో ఉండేవి. అలాంటిది ఈ ఏడాది ఇంకా కొన్నిచెట్లు పూతలు పూయలేదు. ఒకవేళ పూసినా త్రిప్స్ వైరస్ దాడితో రాలిపోతున్నది. ఈ క్రమంలో ఈసారి కూడా మామిడిసాగు నష్టాలు మిగుల్చుతుందని కౌలుదారులు ఆవేదన చెందుతున్నారు. కందుకూరు డివిజన్‌లోని ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో సుమారు 7వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా, ఎక్కువభాగం కౌలుకు తీసుకొని సాగు చేస్తుంటారు. ఈ ఏడాది పూతలు బాగా ఆలస్యం కావడంతో పిందెపాటు పడని తోటలు దర్శనమిస్తున్నాయి. ఈపాటికి గోలీ సైజు పిందెలు వచ్చేవి. కాగా గత డిసెంబరులో వచ్చిన తుఫాన్ ప్రభావంతో భూమిలో తేమశాతం పెరిగి పూతలు వేయాల్సిన చెట్లు లేటలు (చిగుళ్లు) వేసి పూతలకు విఘాతం కలిగించాయి. దీంతో ఫిబ్రవరిలో పూతలు రావడం మొదలయ్యాయి. ఇప్పుడు వచ్చే పూతలు పిందెపాటు పడి నిలుస్తాయా.. లేదా? అనేది రైతుల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. ఇప్పడి ప్పుడే ఎండలు పెరుగుతున్న కొద్దీ పూతల్లో తేమ తక్కువై కాడలకు బలం చేకూరడం కష్టం. దీంతో పూతలు రాలిపోతాయి. ఒకవేళ పిందె పాటు పడినా ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల పిందెలు కూడా తేమ శాతం తగ్గిపోవడంతో వాడిపోయి రాలిపోతాయని రైతులు అంటున్నారు.

● త్రిప్స్ వైరస్ దాడి

అసలే పూత సరిగా రాకపోగా పుండుపై కారం చల్లినట్లుగా వచ్చిన అరాకొర పూతపై త్రిప్స్ వైరస్ దాడి చేసి నాశనం చేస్తున్నాయి. నాలుగేళ్లుగా త్రిప్స్ వైరస్‌తో మామిడి రైతులు యుద్ధమే చేస్తున్నారని చెప్పొచ్చు. ఈ ఏడాది కూడా పూతలో తేమను పీల్చిపిప్పి చేస్తూ రాలిపోయేలా వైరస్ వ్యాప్తి చెందింది. దీన్ని పూర్తిగా నియంత్రించేందుకు ఇప్పటికీ ఎలాంటి పురుగు మందులు లేవు. ఉపశమనం కోసం ఎక్కువసార్లు మందులు పిచికారీ చేస్తూ దాని తీవ్రతను రైతులు తగ్గించుకుంటున్నారు. పురుగు మందుల ద్వారా పిందెలను ముంతమామిడి గింజంత సైజు వరకు కాపాడుకోగలిగితే త్రిప్స్ వైరస్ బారి నుంచి బయట పడినట్లేనని రైతులు చెప్తున్నారు. దీనికితోడు రాత్రుళ్లు మంచు ఎక్కువగా పడుతుండటంతో తేనెబంక తెగులు సోకి పూతలు నల్లబారి పోతున్నాయి.

● దిగుబడిపై ప్రభావం

ఈ ఏడాది కూడా మామిడి రైతులకు అన్ని ప్రతికూల పరిస్థితులే ఎదురవుతున్నాయి. దీంతో మామిడిలో దిగుబడి బాగా తగ్గిపోనున్నదని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క లేటు కాపు, మరోపక్క త్రిప్స్, తేనెబంక తెగుళ్ల తీవ్రం కావడం, ముదురుతున్న ఎండలతో కాపు తక్కువేనని వారు పేర్కొన్నారు.



పూత మీద ఉన్న చెట్టు పక్కనే లేటలు వేసి పూతకు నోచుకోని మామిడిచె ట్లు

ఎస్కేప్ నుంచి కమ్మవారిపాలెం వాగుకు విడుదల

అధికారుల తీరుపై అన్నదాతల ఆగ్రహం

సీబీఆర్ ఆయకట్టులో ఎండుతున్న పంటలు

జలదంకిలో కొత్త చెరువు కింద ఎండుతున్న వరి



సోమశిల జలాల

అక్రమ తరలింపు!

జలదంకి, ఫిబ్రవరి 23 : కావలి కాలువ ద్వారా జరుగుతున్న సోమశిల జలాల పంపిణీ మొదటి బంతిలో కూర్చున్న వారికి పరమాన్నం.. చివరి బంతిలోని వారికి పచ్చడి మెతుకులు.. అన్న సామెతలా ఉంది. నిబంధనలకు విరుద్ధంగా సోమశిల అధికారులు కావలి కాలువ ఎస్కేప్ చానల్ నుంచి కమ్మవారిపాలెం వాగుకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో (సీబీఆర్) నీరు లేక దాని ఆయకట్టు పరిధిలో పొట్ట దశలో ఉన్న సుమారు 5 వేల ఎకరాల్లో వరి పైరు ఎండుముఖం పట్టింది. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చివరి ఆయకట్టు భూములైన జలదంకి మండలంలోని అన్నవరం, జలదంకి, గోపన్నపాలెం, ఎల్.ఆర్ అగ్రహారం పంచాయతీలలో వివిధ చెరువులు, కాలువల కింద సాగైన వరిపంట అంతా చిరుపొట్ట, వెన్నుదశల్లో ఉంది. ఈ క్రమంలో సీఎంవో నుంచి కావలి కాలువకు మరో 1.5 టీఎంసీల నీరు అదనంగా ఇవ్వాలని సోమశిల అధికారులకు ఆదేశాలందాయి. ఈ మేరకు నీటి విడుదలను పెంచారు. అయితే పెంచిన నీటిని ఎస్వీపాలెం మేజరు నుంచి కిందకు విడుదల చేయకుండా కొంతభాగం పై ప్రాంతం ఆయకట్టుకు, ఎస్కేప్ ఛానల్ ద్వారా విడుదల చేస్తూ చివరి ఆయకట్టుకు అందకుండా చేస్తున్నారు. దీని వల్ల నీటిని పెంచిన ఉద్దేశం నీరుగారింది. సీబీఆర్ నీటిమట్టం పడిపోయి కావలి కాలువ దిగువకు నీరు విడుదల కావడం లేదు. ఈ పెంచిన నీటిని యుద్ధప్రాతిపదికన కాలువ మీద ఉన్న మోటార్లు సైతం నిలిపి 400 క్యూసెక్కుల మేరకు చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు వారం రోజుల పాటు నిరంతరాయంగా విడుదల చేస్తే తప్ప రిజర్వాయరు నిండి దిగువకు నీరు విడుదల కాదు. ఈ నీరు విడుదలైతే తప్ప జలదంకి, అన్నవరం, గోపన్నపాలెం, ఎల్.ఆర్ అగ్రహారం పంచాయతీల్లో సాగులో ఉన్న 5వేల ఎకరాల వరి పంటకు నీరు చేరదు. ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకో వాలని రైతులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ హరినారాయణన్ పర్యవేక్షణలో కావలి కాలువకు నీటి పం పిణీ చేపట్టాలని చివరి ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఎవరికి ఇష్టం వచ్చి నట్లు వారు నీటిని కాలువలు, చెరువులకు పెట్టుకుంటూ పోతే జలదంకి మండలం ఎడారిగా మారుతుందని రైతులు వాపోతున్నారు.



కావలికాలువ ఎస్కేప్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా కమ్మవారిపాలెం వాగుకు విడుదల చేసిన నీరు

కలగానే పేదల పక్కా గృహాలు

● ఇల్లు లేక బస్టాండ్‌లోనే జీవనం

మర్రిపాడు, ఫిబ్రవరి 23: గూడు లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు పక్కా గృహాల కల్పన పథకం ఆమడ దూరంలోనే ఆగిపోయింది. ప్రభుత్వాలు చెబుతున్న మాటలు ఉత్తి మాటలుగానే మిగిలిపోయాయి. నాలుగున్న ఏళ్లకాలంలో మండలంలో 936ఇళ్లు మంజూరవగా అందులో 646ఇళ్లు బేసిమెంట్‌కే పరిమితం అయ్యాయి. కేవలం 48ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. మొత్తంలో 15మాత్రమే సొంత స్థలాలల్లో నిర్మించుకున్నారు. మిగిలినవన్నీ జగనన్న లేఅవుట్ లోనే నిర్మించేలా మంజూరు చేశారు. మౌలిక సౌకర్యాలు లేనందునే లబ్ధిదారులు ముందుకు రావటంలేదు. మండలంలో స్వంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించకపోవటంతో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నందవరం గ్రామానికి చెందిన అన్నం నరసమ్మ(65) అనే ఒంటరి మహిళ రామానాయుడుపల్లి బస్ షెల్టరు ముందు వైపు పరదా పట్టలు చుట్టుకొని, అందులో తల దాచుకుంటూ ఏడాదిగా జీవనం సాగిస్తోంది. తనను ఆదుకునే వారు కరువయ్యారంటూ ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఆమె భర్త మరణించటంతో ఒంటరిగా బ్రతుకుతుండగా ఏడాది క్రితం కురిసిన తుఫాన్‌తో సొంత ఇంటి గోడలు కూలిపోయాయి. దీంతో దగ్గర్లో ఉన్న రామనాయుడుపల్లి బస్ షెల్టరు దిక్కయ్యింది. ఆదరణలేక, ప్రభుత్వ పరిహారం అందక ఒంటరిగా బ్రతుకు బండిని నెట్టుకొస్తుంది. సొంత స్థలం వున్నప్పటికీ ఇళ్లు మంజూరు చేయాలని రెండు సార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా ఎవ్వరూ పట్టించుకోలేదంటూ ఆమె వాపోతున్నారు.


గోడలు కూలిపోయిన సొంత ఇల్లు, (ఇన్‌సెట్లో) బస్ షెల్టరులో ఉంటున్న నరసమ్మ

విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దారు నెప్రూబాబు

ఉదయగిరి, ఫిబ్రవరి 23: ఎన్నికల విధుల్లో బూత్ లెవల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు నెప్రూబాబు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో 36 బూత్‌ల పరిధిలోని బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మండలంలో బూత్ స్థాయి అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక సమావేశ మందిరంలో మండలంలో బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు. వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటి నుంచే వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు.


బీఎల్‌వోలతో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దారు శ్రీనివాసులు

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 23: విద్యార్థుల్లో ఉపాధ్యాయులు అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈవో-2 టోత శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం దేకూరుపల్లి, జీ.అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తిని ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

నీటి సమస్యపై కమిషనర్‌కు వినతి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 23: నెల్లూరుపాలెంలో నిర్మించిన టిట్కో భవనాల్లో ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించాలని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ షేక్ పజుల్లాకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. నీటి సమస్య పరిష్కారానికి అనుమతి ఇస్తే తాము స్వంతంగా బోర్లు వేసుకుంటామని టిట్కో భవనవాసులు కోరారు. అయితే అందుకు ఆయన నిరాకరించారు. స్వంత బోర్లు వేసేందుకు అనుమతి ఇచ్చే అధికారం తనకు లేదని కౌన్సిల్ సమావేశంలో తెలిపి వారి ఆమోదంతో చేయాలన్నారు. ప్రస్తుతం నీటి సమస్య తలెత్తకుండా మున్సిపల్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

శిథిలావస్థలో కమ్యూనిటీహాలు



అనంతసాగరం, ఫిబ్రవరి 23: ఇస్కపల్లిలో నిర్మాణదశలో ఉన్నా కమ్యూనిటిహాలు పనులు పూర్తికాకుండానే శిథిలావస్థలకు చేరుకుంది. 10 ఏళ్ల క్రితం ఎంపీ నిధులతో పనులు ప్రారంభమవగా.. నిధుల మంజూరులో జాప్యంతో నిర్మాణదశలో పనులు ఆగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి దాన్ని ఉపయోగంలోకి తీసుకరావాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల ప్రచారంలో కురుగొండ్ల


ప్రజలకు అభివాదం చేస్తున్న కురుగొండ్ల

కలువాయి, ఫిబ్రవరి 23: తెలుగుదేశం ప్రభుత్వంలో వెంకటగిరి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మంచి చేశామని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం వెదనపర్తి, కేశమనేనిపల్లిలో రెండోరోజూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాల్లో ఎక్కడ మచ్చుకైనా అభివృద్ధి పనులు జరుగలేదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, దనియాల చంద్రయ్య నాయుడు, జగదల్ నాయుడు, సోమయ్య యాదవ్, కిషోర్‌రెడ్డి, పాల్గొన్నారు.

తాగునీటి పథకానికి రూ.19 లక్షల మంజూరు

లింగసముద్రం, ఫిబ్రవరి 23 : లింగసముద్రం పంచాయతీలోని పలు కాలనీల్లో తాగునీటి సరఫరా కోసం జలజీవన్ మిషన్ పథకం కింద రూ.19 లక్షలు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ టీ.సాగర్ శుక్రవారం తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో పంచాయతీలోని లింగసముద్రం, యాదవుల బజారు, రామకృష్ణాపురం, జంపాలవారిపాలెంలో పైపులైన్ వేసేందుకు పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో కుళాయిలు ఏర్పాటు చేసి మంచినీటిని సరఫరా చేస్తామన్నారు.

ఎంపీడీవో బదిలీల్లో తీరని ఉత్కంఠ


ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి

వరికుంటపాడు, ఫిబ్రవరి 23: ప్రకాశం జిల్లా యద్దనపూడి మండలం నుంచి బదిలీపై వచ్చిన తోట వెంకటకృష్ణకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అయితే ప్రస్తుతం ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీదేవి యథాస్థానమైన బోగోలు ఈవోపీఆర్డీగా వెళ్లేందుకు సుముఖంగా లేకపోవడంతో అటు కార్యాలయంలోనూ ఇటు ప్రజల్లోనూ ఎంపీడీవో నియామకంపై చర్చ జరుగుతోంది. గురువారం విధులు చేపట్టేందుకు నూతన ఎంపీడీవో రావడంతో ప్రస్తుతం ఉన్న ఎంపీడీవో తాను ఇక్కడే ఉండేందుకు గడువు కోరడంతో చేసేదేమీ ఏమీలేక ఆమె వెనుతిరిగి వెళ్లిపోయారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎట్టకేలకు బాధ్యతలు చేపట్టారు. పట్టువీడని ప్రస్తుత ఎంపీడీవో తమదైనశైలిలో అధికార పార్టీ నాయకుల చెంత చేరి ఉన్నతాధికారులపై వత్తిడి చేసేందుకు విశ్వప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆ నాయకులు ఆమెకే వత్తాసు పలుకుతుండడం అనుమానాలకు తావిస్తోంది. కాగా అక్కడి సిబ్బంది సైతం శుక్రవారం ఎవరు ఎంపీడీవోగా ఉన్నారో తెలియని అయోమయ పరిస్థితిలో మండల ప్రజలు ఉన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి


మందులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శ్రీదేవి

వరికుంటపాడు, ఫిబ్రవరి 23: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద అందిస్తున్న మెరుగైన వైద్యసేవలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీదేవి అన్నారు. శుక్రవారం తూర్పురొంపిదొడ్లలో నిర్వహించిన రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శిబిరం ద్వారా అన్నిరకాల వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు అయేషా, అబీద్, మాధవ, సుబ్రహ్మణ్యం, వైసీపీ మహిళా నాయకురాలు బత్తిన కొండమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటకృష్ణయ్య, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు ఎంతో దోహదపడుతుందని జెడ్పీటీసీ సభ్యుడు రామాంజనేయులయాదవ్ అన్నారు. జనగన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అప్పసముద్రంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైద్యులు శివకల్పన పాల్గొన్నారు.

జన్నత్‌హుస్సేన్ మృతికి సంతాపం

ఉదయగిరి, ఫిబ్రవరి 23: జిల్లాలో మంచికి మారుపేరుగా పనిచేసిన రిటైర్డ్ కలెక్టర్ జన్నత్‌హుస్సేన్ మృతికి శుక్రవారం పలువురు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, జేవీవీ జిల్లా రజతోత్సవ అధ్యక్షుడు పారుఖ్‌అలీ, గడియాల్సీ ఎస్థానీ, ఉప సర్పంచ్ ముర్తుజా ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఉదయగిరి, ఫిబ్రవరి 23: అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీడీపీవో పచ్చవ లావణ్య హెచ్చరించారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో నాలుగు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటించాలని..మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళావతి, రత్న, తేజస్విని, షాను పాల్గొన్నారు.

పొలం వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 23: పొలం వివాదంలో రెండు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ఇద్దరు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. నందిపాడు, రెడ్లదిన్నె గ్రామాల పరిధిలోని ఓ భూమి వివాదంలో ఉంది. ఆ పొలం తమదని ఇరువర్గాల మధ్య కొంత కాలంగా వాదన జరుగుతోంది. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ పూర్తయ్యే వరకు ఎవరూ పొలంలోకి వెళ్లవద్దని అధికారులు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అయితే రెడ్లదిన్నెకు చెందిన కొసినపోగు బాబు, తిరుపతయ్యలు శుక్రవారం వివాద భూమిలో దున్నుతుండగా నందిపాడుకు చెందిన కొసినపోగు దేవయ్య, పెంచలయ్య పొలం చదును చేస్తున్న వారిని అడ్డుకున్నారు. దీంతో బాబు, తిరుపతయ్య వారిపై దాడి చేయడంతో దేవయ్య, పెంచలయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెంచలయ్యకు మెరుగైన వైద్యం అవసరం కాగా ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు.

వారి నిర్ణయానికే కట్టుబడి ఉంటా

● ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని


మాట్లాడుతున్న బొల్లినేని రామారావు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 23: టికెట్ విషయంలో అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకొన్నా నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నిర్ణయానికే కట్టుబడి ఉంటానని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు అన్నారు. శుక్రవారం ఉదయగిరి ఫంక్షన్‌హాలులో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న అధ్యక్షతన జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశంలో బొల్లినేని మాట్లాడా రు. టికెట్ విషయంలో చంద్రబాబు, లోకేష్‌లు ఇంతవరకు తనను పిలిచి అడిగిన దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గాన్ని ఎవరూ చేయని విధంగా తాను అభివృద్ధి చేసినట్లు చెప్పుకొ చ్చారు. 2012లో నాటిన మొక్క నేడు చెట్టుగా మారి ఫలాలు ఇస్తుంటే, ఆ ఫలాలను మరొకరికి ఇవ్వడం మంచి పద్ధతి కాదన్నారు. చంద్రబాబు గీసిన గీతను తాను ఏనాడూ దాటలేదని, అవసరమైతే టిక్కెట్ విషయంలో ఆయనతో గట్టిగా మాట్లాడతానన్నారు. టికెట్ విషయంలో నెలకొన్న గందరగోళంపై నియోజకవర్గ పరిశీలకుడు వికాస్‌హరికృష్ణను పలువు రు నాయకులు, కార్యకర్తలు నిలదీశారు. 'మీరేం చేస్తున్నారు.. ఇక్కడ ఎవరి బలమేంటో అధిష్టానానికి చెప్పాల్సిన అవసరం లేదా.. ప్రతిసారి ఎన్నికలకు ముందు ఈ టికెట్ల గోల ఏమి'టని నిలదీశారు. బొల్లినేని వెంకటరామారావుకే టికెట్ కేటాయించాలని ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు మన్నేటి వెంకటరెడ్డి, దంతులూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు పేలపూడి వెంకటర్నతం, చంద్ర మధు, రియాజ్, మల్లంపాటి గురవయ్యనాయుడు, బొజ్జా నరసింహులు, కాకి ప్రసాద్, నల్లిపోగు రాజా, నరసింహ, గడ్డం వెంకటేశ్వర్లు, బొజ్జా శ్రీనివాసులు, చీదర్ల మల్లికార్జున, సందానీ, సజిల్, మాబాషా, అబ్బయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేత

వింజమూరు, ఫిబ్రవరి 23: మండలంలోని కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ మహిళా శిక్షణ కేంద్రంలో శుక్రవారం ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ కుట్టుమిషన్, బ్యూటీషియన్ కోర్సులు పూర్తి చేసుకున్న మహిళలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రసన్నుడికి పౌర్ణమి గరుడసేవ

బిట్రగుంట, ఫిబ్రవరి 23 : బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామికి మాస పౌర్ణమి సందర్భంగా శనివారం గరుడ సేవ నిర్వహించను న్నట్లు ఆలయ ఈవో రాధాకృష్ణ, చైర్మన్ శ్రీరామ్‌మాల్యాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మున్సిపల్ గదిలో ప్రైవేటు వ్యక్తి తిష్ఠ!

కందుకూరులో చర్చనీయాంశం

కందుకూరు, ఫిబ్రవరి 23: ప్రభుత్వ స్థలం ఆక్రమణ, దర్గాగా కబ్జా లాంటి వార్తలు మనం నిత్యం చూస్తూనే ఉంటాం. అయితే కందుకూరులో ఏకంగా మున్సిపాలిటీ లక్షలు వెచ్చించి నిర్మించిన గదిలో ఓ వ్యక్తి ఈ గది నాదంటూ దర్జాగా టేబుల్, కుర్చీలు వేసుకుని కూర్చున్నాడు. అధికారులు రమ్మంటున్నారని మున్సిపల్ సిబ్బంది వచ్చి పిలిచినా ఈ గది నాది ఏమైనా మాట్లాడదలిస్తే అధికారులనే నా వద్దకు రమ్మనండి అని వ్యక్తి హుకుం జారీ చేస్తుండడం విశేషం. అది మున్సిపల్ స్థలమేనని బల్లగుద్ది చెబుతున్న అధికారులు మాత్రం కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉందని చెబుతున్న కారణంగా అతని వద్దకు వెళ్లే సాహసం చేయలేకపోతున్నారు. ఇది శుక్రవారం కందుకూరు పట్టణంలో సర్వత్రా చర్చనీయాంశమైంది. పట్టణంలోని త్యాగరాజస్వామి గుడి సమీపంలో ప్రధాన రహదారికి పడమర వైపున ఒంగోలుకు చెందిన ఓ డాక్టరుకు గతంలో స్థలం ఉండేది. ఆ స్థలంకు ఆనుకుని పామూరు రోడ్డు నుంచి పాత టింబర్ డిపో వైపు వెళ్లే రోడ్డు కార్నర్‌లో కొంత మున్సిపాలిటీ స్థలం ఉండేది. పురాతనకాలంలో ఆ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి ఇటీవలి కాలంలో దానికి కూడా కొలతలు వేసి స్థానికులకు అమ్మేసుకుని వెళ్లే ప్రయత్నం చేయగా మున్సిపల్ అధికారులు కొలతలు వేసి ఇంతవరకు మున్సిపల్ స్థలమని తేల్చి చెప్పటంతో ఆ డాక్టరు తనకు సంబంధించిన స్థలాన్ని విక్రయించుకుని వెళ్లాడు. మున్సిపల్ స్థలంగా నిర్ధారించిన స్థలం మంచి వాణిజ్య కూడలి కావడం, అక్కడ గది స్థలం రూ.15 లక్షల వరకు ధర పలుకుతుండటంతో ఆ స్థలంలో ఇటీవలే మున్సిపాలిటీ రమారమి రూ.5 లక్షల వరకు ఖర్చుచేసి ఓ వాణిజ్య రూమును నిర్మించి షట్టర్లు ఏర్పాటు చేశారు. అయితే షట్టర్లకు ఇంకా తాళాలు వేయకముందే శుక్రవారం సాయంత్రం ఆ వ్యక్తి వచ్చి టేబుల్, కుర్చీలు ఆ గదిలో వేసుకుని కూర్చున్నాడు. ఈ గది నాదేనని తనవద్ద కోర్టు ఆర్డర్ ఉందని హుంకరించాడు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డిని వివరణ కోరగా ఆ స్థలం, గది మున్సిపాలిటీదేనని.. అందులో ఎలాంటి సందేహం లేదని పేర్కొన్నారు. స్ట్రీట్ సర్వే రికార్డు, ఇతర రికార్డులన్నీ ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. అయితే అతను ఏ పత్రాలు కోర్టుకు సమర్పించాడో, ఆ ఆర్డరు ఎలా వచ్చిందో చూడాల్సి ఉందన్నారు. కోర్టు ఉత్తర్వులు పరిశీలించాక తదుపరి చర్యలు తీసుకుంటామని ఎట్టిపరిస్థితుల్లో గదిని స్వాధీనం చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు.


మున్సిపల్ అధికారులు నిర్మించిన గదిలో ప్రైవేటు వ్యక్తి వేసుకున్న టేబుల్, కుర్చీలు

జామియా మసీద్‌లో 'కావ్య' ప్రార్థనలు

● జామియా మసీద్‌కు రూ.5లక్షల విరాళం


జామియా మసీదులో ప్రార్థన చేస్తున్న కావ్య

కావలి, ఫిబ్రవరి 23: కావలి పట్టణం రైల్వే రోడ్డులోని జామియా మసీద్‌లో ముస్లిం పెద్దలతో కలిసి శుక్రవారం టీడీపీ కావలి ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి ప్రార్థనలు చేశారు. ముస్లింల విన్నపం మేరకు మసీద్ అభివృద్ధికి రూ.5లక్షలు విరాళం ఇస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా కావ్య క్రిష్ణారెడ్డి విజయం సాధించాలని ముస్లింలు దువా చేశారు. అనంతరం కావ్య మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ముస్లింలకు మరో శ్మశాన వాటికను, ఉర్దూ, అరబిక్ పాఠశాల, కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. షాదీమంజిల్ పనులు కూడా పూర్తి చేయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జామియా మసీద్ అధ్యక్షుడు సయ్యద్ రషీద్, ముస్లీం నేతలు కిర్మాని సర్దార్, మౌలానా రషీద్, షేక్ ఇబ్రహీం, షేక్ హజరత్, షేక్ ఖమర్‌బాబు, సయ్యద్ రహీం, ఖాదర్‌బాష, రియాజ్, హఫీజ్, హస్సేన్, కరిముల్లా, నవాజ్‌ఖాన్ , పీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక : ముసునూరు 15వ వార్డుకు చెందిన ముస్లింలు పలువురు షేక్ నాయబ్ రసూల్, షేక్ మహ్మద్‌ల ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు.

కందుకూరులో మార్పు తథ్యం : ఇంటూరి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 23: కందుకూరు పట్టణంలో రాజకీయంగా ఈసారి మార్పు కనిపిస్తోందని, ప్రజలు తెలుగుదేశం పార్టీవైపే ఉన్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని 2వ వార్డు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నేతలతో కలిసి ఇంటూరి నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, షేక్ నాగూర్, యర్రా మునలయ్య, మల్లికార్జున, ఖాదర్‌బాషా, కూనం నరేంద్ర, రఘు, నాగూర్‌బాబు, మస్తాన్‌వలి, నాగరాజు, లక్ష్మణ్, వెంకాయమ్మ, రావి కోటేశ్వరమ్మ, మయూరి, మస్తాన్‌బాషా, మున్వార్, మధు పాల్గొన్నారు.

ఎస్వీపీఎంకు 160 క్యూసెక్కులు ఇవ్వాలి


నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట, ఫిబ్రవరి 23: ఒప్పందం ప్రకారం ఎస్వీపీఎం కాలువకు కేటాయించిన 160 క్యూసెక్కుల సాగునీరు ఇవ్వాలని కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అధికాలను ఆదేశించారు. బోగోలు మండలం కావలి కాలువ ఎస్వీపీఎం బ్రాంచ్ కాలువకు శుక్రవారం ఆయన సోమశిల జలాలు విడుదల చేశారు. ఆయన వెంట మండల కన్వీనర్ వీరరఘు, నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు మాల్యాద్రి, సర్పంచులు మాచర్ల, సురేష్‌గౌడ్, రైతు నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాసులు, సురేంద్రరెడ్డి, తదితరులు ఉన్నారు.

అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు


అయ్యవారిపల్లెలో అటవీ భూములను పరిశీలిస్తున్న అటవీ అధికారి నాగయ్య

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 23 : అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఫారెస్టర్ నాగయ్య తెలిపారు. మండలంలో అటవీ భూములు ఆక్రమణ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. శుక్రవారం ఆక్రమణలకు గురైన అటవీ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంపదను అక్రమంగా నరికివేసి తరలించినా చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

క్షయ వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ

లింగసముద్రం, ఫిబ్రవరి 23 : ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం 13 మంది క్షయ వ్యాధిగ్రస్థులకు వైద్యాధికారి డాక్టర్ పీ.రమేష్ పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీమన్నారాయణ, సీహెచ్‌వో జీ శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు స్పందన కరువు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 23 : మండలంలోని బడేవారిపాలెంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి స్పందన కరువైంది ఈ వైద్యశిబిరంలో రోగుల కంటే వైద్య సిబ్బందే అధికంగా కనిపించారు. రోగులు లేక కుర్చీలు ఖాళాగానే దర్శనమిచ్చాయి. ఉదయం 9-30 గంటలను ప్రారంభించాల్సిన వైద్య శిబిరం ప్రజలు లేక 11 గంటలకు ప్రారంభించారు. అప్పటికీ కూడ 20 మందికి మించి రోగులు రాలేదు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది గ్రామంలోకి వచ్చే సరికి ప్రజలు పొలాలకు వెళ్లిపోయారు. దీంతో వైద్య శిబిరం ప్రజలు లేక వెలవెలపోయింది. దీనికి తోడు గ్రామంలో ప్రచారం లేకపోవడం, శిబిరానికి వచ్చిన వారికి అన్నిరకాల జబ్బులకు మందులు లేకపోవడంతో ప్రజలు పెదవి విరిశారు.

శ్రీవారికి అశ్వ వాహన సేవ



కావలిటౌన్, ఫిబ్రవరి 23: ముసునూరు ట్రంకురోడ్డులో మందాటి చెరువు వద్ద వెలసివున్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి శుక్రవారం అశ్వవాహన సేవలందించారు. ఆలయ వ్యవస్థాపక అర్చకుడు వేదగిరి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తోమల సేవ, ప్రత్యేక అర్చనలు, హోమం పూజలు, వేంకటేశ్వరస్వామి వ్రతపూజలు జరిగాయి. రాత్రి శ్రీవారు అశ్వవాహనంపై పట్టణ పుర వీధుల్లో ఊరేగారు. భక్తులు అడుగడునా స్వామివారికి బ్రహ్మరథం పట్టారు.

24 మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, ఫిబ్రవరి 23: కావలి పట్టణ పరిధిలోని ముసునూరు టోల్‌ప్లాజా వద్ద గురువారం అర్ధరాత్రి నిర్వహించిన వాహనాల తనిఖీలో 24 మద్యం సీసాలు పట్టుబడ్డాయని రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. తమిళనాడులోని రేవతిపురంకు చెందిన సత్యన్నారాయణ హరిహరన్ తన కారులో హైదరాబాద్ నుంచి చెన్నైకు తన కారు డిక్కీలో మద్యం సీసాలు తీసుకువెళుతున్నట్లు తెలిపారు. నిందితుడుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఓటర్ల జాబితాలో అవకతవకలు సరి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఉలవపాడు, ఫిబ్రవరి 23 : నూతనంగా వచ్చిన ఓటర్ల జాబితాలో అవకతవకలను సరిచేసుకోవాల్సిన బాధ్యత ప్రతి బీఎల్వోపై ఉందని తహసీల్దారు రవిబాబు సూచించారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు అధ్యక్షతన మండల బీఎల్వోలతో స్వీప్‌పై అవగాహన సమావేశం జరిగింది. అనంతరం ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ వీరయ్య, రీసర్వే డీటీ రామమూర్తి, బీఎల్వోలు పాల్గొన్నారు.

షర్మిల అక్రమ అరెస్టుకు నిరసన

జలదంకి, ఫిబ్రవరి 23: దగా డీఎస్సీ పేరుతో సచివాలయం ముట్టడి కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని కాంగ్రెస్, వామపక్ష నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు జలదంకి బస్టాండు కూడలిలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వీ.శివశేఖర్‌రెడ్డి, సీపీఐ నేతలు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు, సీపీఎం నాయకుడు మేలంగి ఆంథోనీ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి వీఆర్‌వోల నియామకం

లింగసముద్రం, ఫిబ్రవరి 23 : లింగసముద్రం, చీమలపెంట, రాళ్లపాడు గ్రామాలకు ఇన్‌చార్జి వీఆర్‌వోలను నియమించారు. లింగసముద్రం గ్రామానికి రెగ్యులర్ వీఆర్‌వో లేక ఇక్కట్లు శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు తహసీల్దారు శ్రీచరణ్ స్పందించారు. లింగసముద్రంకు పెదపవని-2 వీఆర్‌వో షేక్ మస్తాన్‌వలి, చీమలపెంట, రాళ్లపాడుకు అన్నెబోయినపల్లి వీఆర్‌వో ప్రసాద్‌ను నియమించారు.

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 23 : మండలంలో ఉపాధి హామీ పనులపై చేపడుతున్న సామాజిక తనిఖీలు తూతూమంత్రంగా జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నెల 20వ తేది నుంచి సామాజిక తనిఖీ బృందాలు మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.8.95 కోట్లతో చేపట్టిన పనులను పరిశీలిస్తున్నారు. అయితే సామాజిక తనిఖీ బృందాలు ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద కమీషన్లు దండుకొని తప్పులును కప్పిపుచ్చుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూలీలను విచారించడంలేదని, బోగస్ మస్టర్లు గుర్తించడంలేదని, పనుల వద్దకు వెళ్లి పూర్తిస్థాయిలో కొలతలు తీయడంలేదని, కేవలం ఫీల్డ్ అసిస్టెంట్లు చెప్పినట్లు రికార్డులు సిద్ధం చేస్తున్నారన్నా ఆరోపణలున్నాయి. అక్రమాలు నిర్ధారణ అయితే లక్షల్లో రికవరీలు ఉంటుంది. ఇప్పటికైనా సామాజిక తనిఖీ బృందాలు పారదర్శకంగా విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత


రక్తదానం చేస్తున్న రోటరీ సభ్యులు

కావలి, ఫిబ్రవరి 23: రక్తదానం సామాజిక బాధ్యతగా భావించాలని కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. రోటరీ 119వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఉత్తర శివార్లలోని నయరా పెట్రోల్ బంక్ ప్రాంగణంలో శుక్రవారం కావలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా 50 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ కావలి అధ్యక్షుడు చెన్నంశెట్టి దినేష్, ప్రముఖులు డాక్టర్ మాధవ రెడ్డి, నల్లూరు రవికుమార్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, కేగోపి క్రిష్ణ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డీ.రవిప్రకాష్, కే.హరినారపరెడ్డి, నయరా ఎనర్జీ సేల్స్ ఆఫీసర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.